ప్రాచీన భారతీయ సాహిత్యంలో కథ

ఘండికోట బ్రహ్మాజీరావు



జనసేవా పబ్లికేషన్స్
46-18-11/6,
మండావారిపేట, దొండపర్తి,
విశాఖపట్నం - 530 016.

ప్రాచీన భారతీయ సాహిత్యంలో కథ

ఘండికోట బ్రహ్మాజీరావు
జనసేవా పబ్లికేషన్స్
46-18-11/6, మండావారిపేట, దొండపర్తి,
విశాఖపట్నం - 530 016.
ఫోన్ : 0891 - 746187

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఆర్థిక సహాయంతో ముద్రింపబడింది.

ముఖచిత్రం : శ్రీ బాలి.

ప్రతులకు :

1. విశాలాంధ్ర బుక్‌హౌస్ వారి అన్ని బ్రాంచిలలోను .....

2. రచయితపై చిరునామాకు .....

వెల : రూ॥ 25/-

ముద్రణ :

సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రిట్స్,
46-18-10, మండావారి పేట,
దొండపర్తి, విశాఖపట్నం - 530 016.
ఫోన్ : 0891 - 735878, 745925.



కృతజ్ఞతలు

1. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం యాజమాన్యం ఈ పుస్తకం ముద్రణకు రూ॥ 5,000/- సహాయం చేసింది. వారికి నాకృతజ్ఞతలు.

2. చక్కని గుణాఢ్యుడి ముఖ చిత్రం వేసిన శ్రీబాలి కి

3. అన్నివిధాల సహాయం చేసిన శ్రీ భమిడిపాటి రామగోపాలం గారికి

4. చాల ఉత్తమంగా ముద్రించిన సత్యం ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికి,

5. ముందుమాట వ్రాసిన ప్రొఫసర్ కోలవెన్ను మలయవాసిని గారికి

నా కృతజ్ఞతలు . . . .

ఘండికోట బ్రహ్మాజీరావు

విశాఖపట్నం - 16.
10-10-2001.

అభినందన

సుప్రసిద్ధ నవలాకారులు కథారచయిత **శ్రీ ఘండికోట బ్రహ్మాజీరావుగారు** తమ దృష్టిని కథామూలాల మీదకు ప్రసరించి పరిశీలించి పరిశోధించి కూర్చిన రచన **'ప్రాచీనభారతీయ సాహిత్యంలో కథ'.**

ఆబాలగోపాలాన్నీ వయస్సుతో నిమిత్తం లేకుండా అలరించే సాహితీప్రక్రియ కథ. కొన్నితరాలుగా మౌఖికజీవనం సాగించిన ప్రక్రియ ఇది. తల్లులు తమ శిశువులకు గోరుముద్దలతో పాటు, కథాఘట్టాల్ని అందించే సంస్కృతి భారతీయసంస్కృతి. మానవుని శీలాన్ని సరిదిద్దుకోవడానికి కథాసాహిత్యం ఎంతగానో దోహదంచేస్తుంది.

ఆనందంతో పాటు ఆలోచనలను కూడా పసిమనస్సుల్లో రేకెత్తించే ఈ పరమ రమణీయమైన కథా ప్రక్రియ గురించి శ్రీ ఘండికోట వారి కృషి అభినందనీయమైనది. భారతదేశంలో కథ వైదిక, బౌద్ధ, జైన మతవాఙ్మయాల్లో ఏయే రీతుల్లో వ్యాప్తి చెందినదీ వివరిస్తూ జైన సాహిత్యం కథకు చేసిన మహోపకారాన్ని సోపపత్తికంగా నిరూపించారు రచయిత.

ప్రాచీన సాహిత్యంలో కథాతత్త్వం అనే శీర్షికలో అఖ్యానం, నీతికథ, కథ అనే అవాంతర భేదాల లక్షణాలను వివిధ అలంకారిక గ్రంథాల నుండి క్రోడీకరించారు.

ప్రాచీన కథాసాహిత్యంలో వికాసంలో నీతికథ ఆవిర్భావం గురించి పంచతంత్ర మూల గ్రంథం గురించి, పంచతంత్ర ప్రభావంతో వెలువడ్డ ఇతర కథాగ్రంథాల గురించి నిశిత పరిశోధన చేసి వివరించారు.

బృహత్కథ, ఇతర కథా సంగ్రహాల స్వరూప స్వభావాలను లభించినంత మేరకు పేర్కొన్నారు. కథా స్వరూపం గురించి వివరించడానికి ఒక అధ్యాయాన్ని ప్రత్యేకించి – పలువురు ఆలంకారికుల నిర్వచనాలను వివరిస్తూ, కథాభేదాలు సోదాహరణంగా నిరూపించారు.

కథ, ఆఖ్యాయికా వంటి ప్రసిద్ధ భేదాలే కాక నిదర్శనం, మన్థల్లీ, మణికుల్యవంటి కథాభేదాలను శ్లోక నిర్వచనాలతో ఉట్టగించారు.

అగ్నిపురాణం చెప్పిన కథానికా లక్షణాలను క్రోడీకరిస్తూ రచన ముగించారు. కథామూలాలను ఆమూలచూడంగా ఆవిష్కరించి, విశ్లేషించి, రచన ఇది. కథను గురించి తెలుసుకోవాలనే కుతూహలంగల వారికీ, కథావిషయమై పరిశోధన చేసే విద్యార్థులకు కూడా ఈ రచన అత్యంతోపకారి కాగలదు.

కథాలక్షణ సర్వస్వంగా ఈ రచనను వెలువరించినందుకు శ్రీబ్రహ్మాజీరావు గారిని అభినందిస్తూ –

ఇలాగే నవలపై కూడా ఒక పరిశోధకా గ్రంథాన్ని అందించగలరని ఆశిస్తూ –

శుభాభినందనలతో

మలయవాసిని,

10.10.2001

ఆచార్యకోలవెన్ను మలయవాసిని
తెలుగుశాఖ
ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

ప్రాచీన భారతీయ సాహిత్యంలో కథ

భారతీయ భాషలు సంస్కృతానికి పూర్వం కూడా ఉన్నాయి. ఆనాటి నుండి కథ క్రమంగా వస్తున్నది. ఇప్పటికి కథను ఎవరూ మరచిపోలేదు; సజీవంగానే ఉంది. కాలంతో, సమాజంతో, విద్యావిజ్ఞాన విషయాలతో ఈ కథ పురోగమించింది. సాహిత్యవాహినిలో ఈ ప్రక్రియాశాఖ చేరిన తరువాత కళాత్మకమై శోభించింది. ఇతర సాహిత్య ప్రక్రియలకు భిన్నంగా, ఒక విలక్షణమైన జనప్రియసంప్రదాయాన్ని సంతరించుకొంది. గద్యంలో, పద్యంలో, గద్యపద్య మిశ్రమ రచనలో కథ వెలువడింది. రోచకత, ఉపదేశ యోగ్యత, మతపరంగానేకాక ఇతర రంగాలలో కూడా, కథకు ప్రయోజన బాహుళ్యాన్ని కలిగించాయి.

ప్రాచీన భారత కథా వాఙ్మయం :

విశ్వకథాసాహిత్యంలో ప్రాచీన భారతకథకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. భారతదేశానికి, ఖండాంతరాలకు, వేదవాఙ్మయకాలం నుండి భూ, జలమార్గాల సంబంధం ఏర్పడింది. వాణిజ్యంతో పాటు, మతం విద్య, శాస్త్ర విజ్ఞానం, ఇతరదేశాలకు వెళ్లాయి. వాటితో భారతకథ కూడా ప్రయాణం చేసింది. ఆకథలో ఏమి గొప్పదనముందో, అది విశ్వకథా సాహిత్యంలో స్థానం ఏర్పరచుకొని, నిలిచిపోయింది. కథకు భారతదేశమే పుట్టినిల్లను అభిప్రాయం చాలకాలం ప్రచారంలో ఉంది. ఇతర సాహిత్య ప్రక్రియలకు ఏవిధంగా తీసిపోకుండా, వాసిలోను, రాసిలోను వృద్ధి చెందింది. చరిత్ర కంటె సమకాలీన ప్రజాజీవితానికి ముఖ్యంగా దర్పణం పట్టి మనకు విస్మయం కలుగజేస్తున్నది, ప్రాచీనభారత కథా వాఙ్మయం.

కథ - ప్రాక్ - వైదికయుగం :

ఆదిమానవుడు తన మనోగతాభిప్రాయాలను వాగ్రూపంలో తెలుపగలిగిన నాటినుండి 'కథ' ఉత్పన్నమయినదని చెప్పడం అతిశయోక్తి కాదు. తాను విన్నవి, చూసినవి, ఊహించినవి తోటి మానవుడికి తెలియజేయడం అతని స్వభావగుణమై వెలసింది. బుద్ధి వికసించి, భాషవిస్తరించి తాను చెప్పు వాటిలో కొన్నిటిని సంక్షిప్తంగా చేసి, కొన్నిటిని విడిచిపెట్టి, మరికొన్నిటికి స్థిరత్వం ఆపాదించు సామర్థ్యం అతనికి కలిగింది. ఈకథన క్రమం అనాదిగా మానవుడితో పాటు అభివృద్ధి చెందింది.

ఆదిమానవుడు కథ చెప్పేటప్పుడు, కేవలం కథనంతోనే విరమించలేదు. వ్యాప్తిలో ఉన్న పదజాలం పరిమితంగా ఉండేది. భావవ్యక్తీకరణకు అది సరిపడలేదు. అతడు తన అభిప్రాయాన్ని చేష్టలతో వెలువరించడానికి మొదలుపెట్టాడు.

'ఆదిమానవులనాటి ప్రతికథ ఒకనాటకమే' అని గ్రోసే పండితుడు, (E.Grosse) చెప్పినాడు. సాహిత్య మంతటికి కథయే మూలం. సాహిత్యం రూపుదాల్చక పూర్వమే కథ ప్రచారంలోకి వచ్చింది. కాని, వైదిక సాహిత్యంలో మాత్రం ప్రాముఖ్యతను గడించలేక పోయింది.

కథ - వైదికసారస్వతం :

ఋగ్వేదంలో కథాత్మకాలయిన కొన్ని ఋక్కులున్నాయి. ఆవిధంగానే, గద్యపద్యమయాలైన చిన్న కథలు బ్రాహ్మణాలలో కూడా కనిపిస్తాయి. వీటికి గాథలు, నారాశంసులు, ఇతిహాసాలు మొదలైన పేర్లు ఉన్నాయి. నిరుక్తంలోను, బృహద్దేవతలోను కొన్ని కథలు ఉన్నాయి. వేదవాఙ్మయంలో, అతీతము, ఆఖ్యానము, పురాణము, ఇతిహాసము, కథ అన్న పదాలలో అంతగా భేదం కనిపించదు. వీటి అన్నిటికి 'పూర్వకథ' అన్న సామాన్యమైన అర్థమే చెప్పబడింది. దేవతల చరిత్రలు, మహారాజుల చరిత్రలు చెప్పడం వాటిలోని ప్రధాన లక్షణం. ఊర్వశీ పురూరవుల వృత్తాంతం, శునశ్శేపాదుల వృత్తాంతం ఇందుకు నిదర్శనాలు.

ఋగ్వేదంలో 'మానవుడు - మత్స్యము' అన్నకథ, ఇంద్రుడి రూపాంతరాలైన మర్కటకపింజల పక్షులకథ ఉన్నాయి. ఇవి జంతుకథలు - ఇటు వంటి కథలు ఛాందోగ్యోపనిషత్తులో ఉన్నాయి. అందులో ఒకటి శ్వానముల కథ. ఇది అధిక్షేపాత్మకమైనది. (1)

కొన్నికుక్కలు ఒక తెల్లకుక్క చుట్టూ చేరి, మంత్రాలను తమ కోసం చదివి, ఆహారం సంపాదించమని దానిని కోరుతాయి.

ఇంకొక కథలో జనశ్రుతి అన్న అతడు, రెండు రాజహంసల సంభాషణను, రైవతకుడు అన్న మరొకడి దృష్టికి తెచ్చినట్లు ఉంది.

మరొకకథలో, సత్యకాముడు వృషభం, రాజహంస మొదలైన వాటినుండి హితాన్ని పొందినట్లు ఉంది.

వైదిక వాఙ్మయంలో కథ బాహుళ్యాన్ని పొందలేక పోయింది. అక్కడక్కడమాత్రం లభిస్తున్నది.

---

(1) 'తస్మై శ్వా శ్వేతః ప్రాదుర్బభూవ - తమన్యేశ్వాన
ఉపసమేత్యోచు రన్నం నో భగవానాగా యత్వశనాయ మవా ఇతి'
ఛాందోగ్యోపనిషత్ - ప్రథమప్రపాఠకః - ద్వాదశఖండః

భారతీయుల దృష్టిలో ఇది దృష్టాంతమని చెప్పబడింది. కాని, డూసే మహాశయుని (Deussen) అభిప్రాయానుసారం, 'పురోహితులు, వారి అహంభావపూరితాలైన స్వప్రయోజనాలపై అధిక్షేపం' అని తెలుస్తున్నది.

కథ - ఇతిహాసపురాణాలు :

వ్యాసుడు తన భారతాన్ని సంహిత, పురాణం, ఆఖ్యానం, కథ, ఇతిహాసం, కావ్యం మొదలైన వివిధ నామాలతో పేర్కొన్నాడు. ఇవన్నీ తన రచనలో ఉన్నవని అతని అభిప్రాయం కాబోలు.

ఇతిహాస, పురాణశబ్దాలు సమానార్థాలుగనే తొలుత అనిపించాయి. కాని, అటు తరువాత వచ్చిన వాఙ్మయంలో వీటికి భిన్నార్థాలు ఏర్పడ్డాయి. ఇతిహాసం కథాప్రధానమైనది. పురాణం సర్గ, ప్రతిసర్గ మొదలైన పంచలక్షణాలతో కూడినది. కాని క్రమంగా, పురాణాలలో కూడా వర్ణనలు, కథలు ప్రవేశించాయి. అందుచేత ఇతిహాసపురాణాలు రెండింటికిని ఇపుడు పురాణమన్న పదమే సామాన్యంగా వాడుతున్నారు.

ఇతిహాసాలు వైదిక వాఙ్మయానికి, లౌకిక వాఙ్మయానికి మధ్యకాలంలో అవతరించాయి. లౌకికములే అయినా, మతవాతావరణంలో వ్యాప్తి చెందాయి.

'ఇతిహాసాలు మానవుల అంతరజీవితాలకు సంబంధించిన హృదయ భావాదులనుకాక, బాహ్యజీవితాన్నే ఎక్కువగా వర్ణిస్తాయి. అందుచేత వాటిలో జాతీయ జీవితం సువ్యక్తమవుతుంది.' అని ఎమ్.విలియమ్స్ పండితుడు చెప్పాడు.

రామాయణ భారతాలలో పెక్కు పూర్వకథలు చెప్పబడ్డాయి. అందుచేత ఈ రామాయణ భారతాలు వెలుగు చూడక ముందు, ఇతిహాసాలు, పురాణాలు, ఆఖ్యానాలు మొదలైన వాటికి సంబంధించిన రచనలు తప్పక ప్రచారంలో ఉండి ఉండవలెను. రామాయణ భారతాలలోని కథలు సుప్రసిద్ధములైనట్టివి. అవి భారతీయవాఙ్మయములన్నిటికి అనంతమైన వస్తుసంపదను సమకూర్చినట్టివి. అందుచేతనే వాటిలో ఉన్న కథలు భారతదేశంలోని మారుమూలలకు వ్యాపించి, విశ్వజనీనములై విలసిల్లాయి.

కౌరవపాండవుల కథతోపాటు అసంఖ్యాకంగా చక్కని ఉపాఖ్యానాలు భారతంలో ఉన్నాయి.

'ఈశ్వరుడు బృహతియగు (విశాలమైన) దిశకు వెడలినాడు. అతని వెంట ఇతిహాసములు, పురాణములు, గాథలు, నారాశంసులు కదిలినవి' అని అథర్వవేదంలో ఉంది.

పురాణం వేదసమ్మతమని ఛాందోగ్యోపనిషత్తులో ఉంది. శతపథబ్రాహ్మణంలో కూడా ఈవిధంగానే ఉంది.

పురాణాలు నీతికి ధర్మానికి నిధులు. లాక్షణికులు వీటిని మిత్రుల వంటివని చెప్తున్నారు. మానవులకు ఇవి కర్తవ్యాకర్తవ్యాలను కథల ద్వారా, ఉపాఖ్యానాల ద్వారా మిత్ర సమ్మతంగా బోధిస్తున్నవి.

కథ - బౌద్ధవాఙ్మయం :

సూత్రాలు, శ్లోకాలు, కథలు, జాతకాలు మొదలగు వాటి సహాయంతో బుద్ధుడు ఉపదేశాలను చేశాడని సద్ధర్మ పుండరీకంలో ఉంది. జాతకాలలో ఉన్న కొన్ని కథలు, బోధిసత్త్వుడితో ఎటువంటి సంబంధం లేనట్టివి. అవి ప్రాచీన గ్రంథాలలో కూడా ఉన్నాయి. తిత్తిర జాతకం, దీఘితికోసల జాతకం ఇటువంటివి. నిత్యజీవితంలో భాసించే బౌద్ధమత స్వరూపాన్ని తెలుసుకోడానికి ఇవి చాల ఉపకరిస్తాయి. ప్రతి జాతకంలో ఏదో ఒక విశిష్ట ధర్మాన్ని వివరించే ప్రధానవ్యక్తిగా బోధిసత్త్వుడు కనిపిస్తాడు.

జాతకకథలు :

జాతకమనగా జన్మానికి సంబంధించినది అని అర్థం. గౌతమబుద్ధుడి జన్మల గురించి చెప్పిన గ్రంథమిది. కాబట్టి దీనికి జాతకము, జాతకకథలు అన్న పేర్లు వచ్చినవి. గౌతముడు బుద్ధుడు అవడానికి 547 జన్మలను ఎత్తవలసి వచ్చింది. త్రిపిటకాలు పాలీభాషలో ఉన్నాయి. జాతకకథలు వాటిలో అంతర్గతంగా ఉన్నాయి. అట్ఠకథ త్రిపిటకాలకు భాష్యం వంటిది. అట్ఠకథ అంటే అర్థంతో కూడిన కథ. మహేంద్ర స్థవిరుడు క్రీస్తుపూర్వం నాలుగవ శతాబ్దంలో బుద్ధశాసనం స్థాపించడానికి సింహళం వెళ్లినాడు. అప్పుడు త్రిపిటకాలను, వాటితోపాటు అట్ఠకథలను తనతో తీసుకుపోయాడు. అట్ఠకథలు సింహళభాషలో ఉన్నవి. ఈ కథలను ఆచార్యబుద్ధఘోషుడు పాలీ భాషలోకి అనువదించాడు. పాలీ భాష చాల సుందరమైనది.

సాంచి, భరహుతస్తూపాలమీద, అమరావతి, నాగార్జున కొండ స్తూపాలమీద జాతక కథలను చెక్కారు. జాతకాలలో వచ్చు అట్ఠకథలలో మూడు భాగాలు ఉన్నవి. దూరేనిదానము, అవిదూరే నిదానము, సంతికేనిదానము అని వాటిని పిలుస్తారు. బోధిసత్త్వుడు సుమేధ తపస్విగా జన్మించి భగవన్ దీపంకరుని చరణాలవద్ద జీవితం అర్పించిన నాటినుండి, వెస్సంతరుడు శరీరం విడిచి తుషిత స్వర్గం ప్రవేశించే వరకు ఉన్నకథ దూరేనిదానకథ. బోధిసత్త్వుడు తుషితస్వర్గం నుండి పరిచ్యుతుడై మాయాదేవి గర్భమున జన్మించి బుద్ధగయలో బుద్ధత్వం పొందు వరకు ఉన్నకథ అవిదూరే నిదానకథ. బుద్ధభగవానుడు విహరిస్తూ జాతకాన్ని చెప్పి ఉల్లేఖించినప్పుడు సంతికనిదాన కథ.

జాతక కథలలో నాలుగు భాగాలున్నవి. ప్రత్యుత్పన్న వస్తువు, అతీత వస్తువు, అర్థవర్ణన, సమాదానము అన్నవి ఆ నాలుగు భాగాలు. బుద్ధ భగవానుడు ప్రత్యక్షంగా ఉన్నప్పుడు జరిగిన సంఘటనను ప్రత్యుత్పన్న వస్తువు అంటారు. ఏదో అవసరం వచ్చినప్పుడు

బుద్ధభగవానుడు చెప్పిన పూర్వకథా విధానం అతీత వస్తువు. కథలో ఉన్న గాథల యొక్క వాక్యార్థము, శబ్దార్థము, విశేషార్థము అనువాటి వివరణము, వ్యాకరణము అర్థవర్ణనమనబడుతున్నది. పూర్వజన్మలో బుద్ధుడెవరో, ప్రధానపాత్రలెవరో, ఎక్కడెక్కడ పుట్టినారో వాటి సమ్మేళనమే సమాదానము.

జాతక కథల సంఖ్య 547. కొందరు 550 వరకు ఉన్నవని అంటారు. ఈ కథలు 22 నిపాతాలలో ఉన్నాయి. నిపాతమంటే పరిచ్ఛేదమని అర్థం. ప్రథమనిపాతంలో 150 కథలున్నవి. ప్రతి కథలోను ఒకగాథ ఉంది. గాథ ఒక శ్లోకం. రెండవ నిపాతంలో 150 కథలున్నవి, కథకు మూడు గాథలున్నవి. నాలుగవ నిపాతంలో 50 కథలు, కథకు నాలుగు గాథలు ఉన్నవి. అయిదవ నిపాతం నుండి పదమూడవ నిపాతం వరకు కథల సంఖ్య ఈవిధంగానే ఉంది. తొమ్మిదవ నిపాతంలో మాత్రం 133 కథలున్నవి. పదునాల్గవ నిపాతం ప్రకీర్ణ నిపాతం. దీనిలో గల ఒక్కొక్క కథకు పదివరకు గాథలున్నవి. తరువాత వచ్చే నిపాతాలలోను 100 కన్న ఎక్కువగా గాథలున్నవి. ఇరవై రెండవ నిపాతానికి మహా నిపాతమని పేరు. దీనిలో పది కథలే ఉన్నవి. కాని ఒక్కొక్క కథలో వందల కొలది గాథలున్నవి. చివరిదైన వెస్సంతర జాతక కథలో 500 పైగా గాథలున్నవి.

జాతకాల సంఖ్య 547 కన్న ఎక్కువగా ఉండి ఉండవచ్చు. అట్ఠకథల వర్ణనలో మహాగోవింద జాతకం గురించి చెప్పబడింది. కాని ఆజాతకకథ ఈ 547 జాతకాలలో లేదు. కొన్ని జాతక కథలు పెద్దవి. వాటిలో చిన్న జాతక కథలు అంతర్గతములై ఉన్నాయి. ఒకే జాతకం వేరు వేరు పేర్లలో కనిపిస్తుంది. మొదటి నిపాతంలో మణిజాతకం, రెండవ నిపాతంలో సాలూరు జాతకం ఇటు వంటివి. కొన్ని జాతకాల పేర్లు ఒకే విధంగా ఉన్నప్పటికీ, వాటి కథలు మాత్రం భిన్నమైనవి. మత్స్య జాతకం ప్రథమ ద్వితీయ నిపాతాలలో కనిపిస్తుంది. కాని విషయం వేరుగా ఉంటుంది. జాతక కథలలోని అంతర్గత కథలు రమారమి వేయి వరకు ఉన్నాయి. ఈ కథలలో విషయ క్రమం లేదు. మొదటి మాటను బట్టి జాతకానికి పేరు పెట్టడం జరిగింది.

ఈ జాతక కథలలో బోధిసత్త్వుడు తపస్విగా, రాజుగా, వృక్షదేవతగా, బ్రాహ్మణుడుగా దర్శనమిస్తాడు. అప్పుడప్పుడు అతడు సింహం, ఏనుగు, గుర్రం, నక్క, కుక్క మొదలైన జన్మలు ఎత్తినట్లు కూడా వీటిలో ఉంది. కొన్ని కథలలో అతడు చండాల జన్మను, శూద్ర జన్మను ఎత్తినట్లు ఉంది.

చాల జాతక కథలు, 'వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలంలో' అని మొదలవుతాయి. ప్రతి కథలోను విధిగా ధర్మబోధ జరుగుతుంది.

ఈ జాతక కథల సంగ్రహకర్త ఎవరు? మహేంద్రుని వెంట ఈ కథలు సింహళానికి పోయాయి. అనూరాధపురంలో మహావిహారంలో మహాస్థవిర సంఘపాలుని దగ్గర ఈ కథలను బుద్ధఘోషుడు పఠించాడు. సింహళబౌద్ధసంఘం యొక్క అనుమతిని పొంది అతడు సింహళ భాషలో ఉన్న అట్ఠకథలను పాలీ భాషలోకి అనువదించాడు.

క్రీస్తు శకం మొదటి శతాబ్దంలో పట్ట గ్రామణి సింహళాన్ని పరిపాలించిన కాలంలో అట్ఠకథలు, త్రిపిటకాలు లిపిబద్ధములయాయి. కాని, అట్ఠకథలు క్రీస్తుశకం అయిదవ శతాబ్దం యొక్క చివరి భాగంలో తుదిరూపాన్ని పొందాయి. క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో చాలకథలు పేర్లతోకూడ భరహుతస్తూపం మీద చెక్కబడ్డాయి. ఈ కథలు క్రీస్తు పూర్వం అయిదవ శతాబ్దం నుండి క్రీస్తుశకం రెండవ శతాబ్దం వరకు రచింపబడి ఉండవచ్చును.

పూర్వకాలం కథాసాహిత్యం అన్ని మతాల వారికి చెంది ఉండేది. రచయితలు తమ తమ మతాల కు అనుగుణంగా వాటిని మలచుకున్నారు. జాతక కథా సాహిత్యం శుద్ధ భారతీయం.

జాతక కథలలో గారవము, బొంద, అయ్య, అక్క, అప్ప, సామి వంటి పదాలు కనిపిస్తాయి. ఇవన్నీ తెలుగు పదాలే. 'లంచం ఖాదిత్వా (లంచంతిని)' 'కాలం కృత్వా (కాలంచేసి)' మొదలైన పదబంధాలు, ఆంధ్రులు వాడుకలో ఉపయోగించే వాటి వలె ఉన్నాయి.

వివిధదేశవాఙ్మయాలలోని కథలకు జాతకకథలు ఆధారభూతాలని పండితులు అంగీకరిచారు. ప్రాచీనకాలంలోనే ఈ కథలు ఆసియా, ఐరోపాఖండాలకు వ్యాపించాయి. ఈసప్ కథలపై వీటి ప్రభావం పూర్తిగా ఉన్నట్లు రైస్ డేవిడ్ పండితుడు అభిప్రాయపడుతున్నాడు. ఎనిమిదవ శతాబ్దంలో ఈ కథలు అరబ్బుల ద్వారా ఇటలీ, స్పెయిన్ మొదలయిన దేశాలలో ప్రవేశించాయి. ఫ్రాన్స్ దేశంలో, మధ్యకాలానికి సంబంధించిన కథలలో పశుపక్ష్యాదుల కథలు విశేషంగా కనిపిస్తున్నాయి. వాటిపై జాతక కథల ప్రభావముందని ఫ్రెంచి విద్వాంసులు అంగీకరించారు.

ఆర్యశూరుడి జాతకమాల సంస్కృతభాషలో కావ్యపద్ధతిని వెలువడింది. సాహిత్యం రాజసన్మానానికి నోచుకున్న కాలం ప్రారంభమయింది. జాతకకథలు పాలీభాషలో ఉన్నాయి. ఆర్యశూరుడి జాతకమాలలోని కథలు అన్నీ ఈ జాతక కథలలోనివే. అవికాక చరియా పిటకం నుండి పన్నెండు కథలను కూడా ఆర్యశూరుడు గ్రహించాడు.

ఈ కథలన్నిటికీ ఒక ప్రయోజనముంది. బౌద్ధ ధర్మంలో, బుద్ధుడికి ఉండవలసిన

పారమితములను వివరించడానికి ఈ కథలు వెలువడ్డాయి. కాని, ఇవన్నీ పరమోత్తమమైన విషయాలను చెప్పి, సామరస్యం లేకుండా ఉండడంచేత ఆధునికులకు అంతగా నచ్చకపోవచ్చు. దీనిలో మొట్టమొదటి కథ జాతక కథలలోది కాదు. దీనియందు బోధిసత్త్వుని అసాధారణ కరుణ గురించి చెప్పడం జరిగింది. ఆకలిగొన్న ఆడపులి ఒకటి తన సంతానాన్ని పోషించలేక తనపిల్లలనే తినడానికి సిద్ధపడింది. బోధిసత్త్వుడు తన శరీరాన్ని ఆడపులికి అర్పించడానికి ముందు కురికాడు. కాని, త్యాగం విషయంలో, చేసిన వాళ్లకి, ఎవరి కోసం చేశారో వారికి అంతరంలో చాల భేదం ఉండకూడదు. సమకాలీనులకు, తరువాత కొన్ని సంవత్సరాల వరకు ఈ త్యాగం గొప్పదిగా తోచవచ్చు.

ఆర్యశూరుడి కథలు గద్యంలో వ్రాయబడి అక్కడక్కడ శ్లోకాలు చేర్చబడ్డాయి. ఈ పై శ్లోకాలు ఒకచోట తక్కువగా, మరొకచోట అధికంగా కనిపిస్తాయి. ఇటువంటి రచనకు ఆర్యశూరుడే మొదటివాడుకాదు. కుమారలాటుడు మొదలైన వారు చాలమంది ఇటువంటి రచనలు చేశారు. ఓల్డెన్‌బెర్గ్ (Oldenberg) అభిప్రాయానుసారం, హిందూదేశంలోను, ఇతరప్రపంచంలోను మొట్టమొదటి సాహిత్యం గద్యంలోనే వచ్చింది. ఆదిమానవులు, ఎక్కడెక్కడ భావావేశంతో చెప్పదలచారో అక్కడ మాత్రం సాహిత్యం పద్యరూపంలో వచ్చింది. ఏచోట దేవుడిని ఆరాధించవలసి వస్తుందో, శాపాన్ని ఇవ్వవలసి వస్తుందో, అప్పుడు, ప్రార్థనలు జరిపేటప్పుడు, భావోద్రిక్తను విశృంఖలంగా ప్రదర్శించవలసి వచ్చినప్పుడు, గద్యం బాటసారుల భాష అయి, అసంపూర్ణమయి, భావప్రకటనను చేయలేక పోయింది. ఇటువంటి సాహిత్యం ఋగ్వేదంలోను, ఇదిహాసాలలోను జాతకకథలు మొదలైన ప్రాచీన గ్రంథాలలోను కనిపిస్తుంది. శ్లోకరూపమైన భాగాన్ని మాత్రం మార్పు చేయకుండా జాగ్రత్తగా ఉంచి, గద్యరూపంలో ఉన్న భాగాన్ని తమకు తోచిన రీతిని కథకులు మార్చి, చేర్చి కథలు చెప్పేవారు. క్రమంగా సాహిత్యంలో గద్యభాగం తొలగి, శ్లోకాలు ప్రవేశపెట్టినట్లు కనిపిస్తుంది.

అవదానవాఙ్మయం :

మనుష్యుడి కర్మఫలానికి సంబంధించిన ఆఖ్యానాలపై, బుద్ధుడి తరువాత కాలమందు అభిరుచి పెరిగింది. ఈ అభిప్రాయం ఆనాటి ఆఖ్యానాలలో ప్రాముఖ్యత వహించింది. అవదానములు అనగా మనుష్యుడి భావిజన్మలపై ప్రభావంకల మహత్కార్యాలను తెలుపు ఆఖ్యానాలు. బౌద్ధసాహిత్యవృక్షం మీద అవదానవాఙ్మయం ఒకశాఖ, ఏదైనా ఘనకార్యానికి అవదానమంటారు. బౌద్ధుల పరిభాషలో మతానికికాని,

ధర్మానికి కాని, నీతికి కాని సంబంధించిన గొప్పకార్యమని అర్థం. దయావీరమునకుకాని, దానవీరమునకు కాని, ధర్మవీరమునకుకాని సంబంధించిన బౌద్ధుల కథలే అవదానవాఙ్మయం. ఈ కథలు వినయపిటికంలోను, సూత్రపిటకంలోను అక్కడక్కడ కనిపిస్తాయి. అవదానవాఙ్మయం హీనయాన మహాయానాలకు సంబంధించినది. ప్రాచీనవాఙ్మయం హీనయానానికి, అర్వాచీన వాఙ్మయం మహాయానానికి చెందినది.

అవదానవాఙ్మయంలో ప్రాచీనమైనది అవదానశతకం, ఇది హీనయాన సంప్రదాయానికి చెందినది. క్రీస్తుశకం మూడవశతాబ్దం పూర్వార్థంలో, చైనా భాషలోకి ఇది అనవదింపబడినది. ఈ గ్రంథంలో 'దీనారం' అన్నపదం వాడబడింది. కాబట్టి క్రీస్తుశకం ఒకటవ శతాబ్దానికి పూర్వం ఈ గ్రంథరచనసాగి ఉండదు. ఒకొక్క విషయం గురించి ఒకొక్క దశకం ఉంది. అటువంటివి పది దశకాలు ఉన్నాయి. మొదటినాలుగు దశకాలు బుద్ధుడి వృత్తాంతం తెలుపుతాయి. భూతప్రేతాల వృత్తాంతాలు అయిదవశకంలో కథావస్తువులయినాయి. ఆరవదశకంలో మానవులు పక్షులు స్వర్గం చేరేకథలు ఉన్నాయి. మిగిలిన నాలుగు దశకాలలో అర్హతత్వం గురించి చెప్పే కథలు ఉన్నాయి.

కళాదృష్టితో పరిశీలించినట్లయితే ఈ గ్రంథం ఉత్తమమయినదని చెప్పలేం, కథా కథనపద్ధతి ఒకేవిధంగా సాగింది. వర్ణనలు, సంఘటనలు, పలుకుబడులు, సామెతలు చాలచోట్ల కనిపిస్తాయి. ఈ కథలన్నిటిలోను ఆరంభం సూత్రబద్ధంగా కనిపిస్తుంది. వర్ణనలు కూడా అదేవిధంగా ఉంటాయి. బుద్ధుడిహాసం, బుద్ధుడి నీతిబోధ అన్ని కథలలోను ఒకేవిధంగా వర్ణింపబడ్డాయి. కథనం అతిశయోక్తులతో నిండి, వివాదాత్మకమై, శ్రమదాయకంగా ఉంటుంది. రచనా సౌందర్యం ఉపదేశంకోసం త్యజింపబడింది. విమర్శనా దృష్టితో ఈ కథలను పరిశీలిస్తే అక్కడక్కడ కొన్ని అందమైన భాగలు లభిస్తాయి.

మైత్రకన్యకుడు తల్లిపట్ల చేసిన అపచారాలకై నరకానికి పోతాడు. ఎర్రగాకాలిన ఇనుపచక్రమొకటి అరవై ఆరువేల సంవత్సరాలు తలపైపెట్టుకొని మోయవలసిన శిక్ష అతనికి విధింపబడుతుంది. మరి ఒకడు అటువంటి నేరమేచేసి, అదే శిక్ష అనుభవించడానికి వచ్చేవరకు అతనికి ముక్తి లభించదని తెలుస్తుంది. మైత్రకన్యకుడు శిక్షవలన కలిగే బాధను ఎంతకాలమైనా ఓర్చడానికి కృతనిశ్చయుడౌతాడు. ఆ నిశ్చయానికతడు రాగానే అతనికి బాధను కలిగిస్తున్న చక్రం అదృశ్యమై పోతుంది.

బింబిసారుడు బుద్ధుడి అస్థికలను ఒక స్తూపంలో నిక్షేపించాడు. ఆస్తూపాన్ని అంతః పురజనం పూజించాలని నిర్ణయించాడు. పితృహంత అయిన అజాతశత్రువు మాత్రం

ఆస్తూపాన్ని పూజించే స్త్రీ ఎవరైనా ఆమెకు మరణదండన తప్పదని శాసిస్తాడు. కాని బింబిసారుడి భార్య శ్రీమతి ఈ ఆజ్ఞను అతిక్రమించి స్తూపాన్ని పూజిస్తుంది. రాజాజ్ఞను అనుసరించి ఆమెను చంపుతారు. తిరిగి ఆమె దేవలోకంలో జన్మిస్తుంది.

దివ్యావదానం సాహిత్యదృష్టితో చూస్తే ఇంకా ఆసక్తిదాయకంగా ఉంటుంది. అవదానశతకంలో వలేనే ఇందులోకూడా చాల కథలు శ్రావస్తివాదానికి చెందిన వినయపిటకం నుండి గ్రహింపబడ్డాయి. ఈ గ్రంథం యొక్క రచనాకాలం మాత్రం ఇంతవరకు నిర్ధారణ కాలేదు. దీని పుట్టుకగురించి భిన్నములైన అభిప్రాయాలున్నవి. ఒకభాగం మహాయానానికి చెందినది. కాని, గ్రంథం యొక్క శరీరం మాత్రం హీనయానానికి చెందినది. 'దీనారం' అన్నపదం దీనిలోనూ ఉంది. శార్దూలకర్ణావదానం అన్న ఒక విఖ్యాతమైన కథ చైనాభాషలోనికి క్రీస్తుశకం 265 లో అనువదింపబడింది.

ప్రకృతి అన్న కన్య బుద్ధుడి ప్రియశిష్యుడైన ఆనందుడిని గాఢంగా ప్రేమించింది. పరిస్థితులు విషమించాయి. ఆనందుడు ఈ మహాప్రమాదాన్ని ఎదుర్కోలేక బుద్ధభగవానుడిని శరణుజొచ్చినాడు. అప్పుడు బుద్ధదేవుడు బోధనాచాతుర్యంతో ఆ కన్యను బౌద్ధధర్మానికి మార్చివేస్తాడు.

ఈ కథలకు మకుటాయమానమైనది కుణాలుని దీనమైన వృత్తాంతం. కుణాలుడు అశోకుడి పుత్రుడు. కొడుకుపై ఏ విధమైన ద్వేషంకాని, క్రోధంకాని అశోకుడికి లేదు. కుణాలుడి సవతి తల్లి, అతని తండ్రి మనసును విషపూరితం చేసి కుణాలుడి కళ్లను పెరికించి వేస్తుంది.

ఇంతకన్నా దుఃఖదారుణమైన కథ మరొకటి ఉంది. ఆకలిగొన్న తల్లి ఒకతె తనకన్న బిడ్డనే తినడానికి ఉద్యమిస్తుంది. రూపావతి అన్న స్త్రీ మరొకతె, ఆ తల్లి ఆకలి తీర్చడానికి తన స్తనాలను కోసి ఇస్తుంది. లోకాన్ని పరిరక్షించే బోధిసత్త్వుడి అవతారమే రూపావతి. ఆమె తిరిగి రూపావతుడను రాజకుమారుడిగా జన్మిస్తుంది.

మూలకథా వస్తువుయొక్క వైవిధ్యంచేత, ఈ గ్రంథంయొక్క శైలి ఒడుదుడుకులతో నిండి ఉన్నది. కొన్ని చోట్ల గాథలతో నిండి, సరళమైన సంస్కృతగద్యంలో రచింపబడి, అక్కడక్కడ పెద్ద వృత్తాంతాలతోను, లాక్షణికులు మెచ్చే సమాసభూయిష్ఠమైన భాషతోను ఉంది. ముప్పైఎనిమిదవ అవదానంలో ఉన్న మైత్ర కన్యకుడి కథ, అవదానశతకంలోవలె శైలీగంభీరమై కనిపిస్తుంది.

అశోకుడి వృత్తాంతమున్న కథలు కొన్ని ఉన్నాయి. ఒక కథలో శీలవంతుడైన ఉపగుప్తుడు, రాక్షసుడైన మారుడి మనోపరివర్తన చేసేచోట నాటకీయత స్పష్టమవుతుంది. చాల ఉన్నతమైన ఈ అభిప్రాయం ఉత్తమసంకల్పంతోను భావమాధుర్యంతోను కొనసాగుతుంది. బుద్ధుడు ఏనాడో మృతుడయాడు, కాని అతని రూపంలో మారుడిని చూడదలచాడు, ఉపగుప్తుడు. అతని కోరికను మారుడు ఆమోదించి బుద్ధుడి రూపంలో ఉపగుప్తుడి ఎదుట నిలిచడాడు. తాను పూజించే ఆచార్యుడి అద్భుతరూపాన్ని దర్శించగనే, పూజకై ఉపగుప్తుడు మోకరిల్లాడు.

దివ్యావదానమాల, కల్పద్రుమావదానమాల, రత్నావదానమాల, అశోకావదానమాల, ద్వావింశద్యవదానం, భద్రకల్పావదానం, విచిత్రకర్ణికావాదానం మొదలైన వాటిలోను, క్షేమేంద్రుడి అవదానకల్పలతలోను, బౌద్ధుల ఆచారవ్యవహారాలు, వ్రతాలు, మాహాత్మ్యాలు నిండి ఉన్నాయి. కథావస్తువు వలెనే భాషకూడా వివిధగతులలో ఉంది. కొన్ని కథలు చక్కని సంస్కృతంలోను, కొన్నిభ్రష్ట సంస్కృతంలోను, కొన్ని పాలీభాషలోను ఉన్నాయి.

కథ-జైనవాఙ్మయం :

జైనమతం బౌద్ధమతం కన్న ప్రాచీనమైనది. కాని, మతధర్మాలకు సంబంధించిన సాహిత్యం మాత్రం తొలుత లభించలేదు. అందుచేతనే బౌద్ధసాహిత్యాన్ని ముందు గుర్తించడం, ఆ వెనుక జైనసాహిత్య ప్రసక్తి తేవడం ఆచారమయింది.

జైనుల శాస్త్రగ్రంథాలు ధూళివలెపొడిగా, విషయం సంబంధించిన మేరకే, ఉపదేశమే ప్రధానంగా వ్రాసినవి. మానవులకు సాధారణంగా కలిగే పఠనోత్సుకతను కూడా ఈ గ్రంథాలు ఇవ్వలేక పోయాయి. ఈ విషయంలో బౌద్ధగ్రంథాలు మెరుగు. అవి పఠనయోగ్యాలయి జనాదరణను పొందాయి. అందు చేతనే, జైనులమత గ్రంథాలు, ప్రత్యేకంగా వాటికోసమే కృషిచేసే వారికే తప్ప సామాన్య పాఠకులకు రుచించకుండా పోయాయి.

భారతీయభాషా చరిత్రలో జైనసారస్వతం చాలముఖ్యమైనది. జైనులు తమరచనలను జనసామాన్యానికి అందుబాటులో ఉన్నట్లు వ్రాశారు. అందుచేతనే మతగ్రంథాలను, ప్రాచీన వ్యాఖ్యానాలను ప్రాకృతభాషలైన మాగధీమహారాష్ట్ర భాషలలో రచించారు. ఎనిమిదవ శతాబ్దం తరువాత శ్వేతాంబర జైనులు, అంతకు కొద్దికాలం ముందు దిగంబరజైనులు సంస్కృతంలో వ్రాయడం మొదలుపెట్టారు. కొంతమంది సరళసంస్కృతంలోను, ఇతరులు కావ్యశైలిలోను మరికొందరు వాడుక భాషకు సమీపంలో ఉన్న ప్రాకృత ఛాయలు గల సంస్కృతంలోను

వ్రాశారు. పదవశతాబ్దం నుండి పన్నెండవ శతాబ్దం వరకు అపభ్రంశం యొక్క మాండలికాల వేపు వారి కవిత్వం మరలింది. ఆధునికకాలంలో వారు దేశబాషలకు తరలిపోయారు. వారి సారస్వతంతో గుజరాతీ హిందీ భాషలను, దక్షిణాదిని తమిళ, కన్నడభాషలను పుష్టివంతం చేశారు.

భారతీయ సాహిత్యశాఖలలో జైనులు స్పృశించనిది ఏదీ లేదు. అన్నిటికన్న కథాసాహిత్యం అమితంగా వారి పోషణలో పెంపు చెందింది. వారు పురాణాలు వ్రాశారు. ఆఖ్యానాలు వ్రాశారు. నాటకాలు వ్రాశారు; స్తోత్రాలు వ్రాశారు. ఒక్కొక్కప్పుడు ప్రజల వాడుక భాషలో సరళంగా వ్రాశారు. మరొకసారి క్లిష్టంగా, అలంకారయుక్తమైన మహాకావ్యశైలిలో వ్రాశారు. వైదుష్యం ప్రదర్శించే ముఖ్య రచనలు చేశారు.

జైనసాహిత్యంలో వ్యాఖ్యానాలుగా వెలసిన నిజ్జుక్తులకు (నిర్యుక్తులకు) ఆర్యాశ్లోకాలలోను, జైనమహారాష్ట్రిలోను సూక్ష్మమైన వివరణలు ఉన్నాయి. బహూశా ఇవి ముఖతః వ్యాఖ్యానంచేసిన ఆచార్యులపై చెప్పిన స్మృతిశ్లోకాలు కావచ్చు. కాని అటుతరువాత ఈ నిజ్జుత్తులు ప్రాకృతములో వ్రాయబడిన విపులవ్యాఖ్యానాలుగా రూపొందాయి. భాష్యములు, చూర్ణికలు, సంస్కృత వాఖ్యానాలకు (టీకాలు, వృత్తులు, అవచూర్ణులు) ఇవి పునాదులు. ఈ వ్యాఖ్యానాలు అల్లుకొని ఉండడంచేత ఒకదానినుండి మరొకదానిని వేరు చేయడం కష్టసాధ్యమవుతుంది. ఈ వ్యాఖ్యానాలలో పురాతనాలు, చారిత్రకాలు అయిన సంప్రదాయాలు ఒకవంక, జనప్రియాలైన కథనవిషయసముదాయం, మరొకవంక లభిస్తాయి.

బౌద్ధ సన్యాసులవలె జైనసన్యాసులు కూడా తమ ధర్మోపదేశాలను కథాకథనంతో అలంకరించి, ప్రాపంచిక కథలను మహాపురుషుల ఉపాఖ్యానాల కింద మార్చి జైనధర్మాలను ఉదాహరణలుగా చెప్పి, కథాశ్రవణకౌతుకులైన హైందవులను తమ ధర్మానికి వీలయినంత సన్నిహితులుగా చేయడానికి ప్రయత్నించారు.

'దశ వేయాలియ (దశవైకాలిక)'కు సంబంధించిన నిజ్జుత్తిలో ప్రాణాలుతీసిన డబ్బు సంచికథ కనిపిస్తుంది.

బీదవాళ్లైన ఇద్దరుసోదరులు పొరుగూరిలో వ్యాపారం చేసి ధనం సంపాదించి తిరిగి వస్తుంటారు. వారిలో వారికి ఆడబ్బును అపహరించాలననే కోరిక కలుగుతుంది. ఒకరు మరొకరిని చంపి డబ్బులంకించుకుందామనుకుంటారు. కాని, వాళ్లు తమ దుష్టసంకల్పానికి తామే సిగ్గుపడి, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకుంటారు. తమ భావాలకు మూలమైన డబ్బు సంచిని ఒక చెరువులో విసిరివేస్తారు. ఒక చేప ఆ సంచిని మింగుతుంది. ఆ చేపను

తరుగుతుంటే డబ్బుసంచి బయటపడుతుంది. అపుడు యజమానురాలికి దాసికి జగడం సంభవించి, చివరకు యజమానురాలు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది.

ఈ నిజ్జుత్తిలోనే ఒక హాస్యభరితమైన సంభాషణ కూడా లభిస్తుంది.

"ఓ సన్యాసీ! నువ్వు కట్టిన బట్టకు ఇన్ని మడతలెందుకు?"

"అవును- చేపలు పట్టేటపుడు ఇది వలగా ఉపయోగిస్తుంది."

"నువ్వు చేపలను తింటావా?"

"వాటిని మద్యంతో తీసుకుంటాను."

"నువ్వు సురాపానం చేస్తావా?"

"ఉంపుడుకత్తెతో కలిసి సేవిస్తాను."

"నువ్వు వ్యభిచారివి కూడానా?"

"నా శత్రువులను నిర్మూలించిన తరువాత అటువంటిపని చేస్తాను."

"అయితే నీకు విరోధులు కూడా ఉన్నారా?"

"నేను దోచుకున్న ఇళ్ళయజమానులు విరోధులు కాక ఏం చేస్తారు?"

"నువ్వు దొంగవా?"

"జూదమాడడం వలన దొంగతనం చేయవలసి వస్తుంది".

"బాగు! నువ్వు జూదరివా?"

"కాకేమి! నేను బానిసదాని కొడుకును కదా!"

బౌద్ధులకన్న జైనులు వ్యాప్తిలో ఉన్న జనప్రియమైన కథాసాహిత్యాన్ని బ్రాహ్మణపారమ్పతం నుండి, ఇతరభారతీయ సాహిత్యం నుండి గ్రహించి ఉపయోగించుకున్నారు. తమ మతంలో చేరేవారికి ఇతరత్రా లభించే ఉపదేశసాహిత్యాన్ని ప్రసాదించారు. జైనమతానికి ఏమాత్రం సంబంధం లేని పురాతన కథావస్తువులను కూడా కొన్నిటిని గ్రహించారు. మిగిలినచోట్ల వ్యాప్తిలో ఉన్న కథాసాహిత్యానికి జైనమతస్వరూపాన్ని అంటగట్టి, పూర్తిగా మార్చివేసి పాడుచేశారు. ఏది ఎట్లయినా, ఒక విషయం మాత్రం మరచిపోడానికి వీలులేదు. ప్రాచీన భారతదేశంలో అంతటా అల్లుకున్న కథావాఙ్మయంలో రత్నాలవంటివి జైనుల కథాసాహిత్యంతోను, వారివ్యాఖ్యానాలతోను మనకు సంక్రమించాయి. లేకపోతే, ఇంత ఉత్తమమైన సాహిత్యం కాలగర్భంలో కలిసి నశించిపోయేదే, ఇతరత్ర లభించని ఆసక్తిదాయకలైన ఇతిహాసాలను, ఆఖ్యానాలను కూడా, జైనులు భద్రపరిచారు.

'ఉత్తరజ్ఝయణం (ఉత్తరాధ్యయనం)' అన్న గ్రంథానికి దేవేంద్రుడు వ్యాఖ్యానం

రచించాడు. దానిలో సగరుడి గురించి, గంగావతరణం గురించి వ్రాస్తూ, సగరుడి పుత్రులు చనిపోయిన ఘట్టాన్ని తీసుకొని, దానిద్వారా జైనధర్మాలను బోధించడానికి పూనుకుంటాడు. ఈ సందర్భంలోనే 'కిశాగోతమి - ఆవగింజలు' లన్న బౌద్ధకథవంటిది ఒకటి చెప్తాడు: పచ్చేక బుద్ధకథలు (ప్రత్యేకబుద్ధుల కథలు)' సంపూర్ణంగా ఆ వ్యాఖ్యానంలోనే ఉదహరింపబడతాయి. నాలుగవ వాడయిన రాజర్షినగాయియొక్క కథలో కన్యామంజరి ప్రవేశపెట్టబడుతుంది. ఈ కన్యామంజరి అరబ్బీరాత్రులలోని షహరజాద్ పాత్రవంటిది. అతిసుందరములైన మూలదేవుడి కథ, దేవదత్తుడికథ తన తరువాత తరాలవారికి అందించి దేవేంద్రుడు చరితార్థుడయాడు. మూలదేవుడు సకలవిద్యలు తెలిసినవాడు. దేవదత్తగణిక. మూలదేవుడు నిజమైన వ్యక్తికావచ్చు. బహుశా అతడే కామశాస్త్ర గ్రంథకర్త కావచ్చు. మండియుడు అన్న చోరుడికథకూడా మనకు అందులో దొరుకుతుంది. ఇతడు పగటిపూట బిచ్చమెత్తి ప్రజలకరుణకు పాత్రుడయి, రాత్రివేళ హత్యలు చేసి దోపిడికాడయి ప్రజలను భయభ్రాంతులను చేసేవాడు. గద్యంలో అంగదత్తుడు చెప్పిన మరొక చోరుడి కథనుకూడా, చాలసుందరమైన పురాతనకావ్యవాతావరణంలో మనకు దేవేంద్రుడి వ్యాఖ్యానం అందజేస్తుంది.

ఈ ఉత్తరజ్ఝయణంలో మరోకథుంది. ఇందులోని పేర్లు కృష్ణుడి చరిత్రకు చెందినవి.

సౌర్యపురంలో ఇద్దరు రాజపుత్రులుండేవారు- పెద్దవాడు వాసుదేవుడు, అతడికి ఇద్దరుభార్యలు, రోహిణి, దేవకి. వారికి రాముడు, కేశవుడు అన్న పుత్రులున్నారు. రెండవవాడు సముద్రవిజయుడు, అతడిభార్య పేరు శివా. ఆమెకు అరిష్టనేమి అన్న కొడుకు ఉన్నాడు. కేశవుడు అరిష్టనేమికోసం మహారాజ పుత్రిక అయిన రాజీమతిని నిశ్చయం చేశాడు. నూతనవధువు కోసం చాలపటాటోపంతో అరిష్టనేమి ప్రయాణం చేశాడు. దారిలో చాలజంతువులు బోనులలోను, కంచెల మధ్యను నిర్బంధింపబడి ఉండడం చూసి అతడు వాటిగురించి ప్రశ్నించాడు. ఆ జంతువులనన్నిటిని తనపెండ్లినాటి విందుకు చంపుతారని తెలుసుకొని అతడు చాలఖిన్నుడై యతివ్రతం స్వీకరించడానికి నిశ్చయిస్తాడు. రాజీమతికి ఈ సంగతి తెలుస్తోంది. ఆమెకూడ సన్యాసం స్వీకరించడానికి నిశ్చయిస్తుంది. సన్యాసినిగా ఆమె పర్యటిస్తున్నప్పుడు ఒకరోజు వర్షం కురుస్తుంటే, దగ్గిరలో ఉన్న గుహలో తలదాచుకుంటుంది. ఆ గుహలో తానుతప్ప మరెవరూ లేరని ఆమెతలచి, కట్టిన తడిబట్టలు విప్పి ఆరవేస్తుంది. అరిష్టనేమికి ఒక అన్న ఉన్నాడు. అతడు అంతకు పూర్వమే ఆగుహలో ప్రవేశించాడు. రాజీమతి యొక్క నగ్నసౌందర్యాన్ని కళ్లార చూసి, చలించి ఆమెకోసం ఆర్రులు చాచాడు. అమె అతనిపై కోపించింది. 'ఒకరు ఉమిసిన దానిని తాగవద్దు' అని

బుద్ధి చెప్పింది. ములుకులవంటి ఆమె పలుకులకు అతడు దారిపట్టి, తనధర్మాన్ని స్మరించి, అయుశంతో పొడిచిన ఏనుగువలె మతనియమాలవేపు మరలిపోతాడు.

ఆసక్తికరమైన చాల ఆఖ్యానాలు హరిభద్రుడి వ్యాఖ్యానాలలో ఉన్నాయి. అవశ్యకథలలో వాసుదేవుడి గురించి ఉంది. ఈ వాసుదేవుడు అన్నిటిలోను మంచినే చూసేవాడు. ఒక భిక్షుడు దారిపక్కను పడివున్న ఒకకుక్క యొక్క కళేబరంలోకి ప్రవేశిస్తాడు. ఆకుక్కదంతాలు చాల అందంగా ఉంటాయి. కాని ఆ కళేబరం నుండి వచ్చే దుర్వాసనను భరించలేక దారిని పోయేవారు అసహ్యంతో తప్పుకునేవారు. అపుడు వాసుదేవుడు ఆదారినే వచ్చి, ఆ కళేబరాన్ని నిదానంగా చూసి, 'ఎంత దివ్యంగా ఈకుక్కదంతాలు మెరుస్తున్నవో!' అని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తాడు.

పరిశిష్టపర్వం లేక స్థవిరావళి చరితలో చాలకథలు, అన్నిరకాలవి, మనకు లభిస్తాయి. ఇది హేమచంద్రుడి గ్రంథం. హరిభద్రుడి వ్యాఖ్యానాలనుండి, ప్రాకృతభాషనుండి, కథలను సంస్కృతంలోకి హెచ్చు మార్పులు లేకుండా ఇతడు అనువదించాడు. సామెతలతోను, గ్రామ్యపదజాలంతోను నిండిన ఈ కథలు జనసామాన్యం నుండి వచ్చినవని వేరే చెప్పనక్కరలేదు.

భారతీయసాహిత్యంలోనే కాక విశ్వసాహిత్యంలోనే విఖ్యాతమైన చాలకథలు పరిశిష్ట పర్వంలో లభిస్తాయి. కుబేరసేన గణిక. ఆమెకు కవలలు జనిస్తారు కుబేరదత్తకుబేరదత్తులు ఇది మాతృగమనపాతకానికి చెందిన దుఃఖాంత వృత్తాంతం. అనాది నుండి, కథావస్తువైన, గ్రెగరీ మహాత్ముడి క్రైస్తవ కథను మరపించేటట్లు ఈ కథ వ్రాయబడింది.

భారతీయ రచయిత దృష్టిలో దుఃఖకారణమైన అక్రమసంబంధం అంతగొప్పదికాదు. మునులువ్రాసే చతురమైన వ్యభిచారకథలకు స్త్రీల దుశ్చేష్టలు కావలసినంత సామగ్రిని సమకూర్చాయి. విశ్వసాహిత్యంలో అటువంటి ఉద్దేశ్యమే ప్రకటించే కథలవంటివి పరిశిష్ట పర్వంలో అధికంగా ఉన్నాయి. యోగినియైనకోశా, స్థూలభద్రులకథ అటువంటి సన్యాసుల మతాలకు సంబంధించిన కథలలోనిదే.

ముగ్గురు సన్యాసులు ఆచార్యుడి సమక్షంలో ప్రతిజ్ఞలు చేస్తారు. మొదటి సన్యాసి తాను సింహముండే గుహాద్వారంలో వర్షాకాలం నాలుగునెలలు గడుపుతానంటాడు. రెండవ అతడు భయంకరమైన విషసర్పం నివసించే పుట్టమీదకూర్చొని ఆనాలుగు నెలలుగడపగలనని అంటాడు. మూడవ అతడు ఆ నాలుగు వర్షాకాలపునెలలు నూతిగట్టున కూర్చొని గడుపుతానన్నాడు. అప్పుడు అక్కడికి వచ్చిన స్థూలభద్రుడు తానుకూడా ప్రతిజ్ఞలో పాల్గొని,

పూర్వాశ్రమంలో తన ప్రియురాలైన కుశా అన్న పేరు గల గణిక సమక్షంలో ఆ నాలుగుమాసాలు బ్రహ్మచర్యవ్రతం భంగం కాకుండా గడపగలనని వక్కాణిస్తాడు. అతడు తనప్రయత్నమందు కృతకృత్యుడవుతాడు. అంతేకాకుండాకుశాగణికనుకూడా సన్యాసినిగా మార్చివేస్తాడు. వర్షాకాలం గడిచిన తరువాత నలుగురు సన్యాసులు ఆచార్యుడి దగ్గిరికి తిరిగి వస్తారు. స్థూలభద్రుడు అద్భుతమైన కార్యం సాధించాడని ఆచార్యుడు ప్రకటిస్తాడు. మిగిలిన సన్యాసులు ఈ ప్రకటన పట్ల ఈర్ష్యాళువులై, సింహమున్న గుహాద్వారంలో నివసించిన సన్యాసి, రాబోయే వర్షాకాలంలో తానుకూడా స్థూలభద్రుడివలెనే కుశాగణిక గృహంలో వ్రతభంగం కాకుండా నివసించి వస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. కాని కుశాగణిక మరులలో సులువుగా చిక్కుకుంటాడు. చివరకు పశ్చాత్తాపపడి ఆమెద్వారానే తిరిగి ఆశ్రమం చేరుకుంటాడు. కుశాగణిక కూడా సన్యాసినిగా మారుతుంది.

భావదేవసూరి క్రీస్తు శకం 1255లో పార్శ్వనాథ చరితను వ్రాశాడు. పార్శ్వనాథుడి వృత్తాంతం ప్రధానకథ. ఆ కథలోకి దేశంలో ప్రచారంలో ఉన్న చాలకథలు, నీతికథలు, గంధర్వకథలు ప్రవేశపెట్టబడినవి. ఎన్నో కథలు జైనసారస్వతం నుండి, లౌకికసాహిత్యం నుండి గ్రహింపబడ్డాయి. బంగారు మనిషిని చంపితే అతను నిధిగామారిన కథ, గాలిలో మేడలు కట్టిన బ్రాహ్మణుడి కథ, వ్యాధిగ్రస్తుడైన హరిశ్చంద్రుడికథ, నలుగురు కోడళ్ల కథ మొదలైనవి ఎన్నో ఉన్నాయి. సువర్ణబాహు చరిత్రలో శకుంతలో పాఖ్యానం యొక్క ఛాయలు కలనిపిస్తాయి. కాళిదాసుడి నాటకపరిచయం ఇందులో కనిపిస్తుంది. చిలుకగామారిన విక్రమార్కుడికథ ఆసక్తిదాయకమయినది.

విక్రమార్కమహారాజు సకలవిద్యాసమన్వితుడు. ఒకఋషి నుండి పరకాయప్రవేశ విద్య నేర్చుకుంటాడు. అతనితో పాటే మరో బ్రహ్మణుడుకూడా ఆ విద్యనే నేర్చుకుంటాడు. ఒకసారి విక్రమార్కుడు తనదేహన్ని విడిచి ఒక ఏనుగు శరీరంలో ప్రవేశిస్తాడు. వంచకుడైన బ్రాహ్మణుడు ఆ తరుణం చూసి మహారాజు శరీరంలో ప్రవేశిస్తాడు. విక్రమార్కుడికి ఈ విషయం తెలిసి, ఒకచచ్చిన చిలుక శరీరంలో ప్రవేశించి, వేటకాళ్లకు పట్టుబడి, మహారాణికి విక్రయింపబడతాడు. ఆమెకు కొద్దికాలంలోనే ఇష్టుడై, సమస్యలను చెప్పి, వాటిని పూరించుతూ, సదుపదేశాలను, జైనమత బోధలను చేస్తూ ఉంటాడు. ఆ సమస్యలు ప్రచారంలో ఉన్నవికావు. పాండిత్యమే ప్రధానంగా కలవి. ఒక సమస్యను చిలుకకిచ్చి మహారాణి సాధించమంటుంది. "పాములను విషరహితములుగా చేస్తుంది. దేవతలను శక్తి హీనులను చేస్తుంది. సింహాలను చలనం లేకుండా చేస్తుంది. కాని, చిన్న పిల్లలు సైరందానిని చేతులతో పట్టుకోగలరు. ఏమిటిది? చిలుక వెంటనే గ్రహించి జవాబు చెప్తుంది.

"చిత్రకారుడికుంచె", చిలుకను చాలవిధాలుగా పరీక్షించి, లభించిన ప్రమాణాల వలన, ఆ తెలివైన చిలుక తన భర్త అయిన విక్రమార్క మహారాజుకాక మరొకరు కారని ఒక నిశ్చయానికి వస్తుంది, మహారాణి. ఒకనాడు విక్రమార్కుడు చిలుక శరీరం విడిచి ఒక బల్లి శరీరంలోకి ప్రవేశిస్తాడు. చిలుక చావుకి మహారాణి శోకించి, తాను కూడా చనిపోతానని అంటుంది. వంచకుడైన రాజు, మహారాణి ఆత్మాహుతి చేసుకోకుండా, వెంటనే ఆ చిలుక దేహంలోకి ప్రవేశిస్తాడు. నిజమైన మహారాజు తన శరీరంలోకి ప్రవేశించి మహారాణి ఎదుట అత్యంతశోభతో ప్రత్యక్షమవుతాడు.

భారతీయ కథాసాహిత్యంలోవలెనే పార్శ్వనాథచరిత్రలో కూడ శీలం మీద, లౌకిక జ్ఞానం మీద చాల ఉపదేశాలున్నాయి.

"చీకటికొట్లలో ఉండవచ్చు. కొత్తచోట్ల స్వేచ్ఛగా తిరుగవచ్చు. చివరకు నరకంలోనైనా నివసించవచ్చు. కాని, ఇద్దరు పెళ్లాలతో కాపురం మాత్రం వద్దు."

"దురదృష్టం వరిస్తే చావు ఉత్తమం. యాచించడం కూడా చాల మంచిది. సిగ్గు లేకుండా శత్రువులకు కూడా దాస్యం చేయవచ్చు. కాని, బంధువుల నుండి సహాయం అర్థించరాదు."

"విద్వాంసులు గంగానదిలో ఎంత ఇసుక ఉంటుందో తెలుసుకుంటారు. సముద్రంలో ఎంతజలముందో చెప్పగలరు. మహాపర్వతం యొక్క కొలతలు తీయగలరు. కాని ఆడదాని మనసు ఎంత లోతో కనిపెట్టలేరు."

తరువాత కాలాలలో జైనులు కథాగ్రంథాలు వ్రాశారు. ప్రధానకథలో ప్రవేశపెట్టిన అవాంతర కథలున్న గ్రంథాలు రచించారు. కేవలం కథలుండే రచనలే చేశారు. అవాంతర కథలున్న గ్రంథం సమ్యక్త్వకౌముది. దీని రచయిత ఎవరో తెలియదు. ఈ కథాగ్రంథం యొక్క అవాంతరకథలకు జైనమతంతో సంబంధం కల్పించేది ప్రధానకథ. వర్తకుడైన అర్హద్దాసు తన అష్టభార్యలకు, వారు తిరిగి భర్తకు కథలు చెప్పి ఏవిధంగా సమ్యక్త్వమును (ధర్మములో పరిపూర్ణత్వాన్ని) పొందినారో ఈప్రధానకథ తెలుపుతుంది. ఆసమయంలో మంత్రితో కలిసి నగరవీథులలో సంచారం చేస్తున్నరాజు, హారూన్ అల్ రషీద్‌వలే, ఆకథలన్నీ వింటాడు. మరొక దొంగ కూడా ఆ కథలు వింటాడు. సుయోధన మహారాజు తన మంత్రి యొక్క అప్రమత్తతను పరిశీలింపదలచి, తానే స్వంత ధనాగారంలో ప్రవేశించి, మంత్రిచే దొంగగా పట్టుబడతాడు. రోజుకొక నీతికథచెప్పి, అతడిని సన్మార్గానికి తేడానికి ప్రయత్నిస్తారు. అపుడు, రాజుగా వ్యవహరిస్తున్న వాడు దొంగ అని తెలుస్తుంది. ప్రజలందరూ అతడిని శిక్షిస్తారు.

కథాకోశం ఆఖ్యానాలకు విలువైన గని, దానిలోని చాల కథలు విశ్వసాహితికి చెందినవి. ఈ గ్రంథం యొక్క సంకలనకారుడెవడో తెలియదు. భాష భ్రష్ట సంస్కృతంలోను, శ్లోకాలు ప్రాకృతంలోను ఉన్నాయి. కొన్ని కథలు సరళంగా రసహీనంగా ఉన్నా, కొన్ని కథలు మాత్రం ఆణిముత్యాల వంటివి లభిస్తాయి.

అపభ్రంశ భాషలో శ్రీచంద్రుడు కథాకోశం రచించాడు. ఇది పదోశతాబ్దంలోనో, లేక పండ్రెండవ శతాబ్దంలోనో వ్రాయబడింది. దీనిలో 53 ఆఖ్యానాలున్నాయి.

అమితగతి క్రీస్తుశకం 1014లో 'ధర్మపరీక్ష' అన్న ఉద్గ్రంథమొకటి రచించాడు. ఇది ధార్మిక గ్రంథం. బ్రాహ్మణులను జైనులుగా మార్చడానికి ఎన్నో అసందర్భాలు, నమ్మరాని కథలు దీనిలో చెప్పడం జరిగింది. ఈ పరివర్తనామహాకార్యాన్ని నెపంగా తీసుకొని, అమితగతి ప్రచారంలో ఉన్న చాల ఉపాఖ్యానాలను గ్రంథస్థం చేశాడు. ఒకరితో చెప్పిన కథలో లేక ప్రాకృతభాషలో ఉన్న గ్రంథంలోని కథలో అవి. జనప్రియాలైన ఆ కథలు రెండు తరగతులకు చెందినవి ఒకటి మూర్ఖుల కథలకు చెందుతాయి. రెండవది అబద్ధాల అద్భుత కథలకు చెందుతుంది.

నలుగురు మూర్ఖులు ఒక యతికి ఎదురుపడతారు. అతడు వాళ్లను పలుకరిస్తాడు. ఎవరిని యతి పలుకరించాడో తెలియక వాళ్లలో వాళ్లు జగడమాడడం మొదలు పెడతారు. తగువు తెగక వాళ్లు యతిని సమీపించి అడుగుతారు. "మీలో అతి మూర్ఖుడైన వాడిని నేను పలుకరించాను" అంటాడతడు. వాళ్లలో ఎవరు అతిమూర్ఖులో నిర్ధారణకాలేదు. వాళ్లందరూ నగర ప్రజల దగ్గరికి పోయి తమ తమ మూర్ఖత్వం గురించి చెప్పడం మొదలుపెట్టారు. మొదటివాడు తన భార్యలు ఇద్దరూ నిద్రిస్తుంటే వారికి నిద్రాభంగం కలుగకుండా ఉండాలని తన కళ్ళను దీపంతో కాల్చుకున్నాడు. రెండవ వాడు దుష్ట భార్యలిద్దరూ తన కాళ్లు విరుగగొడుతుంటే సమ్మతించాడు. నాలుగవవాడు అత్తగారి భయం వల్ల బుగ్గ పొడిపించుకున్నాడు. మూడవవాడు మాత్రం మరోదారి తొక్కాడు. ఒకసారి భార్యతో కలిసి పక్కమీద పడుకున్నాడు. అప్పుడు భార్యాభర్తలు ఒక పందెం వేశారు. ముందు ఎవరు మాట్లాడుతారో వాళ్లు రెండవవారికి పది అప్పాలను ఇచ్చుకోవాలి. వాళ్లిద్దరూ నిశ్శబ్దంగా పడుక్కున్నప్పుడు దొంగ ఒకడు ఇంటి లోపలికి ప్రవేశించాడు. దొంగిలించవలసిన వస్తువులన్నీ దొంగిలించాడు. ఆతరువాత వాడు భార్య కట్టిన చీరముడి విప్పుతుంటే ఆమె మరి సహించలేకపోయింది. "ఏమిటి? ఇప్పుడు కూడా కళ్లిప్పి చక్కగా చూస్తూ ఊరుకున్నావా?" అని గర్జించింది. అప్పుడామగడు పది అప్పాలను ఇవ్వమంటాడు. ఎందుచేతనంటే ఆమె ముందుగా మాట్లాడింది.

పచ్చి అబద్ధాలతో కూడిన కథలలో ఒక దానిని ఉదాహరించవచ్చు. ఒక మనుష్యుడు చక్కని చెట్టును ఒక దానిని చూసి, దాని పళ్లను రుచి చూడదలిచాడు. కాని, చెట్టు చాల ఎత్తుగా ఉంది. అప్పుడామనుష్యుడు తన శిరస్సును ఖండించి చెట్టు మీదికి విసిరివేశాడు. అక్కడ ఆతల కావలసినన్ని పళ్లుతింది. తరువాత ఆ శిరస్సును తిరిగి కంఠానికి అతికి వేశాడతడు.

వర్ధమానుడి శిష్యుడైన జినేశ్వరుడు క్రీస్తుశకం 1092లో కథానక కోశం రచించాడు. పధ్నాలుగవ శతాబ్దంలో రాజశేఖరుడు అంతర కథాసంగ్రహం వ్రాశాడు. దానిలోని కథలు అంతకు పూర్వం రచింపబడిన గ్రంథాలలోనివి. క్రీస్తుశకం 1448లో కథామహోదధి సోమ చంద్రుడిచేత సంకలనం చేయబడింది. దీనిలో 187 కథలున్నాయి. కొన్ని ప్రాకృతంలోను, కొన్ని సంస్కృతంలోను ఉన్నా, శ్లోకాలు మాత్రం ప్రాకృతంలోనే ఉన్నాయి. క్రీస్తుశకం 1464లో లక్ష్మీసాగరసూరి శిష్యుడైన శుభశీలజ్ఞాని పంచశతి ప్రబోధ సంబంధం రచించాడు. అయిదు వందలకు బదులు అందులో ఆరువందల వరకు కథలున్నాయి. చారిత్రకాలు, ఆఖ్యానాలు, కల్పనాకథలు, గంధర్వకథలు, నీతికథలు, ఉపాఖ్యానాలు మొదలైనవి దానిలో ఉన్నాయి. ఇతడే భరతాది కథ లేక కథాకోశం అన్న గ్రంథాన్ని క్రీస్తుశకం 1452లో వ్రాశాడు. ఇవికాక ఇతర కథాగ్రంథాలను కూడా అతడు రచించాడు.

కథానకాలు లేక చిన్న కథలు చాలవరకు వ్యాఖ్యానాలలో లభిస్తాయి. వీటిని స్వతంత్రంగా కూడా రచించారు. ఒకప్పుడు వీటినే కావ్యాలుగా వ్రాశారు.

'కాలకాచార్య కథానకం' ప్రాకృతంలో శ్లోకంలోను గద్యంలో వ్రాయబడింది. భాష సరళంగా ఉన్నా వర్ణనలు మాత్రం కావ్యశైలిలో నడిచాయి.

'కుమార చరిత కథానకం' కూడ ఏనాటిదో తెలియదు జైనమత సంబంధి అయిన ప్రధానకథలోకి అద్భుతమైన సాహస కథలు ప్రవేశపెట్టబడ్డాయి. భాష సంస్కృతమే, కాని, రచనలో వాడిన మాండలిక పదాల బట్టి ఈ గ్రంథం గుజరాతులో జన్మించినట్లు తెలుస్తుంది.

'పాపబుద్ధి-ధర్మబుద్ధి' కథానకంకూడా ఇటు వంటిదే. జనకీర్తి పదిహేనవ శతాబ్దంలో 'చంపకశ్రేష్ఠి కథానకం' వ్రాశాడు దీనిలో చంద్రహాసుడి కథను పోలిన కథ ఉంది. ఇటువంటిదే 'అఘటక కుమార కథ' కూడా.

క్రీస్తుశకం 1530లో నేమిదత్తుడు 'ఆరాధనా కథాకోశం' వ్రాశాడు. క్రీస్తుశకం 1600లో హేమవిజయుడు 'కథారత్నాకరం' వ్రాశాడు. దీనిలో ఉన్న ప్రారంభ శ్లోకాలలో జైనధర్మం

కనిపిస్తుంది. మిగిలిన కథాభాగం పంచతంత్రాది కథాగ్రంథాలను పోలింది. స్త్రీల చాతుర్యాన్ని చెప్పే కథలు, వంచకుల కథలు, మూర్ఖుల కథలు, గంధర్వకథలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. వాటిలో కొన్ని బ్రాహ్మణులను అవహేళన చేసేవి ఉన్నాయి. ఉదయధర్ముడు క్రీస్తుశకం 1450లో సంస్కృతంలో రచించిన 'ధర్మకల్పద్రుమం'లో చాల చక్కని కథలున్నాయి.

మేరు తుంగుడి 'ప్రబంధ చింతామణి' (క్రీ॥శ॥ 1306)లో రాజశేఖరుడి 'ప్రబంధకోశం' లో (క్రీ॥శ॥ 1349) చారిత్రక కథలు, జీవితచరిత్రలు కొన్ని కనిపిస్తాయి.

జైనమునులు స్వతహాగా రచయితలు. చరిత్రలు వ్రాయడం కన్నకథలు చెప్పడమే ముఖ్యంగా చేశారు. వ్యాఖ్యానాలలో వారి సంప్రదాయ రచనలేకాక ఆఖ్యానాలు గంధర్వకథలు, సామాన్యకథలు కనిపిస్తాయి. పురాణాలు చరిత్రలు కేవలం ప్రధాన కథలకు సంబంధించగా, అవాంతర కథలుగా నానారకాలైన కథలు, గంధర్వకథలు ప్రవేశపెట్టబడ్డాయి. అపారమైన గంధర్వకథాసాహిత్యాన్ని జైనులు సృష్టించారు. ఈ కథాసాహిత్యం గద్యంలోను, శ్లోకంలోను, సంస్కృతప్రాకృతాలలోను, అపభ్రంశభాషలోను వచ్చింది. ఈ రచనలన్నీ సరళగద్యంలోకాని, సామాన్య శ్లోకాలలో కాని, ఉన్న కథలు కావచ్చు, లేక విపులమైన కావ్యాలుకాని, ఆఖ్యాయికలు కాని, పురాణాలు కాని కావచ్చు. అన్నీ మతబోధనలే. వాటినెప్పుడూ వినోదం కోసం ఉపయోగించలేదు. వాటిని మత బోధనకు, ఉపదేశం కొరకు ప్రత్యేకించడం జరిగింది.

జైన సాహిత్యంలోని కథలు, కథాగ్రంథాలు అసంఖ్యాకాలు. ఇవి ఇతర సాహిత్యాలలో లభించేవాటికన్న అధికంగా ఉన్నాయి. వీటిలో కొన్ని మధ్యయుగానికి సంబంధించినా, చాల వరకు ప్రాచీన సాహిత్యానికి చెందినదే. గంధర్వకథ గురించి తులనాత్మకాధ్యయనం చేసే విద్యార్థికే ఈ కథలు ఉపకరిస్తాయని అనుకోనక్కరలేదు. ఇవి సామాన్య ప్రజానీకం యొక్క యధార్థ జీవితానికి దర్పణాలు. ఇవి ప్రజల భాషకు సమీపంలో వ్రాయబడినవి. బ్రాహ్మణ సాహిత్యంలోని రాజులను పురోహితులను మాత్రమేకాక, దైనందినం ఎదురయే వివిధ తరగతి ప్రజల జీవితాలను ఇవి చిత్రీకరించాయి.

మరి ఏ ఇతర భారతీయ వాఙ్మయం చేయలేని మహోపకారం జైన సాహిత్యం వలన లభించింది.



ప్రాచీనసాహిత్యంలో కథాతత్త్వం

ఆఖ్యానం, నీతికథ, కథ

ఆఖ్యానాలు(Tales), నీతి కథలు (fables) కథలు (stories) అనువవి భారతీయులు భావక్షేత్రాలలో ఆదియందే సాహిత్యస్థాయిని పొందాయి. ఈ కథా సాహిత్యం బౌద్ధ జైన గ్రంథాలలోనేకాక కావ్యాలలోకూడా ఉత్తమ స్థానాన్ని ఆక్రమించింది. పాశ్చాత్యుల దృష్టిని ఈ కథాసాహిత్యమే ఆకర్షించింది.

పురాణాలలోను, కావ్యాలలోను, ఒకే విధమైన కథా విషయం పునశ్చరణ చేయబడింది. నాటకాలలో కూడా పురాణాలలోని విషయమే గ్రహింపబడింది. ప్రహసనాలన్నీ ఒకే గాడిలో నడిచాయి. 'భారతీయులకు కల్పనాచాతుర్యం లేదా?" అని పాశ్చాత్యులు సందేహించారు కూడా.

కాని, ఈలోపాన్ని కథా సాహిత్యం తీర్చివేసింది. కథలలో అద్భుతాలైన అవాంతర కథలను కల్పించి, అనంతములైన ఊహాలోక సౌందర్యాలను సృష్టించారు. నీతి కథలలో సహజములైనట్టివి, హాస్యయుతమయినట్టివి దృశ్యాలను ప్రసరించారు. కావ్య సాహిత్యంలో మనకు లభించే పాత్రలు మూసలో పోసినట్లు ఉంటాయి. కథలలో అందుకు భిన్నంగా వివిధ తరగతుల ప్రజలు కనిపిస్తారు. నీతికథలలో జంతురూపాలతో మనకు ప్రత్యక్షమవుతారు. ఈపాత్రలలో కావ్యనాటకాలలో లభించే ధీరోదాత్తులైన రాజులు, సుందరీమణులైన రాణులు పూజనీయులైన పురోహితులేకాక నిత్యజీవితంలో ఎదురయే సామాన్యులు ఎందరో ఉన్నారు.

కర్షకులు, శ్రామికులు, వర్తకులు, శిల్పులు, ఇంద్ర జాలికులు, ధూర్తులు, మూర్ఖులు, స్వలాభపరులైన బ్రాహ్మణులు, దుశ్చేష్టులైన సన్యాసులు, వేశ్యలు, తార్పుడు కత్తెలు మొదలైన వాళ్లందరూ ఈ కథా సాహిత్యంలో కనిపిస్తారు. విశ్వ సాహిత్యంలో కావ్య శాఖలందు ఏదీ ఈ కథాసాహిత్యంవలె ప్రాచుర్యాన్ని పొందినది కనిపించలేదు. భారతీయ కథా సాహిత్యం యూరోపు, ఆసియా ఖండాలలో కల అన్ని దేశాలకు ప్రాకి, ఆఖ్యానాలకు, కథలకు భారతదేశమే జన్మస్థానమని పేరుకెక్కింది. విదేశయాత్రికులు, వర్తకులు, ఈనోట ఆనోట విన్నకథలు ఇతర దేశాలలో విస్తరింపజేశారన్న మాట ఉండనే ఉంది. భారతదేశ గ్రంథ సంపత్తికూడా ఇతరదేశాలలో అనువదింపబడి వ్యాప్తి చెందింది. అన్ని కథలకు భారతదేశమే పుట్టినిల్లు అన్న అభిప్రాయం చాలాకాలం కొనసాగింది. జానపదకథా సాహిత్యం గురించి పరిశోధనలు జరిపిన తరువాత, ఈ అభిప్రాయం వెనుకబడింది. కాని, చాల కథలకు భారతదేశమే జన్మభూమి అన్న నిజం ఈనాటికే నిలిచే ఉంది.

దీర్ఘకథారచనం పొడసూపకమునుపే వినోదం గొలిపే ఆఖ్యానాలతో, కథలతో భారతీయ సాహిత్యం నిండి ఉంది. మత విషయికములైన సత్యాలను, లౌకికమైన నీతులను బోధించడానికి నీతికథ కల్పించబడింది. ఆఖ్యానాలు, పొడుపుకథలు, ఉపాఖ్యానాలు, కథలు చాలాకాలం ప్రజలలో వ్యాప్తి చెంది క్రమంగా సాహిత్యంలో స్థానం ఏర్పరచుకున్నాయి. ఆధునికకాలంలో లఘు సాహిత్యానికి లభించిన ఆదరణ ఆఖ్యానాలకు, కథలకు అన్నికాలాలలోను లభించింది.

ఆఖ్యానాలు (Tales) **నీతికథలు** (Fables), **కథలు** (Stories)

ఆఖ్యానాలు పురాణాల కన్న భిన్నమైనవి. అవి జిజ్ఞాసువులకు జ్ఞానదాయకములైన విషయాలను విశదీకరిస్తాయి. ఆఖ్యానాలు, కథలు సాహిత్యంలో స్థానం ఏర్పరచుకోకముందే ఉపదేశగర్భితాలైన నీతికథలు ప్రజలలో వ్యాప్తిని చెందాయి. తొలుత ఇవి ప్రాకృత భాషా సాహిత్యంలో చోటు చేసుకున్నవి. కాని, నీతికథ మాత్రం సాహిత్యసాగరమందే జనించి సంస్కృతభాషలో ప్రచారం పొందింది. జంతుకథలనుండి నీతికథ ఉద్భవించి ఉండవచ్చు నీతికథ చివరను ఉపదేశశ్లోకపాదాలు చేర్చబడ్డాయి. ఈ ఉపదేశవాక్యాలే కథలకు శీర్షికలుగా వెలశాయి. పాశ్చాత్యసాహిత్యంలో శీర్షికలు ఈవిధంగానే ఉంటాయి.

ఆభాణకాలు భారతీయ కథాకావ్యాల ముఖ్యమైన అంగాలై, నీతికథాసాహిత్యం యొక్క పౌరాతన్యం సూచించుతున్నవి.

కథాసాహిత్యం యొక్క స్వాభావికమైనరూపం గద్యపద్యాత్మకమైనది. పద్యరూపంలో కొన్ని ఆఖ్యానాలు, నీతికథలు వెలువడ్డాయి. అర్వాచీనకాలంలో లభించే కథాసాహిత్యం పూర్తిగా పద్యమయమయినది. కేవలం గద్యంలోనే వ్రాసిన రచనలు అరుదుగా ఉన్నాయి. గద్యరచనలలో కూడా కొంతవరకు శ్లోకాను సంధానం జరిగింది.

విషయసారాంశమేమిటంటే -

పురాతనాలైన ఆఖ్యానాలు (అనగా వృత్తాంతకథలు) కథలు (కల్పనా కథలు) నిర్దిష్టమైన సాహిత్యానికి చెందవు. వాటి ఉత్పత్తిని సాహిత్యంలో కనుగొనడం దుర్లభం. ఆఖ్యానరూపాలైన కథలు కొన్ని వైదికవాఙ్మయంలో లభించినా, అవి పౌరాణికాలై, కథాసాహిత్యానికి చెందకుండా ఉన్నాయి.

ఆవిధంగానే కొన్ని జంతుకథలు ఉపనిషదాదులలో లభించినా, వీటినన్నిటిని నీతికథలని పిలువలేము.

భారతీయసాహిత్యంలో నీతికథలుమొట్టమొదటిసారిగా మహాభారతంలో లభిస్తున్నాయి. ఇవి పండ్రెండవ పర్వమైన శాంతిపర్వంలో విరివిగా ఉన్నాయి. బారహత్ స్తూపంపై గల శిలాశాసనాన్ని అనుసరించి నీతికథలు క్రీస్తుపూర్వం మూడవశతాబ్దంలో ఉన్నాయని నిర్ధారణమవుతున్నది.

వైయ్యాకరణుడైన పతంజలికాలం నాటికి 'కాకతాళీయము' అన్న న్యాయోక్తి వాడుకలో ఉంది. కాకి వాలిన తోడనే తాటిపండు పడుతుంది. ఇది యాదృచ్ఛికంగా జరిగిన పని ఆవిధంగానే 'అజాకృపాణీయము' అన్న న్యాయోక్తి కూడా. మీద నుండి కత్తిపడి ఆడమేక చనిపోవడం యాదృచ్ఛికమే. నీతికథ యొక్క పరిణామాన్ని ఈ న్యాయోక్తులు సూచిస్తున్నవి.

మనకు లభించే ప్రాచీన కథాసాహిత్యాన్ని ఈవిధంగా విభజించవచ్చు

1. బహుసంఖ్యాకాలు, జనప్రియాలు అయిన ఆఖ్యానాలు, కథలు, ఆధ్యాత్మిక జ్ఞానసంబంధులైకాని, ప్రాపంచక ప్రయోజనాత్మకాలైనా కాని, ఈనోట, ఆనోట వెలువడి ప్రచారంలోకి వచ్చాయి. అవి సంస్కృతంలోనే కాకుండా, ఇతర ముఖ్యభాషలలో కూడా కనిపిస్తున్నాయి.

2. జైనబౌద్ధమతాలకు సంబంధించిన కథలు, జాతక కథలు మతప్రచారం కోసం సంగ్రహింపబడ్డాయి. ఈ కథలన్నీ జనులకు బోధించడం కోసమే, సులభంగా ఆ మతాలను అర్థం చేసుకోడానికే వెలువడ్డాయి.

3. నీతిశాస్త్రాన్ని ప్రాపంచకజ్ఞానాన్ని బోధించడమే ముఖ్యోద్దేశంగా పంచతంత్రం, దాని వివిధ సంస్కరణలు, సంగ్రహప్రతులు వెలువడ్డాయి. ఇవన్నీ సంస్కృతభాషలోనే రచింపబడ్డాయి.

4. పరిణతి చెందని వినోదాన్ని ప్రసాదించే కల్పనా కథలలో నీతిబోధనలేదు. కథలలో కథలు వచ్చే ఇటువంటి రచనలు మొదట ప్రాకృతంలోను, పిమ్మట సంస్కృతంలోను వెలువడ్డాయి. బృహత్కథ, దాని సంగ్రహరచనలు, వేతాళపంచవింశతి, శుకసప్తతి ఈ కోవకు చెందుతాయి.

5. సంస్కృతభాషలో కావ్యశైలిలో రచించిన ఆఖ్యాయికలు, కథలు ఒక తెగకు చెందుతాయి. వాసవదత్త, దశకుమార చరిత్ర, కాదంబరి మొదలైనవి ఈ కోవకు చెందునవి.

చివర మూడవర్గాలకు చెందినకథలు మొదట ప్రజలలో వ్యాప్తిచెంది తరువాత గ్రంథస్థమయినవి కావు. అవి కావ్యరూపంలోనే వెలువడ్డ రచనలు. మొదటి రెండు వర్గాలకు

చెందిన కథలలో విషయాన్ని కొంతవరకు గ్రహించి, కొంతవరకు కల్పించి చేసినవి ఈ రచనలు. ఏది ఎలా ఉన్నా, తాము విన్న కథలను మరియొక కథలో ఇమిడ్చి, స్వతంత్ర రచనలుగా కావ్యకర్తలు రూపొందించారు.

ప్రధానకథలో కొద్దిగా కాని, అధికంగా కాని కథలను పొందుపరచి, అట్టికథలను మరొక పెద్దకథలో ఇమిడ్చి రచించడం ఆనాడు ప్రచారంలోకి వచ్చింది. భారతీయకథా సాహిత్యంలో ఆఖ్యానం, నీతికథ, కథ ఒకదానినంటి మరి ఒకటి ఉండడం గమనార్హం. మానవులకు సంబంధించిన మూలకథ మధ్యలో అద్భుతాలైన ఆఖ్యానాలను, మాయాజాలాలను, అతిమానుషకార్యాలను మానవగుణాలు కలిగిన జంతువుల కథలను చూడగలుగుతున్నాము. ఉపదేశప్రధానాలైన రచనలలో నీతికథ ప్రాముఖ్యం వహించింది. లఘుసాహిత్యంలో ఆఖ్యానం విస్తరించింది. ఆఖ్యానాలు ప్రచారంలో ఉన్న కథలమీద ఆధారపడినట్టివి. ఉపదేశమిచ్చే నీతికథలు పండితుల రచనలు. అందుచేత అవిప్రచారంలో ఉన్న కథలు కాకపోవచ్చు. అవి ముందు రచింపబడి, తరువాత క్రమంగా వ్యాప్తిచెంది ఉండవచ్చు. పంచతంత్రం, ఈసపు నీతికథల విషయంలో ఈ నిర్ధారణ సమంజసమనిపిస్తుంది.

ఆఖ్యానాలు జనప్రియాలు. ప్రజాబాహుళ్యంనుండి జనించాయి. మతాభిప్రాయాలకు, పురాణవిషయాలకు అవి సన్నిహితమయినవి. అభిచారాది ప్రక్రియలకు అవి సన్నిహితమయినవి. మానవులకు గల మూఢవిశ్వాసాలపై ఆధారపడినవి. కథలను చెప్పే స్త్రీపురుషుల చిత్తచాంచల్యానికి లోబడి, సామాన్యుల నుండి లభించిన ఇటువంటి రచనలు, కథకుడికి కాని, ఇతరులకుకాని వినోదాన్ని కలిగిస్తాయి.

సంస్కృతసాహిత్యంలో 'ఆఖ్యాయిక' అన్నపదం వివిధములైన రచనాప్రక్రియలకు (అల్పకథారచన లేక కథానక రచనకు) చెందినది. 'కథ' అన్నపదం 'సంభాషణ, వినోదం, కథాసాహిత్యం' అన్న అర్థాలకు చెందింది. సాహిత్యశాస్త్రాలలో పండితులు ఈ రెండుపదాలను భిన్నములైన గద్యసాహిత్య ప్రక్రియలను నిరూపించడానికి ఉపయోగించినా, ప్రయోగంలో మాత్రం ఫలితం సాధించలేకపోయారు.



ప్రాచీనకథాసాహిత్యవికాసం

పంచతంత్రం, జాతకకథలు, అవదానవాఙ్మయం మొదలైనవి కథాసారస్వతం యొక్క ఆరంభదశలో గ్రంథస్థమైనవి. మత, ధర్మ, జ్ఞానసంబంధములైన క్లిష్ట విషయాలను సుబోధకం చేయడానికి కథలు ఉదాహరింపబడ్డాయి. ప్రజాబాహుళ్యానికి వినోదం ప్రసాదించడం కోసం గంధర్వకథ (fairy tale) ఉపకరించింది. తరువాత నిర్దిష్టమైన ప్రయోజనం దృష్టిలో పెట్టుకొని వ్రాసినది నీతికథ. ఈవిధంగా ప్రాచీన కథాసాహిత్యంలో మార్పుకనిపించింది. ఈ మార్పు పరిమితంగా కాక బహుముఖమై విజృంభించింది. ప్రాచీనకథాసాహిత్యానికి కారణభూతాలై వెలసినవి పంచతంత్రం, బృహత్కథ, వేతాళపంచవింశతిక, శుకసప్తతి మొదలైనవి.

పంచతంత్రం - నీతికథయొక్క ఉద్భవం

భారతదేశంలో వైదికయుగానికి పూర్వం అన్నిరకాలైన కథలు ప్రజలలో వ్యాప్తికలిగి ఉండేవి. వాటిని దేవమానుష కథలని, పురాణకథలని, నీతికథలని విభజించడం వలన ఏమీ లాభించదు. నిర్దిష్టమైన ప్రయోజనం కోసం కథను ఉపయోగించిననాడు, ఉపకరించే విజ్ఞానాన్ని ఉపదేశ ప్రధానమైన కథ సమకూర్చిననాడు, సాహిత్యరంగంలో కథ ఒక అడుగు ముందుకు వేసిందని అనుకోవచ్చు. కాని ఈ మార్పు ఎప్పుడు వచ్చిందో తెలియదు. ఋగ్వేదంలో నీతికథలు లేవు. పజ్జన ఉండే పశుపక్ష్యాదులకు మనుష్యుల అలవాట్లను తేలికగా అంటగట్టింది భారతీయుల భావసంపద. ఋగ్వేదంలో యజ్ఞాల దగ్గిర సామగానం చేసే బ్రాహ్మణులను బెక బెకలాడే కప్పలతో సరిపోల్చడం జరిగింది. ఉపనిత్తులలో అధిక్షేపం చేసే కథలున్నాయి. ఆనాటికి బోధనాత్మకమైన నీతికథ జనించియుండకపోవచ్చు. కాని, జంతువుల చర్యలను సులువుగా మనుష్యుల బోధనలకై ఆనాటినుండె ఉపయోగించే వారని తెలుస్తుంది. మహాకావ్యాలలో నీతికథ గుర్తింపబడింది.

బారహత్ స్తూపంపై చెక్కిన చిత్రాల నుండి మానవులకు, జంతువులకు సన్నిహిత సంబంధముల వలన తెలుస్తున్నది. హిందువులు, బౌద్ధులు, జైనులు జన్మాంతరాల యందు జంతుమానవజన్మలను ఎత్తుతారని సాధారణంగా విశ్వసించేవారు. బుద్ధుడు, అతని సమకాలీనులు గతజన్మలయందు మహిమాన్వితులని చెప్పడానికి ఈ జంతుకథలను ఎన్నుకున్నారు.

మహాకావ్యాలనాటికి, పతంజలి కాలంనాటికి జంతుకథ ప్రచారంలో ఉంది. కాని, దానికి సాహిత్యగౌరవం లభించినట్లు చెప్పలేము. పంచతంత్రంలోని నీతికథలను పరిశీలిస్తే, ఆనాటికథకు సాహిత్యంలో స్థానం లేదని తెలుస్తుంది. కళావైదగ్ధ్యం లేకపోయినా,

పంచతంత్రంలోని నీతికథకు ఒక నిర్దిష్టమైన రూపం ఉంది. ఈ కథ కేవలం ఉపదేశాప్రధానం ఈ కథలో కొంత ఆఖ్యానానికి చెందినది. కొంత నీతికి సంబంధించినది -నిత్యజీవితానికి చెందిన' సదుపదేశంతో నిండినది. నీతికథ విధిగా నీతిశాస్త్రానికి, అర్థశాస్త్రానికి చెందినది. ఈ రెండుశాస్త్రాలకుండే భేదం వివరించడం కష్టం. రెండింటిలోను లోకజ్ఞానం విరివిగా ఉంది. ఈ జ్ఞానం ధర్మానుబంధి. ధర్మోపదేశానికి భిన్నంగా లోకవృత్తాన్నే తెలుపడానికి ఈ నీతికథ రచింపబడలేదు. ఈ కథలపై ధర్మశాస్త్రప్రభావం స్పష్టంగా గోచరిస్తుంది.

పంచతంత్రం బాలుర ఉపదేశంకోసం నిర్దేశింపబడినది. బోద్ధలు బ్రాహ్మణులు, యువవిద్యార్థులు బ్రాహ్మణ బాలురే కానక్కరలేదు. పంచతంత్రం రాజకుమారులకోసం వ్రాయబడింది. ఆనాటికే సంస్కృతం, బ్రాహ్మణులు, రాజకులంలోని ఉన్నతోద్యోగులు వాడే భాషగాపరిణమించింది. జనబాహుళ్యంలో వ్యాప్తిచెందిన జంతుకథకుగాని, సాధారణనీతికథకుగాని ఇటువంటిరచన చెందినదికాదు. తద్భిన్నంగా నిర్దిష్టమైన ప్రయోజనం కోసమే సృష్టింపబడిన సాహిత్యభాగమిది.

నీతికథలో కథాభాగం గద్యంలోను, నీతివిషయం శ్లోకంలోను చెప్పబడుతుంది. ఇతరములైన ఉపదేశాత్మకమైన శ్లోకాలు కథలో చేర్చడం జరుగుతుంది. ఇటువంటి సూత్రబద్ధమైన శ్లోకాలు ఐతరేయబ్రాహ్మణంలో కనిపిస్తాయి. కథలలోని నీతినికాని, అదిచెప్పవలసిని సత్యాన్ని కాని ప్రవచించేశ్లోకం, బోధనాత్మకమైన శ్లోకానికి భిన్నంగా ఉంటుంది. నీతినిచేప్పే శ్లోకం గుర్తించడానికి వీలుగా ఉంటుంది. నీతులులేని శ్లోకాలు, కేవలం సంగ్రహకథనే చెప్పేశ్లోకాలు, కథాసంబంధి అయిన శ్లోకాలు మనకు లభ్యమవుతాయి. ఈ శ్లోకాలు క్రమంగా ఆఖ్యానాలలొ కథనశ్లోకాలయాయి. మొదట స్వల్పసంఖ్యలో ఈ శ్లోకాలు వచ్చినా, క్రమక్రమంగా ఉపదేశాత్మకాలైన నీతికథలు శ్లోకరూపంలోనే వెలువడ్డాయి.

నీతికథయొక్క రచనలో ప్రత్యేకప్రక్రియా స్వభావమొకటి కనిపిస్తుంది. కథావిషయాన్ని క్లిష్టంగాతీర్చి విస్తృతపరచడం ఈ రచనలో ఒక విలక్షణమైన ప్రయోగం. కొన్ని కథలను చేర్చి ఒక గ్రంథంగా రూపొందించడం కాదిది. నీతికథలన్నిటిని ఒకదానితో ఒకటి అల్లి, సంపూర్ణమైన ఏకకథగా రూపొందించడం దీనిప్రత్యేకత. నీతి కథలోని పాత్రలు తాము చెప్పే నీతులను బలపరచడం కోసం ఇతరకథలను సూచిస్తాయి. ఆ కథలు అప్పుడు చెప్పడం జరుగుతుంది. ఆవిధంగా కథలో కథ, దానిలో మరోక కథ చెప్పడమవుతుంది. ఇది సులభసాధ్యంకాదు. మూలకథా కథనాన్ని మధ్యలో ఆపి, మరియొక కథవేపు దృష్టి మరలించాలి. తిరిగి కొంతసేపటి తరువాత మూలకథకు తిరిగి రావాలి. ఇది కష్టమైనపని, ఇటువంటి రచన ఒక్కరే చేయవచ్చు, లేక కొంతమంది రచయితల సృష్టి కావచ్చు.

మహాకావ్యాలలో పాత్రలసంభాషణ యథాతథంగా ప్రవేశపెట్టబడుతుంది. ఈ నీతికథలలో కూడా ఆవిధంగానే సంభాషణలు కనిపిస్తాయి. సూత్రబద్ధమైన శ్లోకాలు ఐతరేయ బ్రాహ్మణంలోవలె కనిపిస్తాయి. కథలోని నీతిని కాని, అది చెప్పవలసిన సత్యాన్ని కాని ప్రవచించే శ్లోకం బోధనాత్మకమైనది. ఇటువంటి మార్పులను ప్రవేశపెట్టిన కథకులు, బాలకథలను తామే సృష్టించి, ఉపదేశమే ప్రయోజనముగా వాటిని తీర్చిదిద్ది, బౌద్ధులు జాతకకథలుగా రచించిన అవకాశం లేకపోలేదు.

పంచతంత్రానికి పూర్వం ప్రాకృతభాషలో నీతికథావాఙ్మయం ఉండడానికి అవకాశం లేదు. పంచతంత్రానికి తుల్యమైన రచన మరొకటి ఉన్నదని చెప్పలేము. నీతికథలలోని విషయం తొలుత జనసామాన్యంలో ప్రచారంలో ఉండి ఉండవలెను. తరువాత పంచతంత్రం బహుళప్రచారంలోకి వచ్చి ఉండవలెను. ఈ కథలు, హాస్యపు నీతికథలవలెనే, సమాజంలోని కిందితరగతి వారికి చెందినవని చెప్పడం జరిగింది.

ఆఖ్యాయికల బృహస్సముచ్చయం యొక్క మూలం ప్రాకృతభాషలో ఉన్నదని భారతీయ సంప్రదాయం అంగీకరిస్తున్నది, కాని పంచతంత్రం విషయంలో మౌనం వహిస్తున్నది.

ఆలంకారికులు నీతికథను, ఆఖ్యాయికను వేరుగా గుర్తించడానికి పదజాలం నిర్ణయించలేదు. ఆఖ్యాయిక విషయంలో మాత్రం - కథ, ఆఖ్యాయిక - ఈ రెండింటికికల భేదం వివరించే ప్రయత్నం జరిగింది. కాని, ఈ ప్రయత్నం ఫలవంతం కాలేదు. పంచతంత్రం యొక్క చాలప్రతులలోని కథలను 'కథలు' అని చెప్పడం జరిగింది. కాని, ఒక ప్రతియొక్క శీర్షిక 'తంత్రాఖ్యాయిక' అన్న పేరుతో పిలువబడింది. ఆఖ్యాయిక అంటే 'కథనం లేక లఘుకథనం' కలదని, 'కథ' అనగా 'సంవాదము లేక కథ' లని అర్థం చెప్పారు. కాని ఈ భేదాలను గుర్తించడం సాధ్యంకాదు. పంచతంత్రంలోని కథలు, ఆఖ్యాయికలు (ఆఖ్యానకములు) మానవసంబంధములైన సంఘటనలను చెప్పేవని నిశ్చయంగా నిర్ణయింపబడలేదు. నీతికథలలో ఉపదేశాత్మకాలైన శ్లోకాలు ఉండటం చేత, అవి ఇతరకథలకన్న భిన్నంగా ఉన్నాయి. ఆఖ్యాయికలో (ఆఖ్యానకములో) నీతికథాభాగం అల్పంగా ఉంటుంది. హితోపదేశం వంటి అర్వాచీనరచనలో కూడా జంతుకథలను మానవ జీవితంయొక్క స్వాదిష్టమైన కథనంతో మేళవించి ఒక వైవిధ్యాన్ని సాధించడం జరిగింది.

పంచతంత్రం - మూలగ్రంథప్రసక్తి

పంచతంత్రానికి, తత్సమాన రచనలకు మూలమైన గ్రంథం లభ్యంకాలేదు. పరిశోధనల వలన ఒక విషయం తేలింది. ఈ మూలగ్రంథం యొక్క విషయం, దానికి సంబంధించిన రచనలు, నాలుగు సముదాయాలకు చెందినవి.

మొదటిది పహలవీ అనువాదానికి చెందినది. ఈ అనువాదం క్రీస్తుశకం 570 వ సంవంత్సరానికి పూర్వం వెలువడింది. ఇది కూడా లభించలేదు. కాని, పూర్వకాలపు సిరియన్ భాషలోను, అరబ్బీభాషలోను వెలువడిన అనువాదాలు, వాటితరువాత వచ్చిన ప్రతులు, ఈ అనువాదాన్ని అనుసరించాయి.

రెండవది హిందూదేశం యొక్క వాయవ్యభాగం నుండి వచ్చినది. గుణాఢ్యుడి బృహత్కథను మూలంగా చేసుకొని క్షేమేంద్రుడు వ్రాసిన బృహత్కథామంజరినుండి, సోమదేవుడి కథాసంత్సాగరం నుండి పదకొండవ శతాబ్దంలో సంగ్రహింపబడినది.

మూడవది 'తంత్రాఖ్యాయిక' అన్న పేరుతోవచ్చిన రెండు కాశ్మీరదేశపుప్రతులకు, తంత్రాఖ్యాయికను అనుసరించి వ్రాసిన తంత్రాఖ్యాయికాసంగ్రహమునకు సంబంధించిన రెండు జైనప్రతులకు, పూర్ణభద్రుడిచే విరచితమైన తంత్రాఖ్యాయికకు మరియొకప్రతికి దగ్గిరగా ఉన్న రచనకు చెందినది. దీనికాలం క్రీస్తుశకం 1199వ సంవత్సరం.

నాలుగవది దక్షిణదేశపు పంచతంత్ర గ్రంథం యొక్క పూర్వప్రతికి నేపాలదేశపు. పంచతంత్రానికి, లోకవిదితమైన హితోపదేశానికి చెందినది.

పంచతంత్రం – శీర్షికావిమర్శ

మూలగ్రంథం పేరు పంచతంత్రం అని ఉండడంలో సందేహంలేదు కాని, ఏ అర్థమందు ఈ పేరు వాడబడిందో తెలియదు - తంత్రమంటే సాధారణ గ్రంథమని అర్థమిస్తుందా? లేకపోతే నిశితమైన శీలానికి ఉదాహరణమైన తంత్రమా (మాయ అనే సాధారణమైన అర్థంలో వాడబడినదా?) లేక ఉపదేశాత్మకమైన గ్రంథమా? ఆధికారికమైన సర్వస్వమా? ఆవిధంగానే తంత్రాఖ్యాయిక విషయంలోకూడా అయిదు భాగాలలో, ఆఖ్యానాల రూపంలో రచించిన నీతిశాస్త్రమా? లేక రాజనీతి కథలతో కాని, లేక ఉపదేశగర్భములైన కథలతోకాని కూర్చబడిన పాఠ్యగ్రంథమా?

మనకేది స్పష్టంగా తెలియదు. ఆదిలో, అయిదు చిన్నవిషయాలు కలది పంచతంత్రమని పిలువబడి ఉండవచ్చు. శీర్షికను బట్టి, అయిదు విషయభాగాలను చర్చించే సమగ్ర గ్రంథమని అనుకోవలసి ఉంటుంది.

ఇది క్రీస్తుపూర్వం రెండో శతాబ్దానికి చెందినదని హెర్టెల్ పండితుడు (Hertel) అభిప్రాయబడ్డాడు. దీనిలో మహాభారతం గురించి వ్రాసిఉంది. దీనారం అన్నపదం వాడబడింది. కాబట్టి క్రీస్తు తరువాత మొదటి శతాబ్దంలో వ్రాయబడిఉండడం తథ్యం. గుప్తయుగంలో బ్రాహ్మణులకు రాజాశ్రయం లభించింది. ఆకాలంలోని, కొద్దిగా అంతకు

ముందు కాలంలోకాని ఈ పంచతంత్రం రచింపబడి ఉండవచ్చు. సంస్కృతం రాజభాషగా రాజుకుమారుల కోసం ఉపయోగింపబడినకాలంలో, బ్రాహ్మణశీలం అంతటా ప్రత్యేకంగా నిండి ఈ పంచతంత్రం వెలసింది. దీనికర్త విష్ణుశర్మ. పేరును బట్టి ఇతడు వైష్ణవుడని చెప్పడానికి వీలులేదు. అది వ్యవహారంలో ఉన్న పేరో, లేక ఊహింపబడిన నామమో అయి ఉండవచ్చును.

పంచతంత్రం-మూలకథాజన్మస్థానం

విష్ణుశర్మ అన్న బ్రాహ్మణుడు మహీలారోప్య నగరానికి రాజైన అమరశక్తి యొక్క కుమారులకు ఈ కథలను చెప్పాడు. మహీలారోప్యం లేక మిహీలారోప్యం దక్కను పీఠభూమిలోనిది. అనగా, ఈకథలు దక్షిణాదిని జనించినవి. జైనులు వ్రాసిన తంత్రాఖ్యాయికప్రతులలో ఋశ్యమూకపర్వతంపై కథలు చెప్పబడినట్లు ఉంది. ఋశ్యమూకం దక్కనుకు పశ్చిమభాగంలో ఉంది. కాబట్టి ఈ కథలు దక్షిణదేశంలో ఉత్పత్తి అయినట్లు ఆధారాలున్నవి. అయిదవభాగంలోని మూలకథ గౌడదేశంలో జరిగినట్లు ఉంది. కాని, దీనిని అంతగా పరిగణించక్కరలేదు. అర్వాచీనప్రతులలో హితోపదేశం మాత్రం ఈ దేశానికి చెందినదని తెలుస్తుంది. కథలలో శార్దూల ప్రసక్తికాని, గజప్రసక్తికాని లేనందువలన ఈ గ్రంథం కాశ్మీరదేశంలో జనించినదని హెర్టెల్ పండితుడివాదన. మూలకథలో పేర్కొన్న క్రమేలకంకూడా కాశ్మీరంలోని జంతువుకాదు. కాని దేశమంతటా తిరిగే జంతువు క్రమేలకం కాబట్టి, కాశ్మీరదేశయులకు ఆ జంతువు తెలిసి ఉండవచ్చునని వీరి అభిప్రాయం. ఈ గ్రంథంలో వివరించిన క్షేత్రాలు, పుష్కరం, గంగాద్వారం, ప్రయాగ, వారణాసి మొదలైనవి. ఇవి సర్వజనవిదితాలు, అందుచేత ఈగ్రంథం ఎక్కడ నుంచి వచ్చినదన్న విషయాన్ని విడిచిపెట్టడం ఉత్తమం.

పంచతంత్రం - కథావిషయం

పంచతంత్రం రాజులకు బోధించే పాఠ్యగ్రంథం. రాజనీతిలోను, అనుష్ఠించవలసిన నిత్యజీవిత విధానం గురించి ఈ గ్రంథం బోధచేస్తుంది. కాని ఇది కథాగ్రంథం. గ్రంథకర్త విషయాన్ని బోధను పరిమితం చేశాడు, కథాకథనాన్ని విసర్జించలేదు. ఇది మానవ స్వభావానికి సహజమైన గుణం. దీనిలో ఉదహరింపబడిన కథలు నీతికథలుగాకాక, చిన్న వృత్తాంతకథలుగా విలసిల్లినవి. భరద్వాజపక్షి సముద్రాన్ని చీకాకు పెట్టేకథ, రెండవభాగంలో ఉన్న హిరణ్యకుడి అనుభవాలు ఇటువంటివి. రచయిత అభిప్రాయం అవినీతికరమైనది కాదు. అతడు వంచనయే ఉత్తమసాధనమని నిరూపించడానికి ప్రయత్నించలేదు.

ఉపయోగమున్న పాత్రకు సదుపదేశ మివ్వడమే అతని లక్ష్యం. ఆ ఉపదేశం అవినీతికరమై ఉండడం, ఏవిధంగా ఆలోచించినా, అవశ్యమైనది కాదు. దుష్టబుద్ధి సుబుద్ధులకథలో నిజాయితీయే ఉత్తమ విధానమని చెప్పే సుదీర్ఘమైన వివరణ ఉంది. ఈ విషయం నిర్ధారణచేయబడింది. మిత్రభేదంలో వృషభం యొక్క మంత్రి అయిన కరటకుడు దమనకుడిని అభిశంసించి, దుష్టత్వం విజయం పొందినా, దాని ఫలితాన్ని అనుభవించక తప్పదని చెప్తాడు.

ఈ కథలు మనల్ని సాధారణబ్రాహ్మణసమాజం మధ్య విడిచిపెడతాయి. రాజుల మంత్రులు చాలవరకు బ్రాహ్మణులే, యజ్ఞయాగాదులకు బ్రాహ్మణులు ముఖ్యులు. బ్రాహ్మణార్చన పాటించేవాళ్లు. పౌర్ణమికి అమావాస్యకు బ్రాహ్మణులను సంభావించేవాళ్లు. పురోహితులలో కనిపించే అత్యాశకాని, దొంగసన్యాసులతో వారిసంబంధం కాని బ్రాహ్మణత్వానికి విరోధప్రాయములని అనుకోరాదు. రాజులతోను, స్త్రీలతోను వారికి గల సాన్నిహిత్యం ఒక ప్రత్యేకత కలిగినది. సమాజంలోని సభ్యుల దుశ్చేష్టలకు బ్రాహ్మణులు అంధఃప్రాయులై వర్తించలేదు. మధ్యకాలీనయతులవలే ఇతరుల లోపాలను గుర్తించేవాళ్లు. బౌద్ధసంప్రదాయాలు ఈ కథలలో కనిపించవు. బెన్‌ఫే (Benfey) మహాశయుడు పంచతంత్రానికి బౌద్ధగ్రంథమొకటి ఆధారమని విశ్వసించాడు. కాని, బౌద్ధం హిందూ ధర్మంలో పుట్టిందని అతడు భావించలేకపోవచ్చు. బౌద్ధగ్రంథాలలోని కథలకు, దీనిలోని కథలకు కల సామ్యమునే అతడు గ్రహించి ఉండవచ్చు. కాని, ఆ బౌద్ధకథల కాలం అతడు విపరీతంగా నిర్ధారణ చేసినట్లుంది. పంచతంత్రం యొక్క మూలగ్రంథం నుండి చాలకథలు జాతక కథలలో వచ్చినట్లు తెలుస్తుంది.

సామాన్యులకు సులువుగా అర్థంకాని విషయం, రాజులకు రాణులకు సంబంధించినది, మంత్రుల గురించి వివరించినది, మిత్రులను సంపాదించునది, శత్రువులను నిర్జించునది, యుద్ధం సలుపునది - ఈ విషయాలకు కౌటిల్యుని పేరున మనకు లభించిన అర్థశాస్త్రానికి దగ్గిర సంబంధం ఉండడం నిర్వివాదమైనది. అర్థశాస్త్రంలో ప్రయోగించిన 'ప్రకృతి' అన్నపదం మిత్రపరంగాను, శత్రుపరంగాను, ఈ గ్రంథంలో 'మిత్రప్రకృతి' 'అరిప్రకృతి' అని ఉనయోగింపబడింది. 'అభ్యంతరప్రకృతి' (రాష్ట్రంలో ఉండువాడు), 'బాహ్యప్రకృతి' అన్నపదం చాణక్యుని స్వసంజ్ఞ అని తెలుస్తున్నది. అర్థశాస్త్రంనుండి ఉద్ధృతమైన శ్లోకాలు సంసందర్భంగాను, అసందర్భంగాను ఈ పంచతంత్రంలో ఉదాహరింపబడ్డాయి. కాని, అర్థశాస్త్రం యొక్క రచనాకాలం నిర్ధారణ కానందున అది పంచతంత్రానికి పూర్వం ఉన్నదని చెప్పలేము. కాని, ఒక్క విషయం

మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు. కౌటిల్యుడి అర్థశాస్త్రాన్ని పోలిన గ్రంథం నుండి విషయగ్రహణం చేయబడి ఉండవచ్చు.

ఉదాహరించబడిన నీతులలో నాలుగవ వంతు మాత్రం నీతిపరమైనవి, ధర్మసంబంధములైనవి, వేదాంత ప్రాచుర్యం కలవి. మిగిలినవి రాజనీతికి, జీవితవిధులకు సంబంధించినవి. వీటిలో ఏవీ కూడా అవినీతికరములైనవి కావు. మిత్రలాభంలోని నాయకుడు ఉదాత్తమైన శీలం కలవాడు. గర్వమున్నా, తనజాతివాళ్లకోసం, స్నేహితులకోసం ఆత్మార్పణం చేయగల సమర్థుడు. మూషికంకూడా తనవాళ్లకోసం తీవ్రంగా శ్రమపడింది. సంసారజీవితంలో గృహస్థుడు విశ్వాసపాత్రుడై, ఉదారుడై, ఋజువర్తన కలవాడై ఉండవలెను. గార్హ్యస్థజీవితంలో నీచమైన స్థాయికి దిగజారిపోరాదు. వివాహబంధవిచ్ఛేదకులు భూషింపబడలేదు. అవినీతిని గర్హించని వాళ్లు పరిహాసపాత్రులయారు.

పంచతంత్రం లోకప్రసిద్ధి గాంచిన నీతికథలసంపుటి. మిత్రలాభం, మిత్రభేదం, సంధి-విగ్రహం, లబ్ధనాశం, అసంప్రేషితకారిత్వం అన్నవి పంచశీర్షికలు. బైబిలు గ్రంథం తరువాత పంచతంత్రంవలె ప్రచారంలో ఉన్న గ్రంథం మరొకటిలేదు - ఏభైభాషలలోకి ఇది అనువదింపబడింది. రమారమి రెండువందల వరకు సంస్కరణలున్నదీ గ్రంథం.

పంచతంత్రం – భాష , శైలి.

ఎవడో మహానుభావుడైన ఉత్తమకళాకారుడి నిర్మాణమీ పంచతంత్రమని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కావ్యరచనలోని సౌలభ్యానికి భిన్నంగా కథలో కథను ఇమడ్చడం క్లిష్టమైనపని. ఉపదేశాత్మకాలైన శ్లోకాలను ప్రతికథలోని నీతిని, పాత్రాలను పరిచయంచేసే సంగ్రహ శీర్షికాశ్లోకాలను గద్యంతో కలిపిచెప్పడం ఒక ప్రత్యేకమైన ప్రక్రియా లక్షణం.

మిణుగురు పురుగులతో చలికాచుకుంటున్న ఒక మర్కటానికి కోపం తెప్పిస్తుంది ఒకపక్షి. ఆ కథను ప్రవేశపెడుతూ -

'వంగని మ్రానును వంచలేవు. రాతిపై కత్తిని ప్రయోగించలేవు. సూచీముఖుడనే పక్షియొక్క పరిస్థితినిబట్టి, నేర్చుకోలేని వాడికి బోధింపలేవని తెలుసుకో' అంటాడు రచయిత.

గ్రంథంలో చాల దోషాలు కనిపిస్తాయి. అందుచేత రచయిత స్వతంత్రంగా వ్రాశాడని విశ్వసించవచ్చు. ఈ దోషాలను పరిష్కర్తలు కూడా అంతగా నివారింపలేకపోయారు. అక్కరకు మించిన నీతులు ఒకచోటనే ఉపయోగింపబడ్డాయి. కొన్ని కథలు సరిగా ఇముడవు. సందర్భం పాటించకుండా కొన్ని కథలను రచయిత ప్రవేశపెట్టాడు. బంధింపబడిన లేడి యొక్క వృత్తాంతం అటువంటిది. దానిలో నీతి కనిపించదు. కాని, పాఠకుడి దృష్టితో

చూస్తే, అంతటి చక్కని వృత్తాంత కథనాన్ని విడిచి పెట్టడం జరగదు. బంధింపబడిన లేడి ఆందోళన చెందుతున్నప్పుడు కథ చెప్పుతుందా? మూషికం లేడి వల(త్రాళ్లను కొరుకుతున్నప్పుడు కథ చెప్పడంలో తప్పేముంది? 'సంధి-విగ్రహం' భాగంలో, ఉలూకాలు వాదిస్తాయి. వాదిస్తే కాలం వ్యర్థంకాదా? కాని, అప్పుడు రాజనీతిలో బోధన జరుగుతుంది. దీనిని క్షమింపవచ్చు కదా!

భాష సులభమైనది, శైలి రమణీయమైనది, మెరుగులు పెట్టినదీ శైలి. విశిష్టమైన ఛందస్సు కలిగినదీ రచన. కావ్యగతికి భిన్నంగా పెద్ద పెద్ద సమాసాలు కల శ్లోకాలు కూడా ఉన్నాయి. దీనిని బట్టి రచయిత ప్రతిభావంతుడని, రసవిమర్శ కలవాడని తెలుస్తుంది. రాజుమారులకు నీతిని చెప్పే ఈ గ్రంథంలో శైలిపట్ల గ్రంథకర్త అత్యాదరం చూపించలేదు. కాని, హాస్యరసాన్ని పోషించేటప్పుడు ఉన్నతమైన శైలిని ఉపయోగించాడు. 'నల్లి-పేను'. కథలో, రాజుమారుడి రక్తం రుచిచూడడానికి తొందరపడిన పేను, మంచాన్ని అంటి పట్టుకున్న నల్లికి ప్రాణాపాయం తెచ్చిపెడుతుంది. అటువంటి శైలి నీలిమందు తొట్టెలో పడిన నక్క కథ చెప్పేటప్పుడు కూడా రచయిత ఉపయోగించాడు.

నిజాన్ని పరికిస్తే, కథలో కథ చెప్పినప్పుడు, కథనం క్లిష్టంగా ఉన్నప్పుడు పాఠకుడి సహనం నశిస్తుంది. కాని, రచనలో ఉత్కృష్టమైన శ్లోకాలు ఉన్నాయి. వినోదాత్మకాలైన కథలను చక్కగా చెప్పడం జరిగింది. గ్రంథ ప్రాశస్త్యానికి ఇంతకన్న ఏది కావాలి?

పంచతంత్రం నుండి వెలువడ్డ రచనలు

తంత్రాఖ్యాయిక యొక్క రచన పంచతంత్రానికి సమీపంగా సాగింది. దీనికాలం సరిగా నిర్ణయింపబడలేదు. మూలగ్రంథంలోని కొన్ని కథలు దీనిలో చేర్చబడ్డాయి. 'నీలి మందు తొట్టెలోపడిన నక్క కథ,' 'నక్కచే మోసగింపబడిన క్రమేలకం సింహాలకథ,' 'సాలెవాడైన సోమిలకుడి కథ' 'శిబి చక్రవర్తి కథ', 'వృద్ధహంస కథ', 'ఉల్లిపాయల దొంగ కథ', ఈ కథలు దీనిలో చేర్చబడినవి. తంత్రాఖ్యాయికలోని విషయం స్వతంత్ర్యంగా కనిపించినా, భాషమాత్రం చాల వరకు మారిపోయింది. ఇతర ప్రతులలో లేనటువంటి పద్యగమనంకల గద్యం ఒకప్రతిలో కనిపిస్తుంది. దీని సులభ సంగ్రహపాఠం ఒక జైనమతస్థుడిచే కూర్చబడింది. ఇతడు క్రీస్తుశకం 1199 నాటి పూర్ణభద్రుడికన్న పూర్వుడు. మాఘుడు, రుద్రభట్టుల తరువాత కాలంవాడు. వారి రచనల నుండి ఇతడు శ్లోకాలను గ్రహించాడు. కాబట్టి ఇతడు క్రీస్తుశకం 1100 సంవత్సరంనాటి వాడని చెప్పవచ్చును. మూలప్రతికన్న దీనిలో చాలమార్పులు చేయబడ్డవి. గ్రంథం సరిగా అయిదు భాగాలు చేయబడింది. మూడవభాగంలోని చాలకథలు నాలుగవ భాగంలో చేర్చబడ్డాయి. కొత్త

విషయం కూడా చేర్చబడింది. అయిదవభాగం తొలగించబడింది. సన్యాసులను చంపిన కథ ముఖ్య కథ అయి, ముంగిసకథ అంతర్గత కథ అయింది. మూడు, నాలుగు భాగాలలో కొత్తకథలు కూడా చేర్చబడ్డాయి. స్వతంత్ర రచనలో ఏడు వృత్తాంత కథలు, ఒక హాస్యకథ, రెండు జారత్వానికి సంబంధించిన కథలు, ఒక మూర్ఖుడి కథ ఉన్నాయి. వీటిలో 'సాలెవాడు, విష్ణువు' కథ ముఖ్యమైనది.

ఒక సాలెవాడు కర్రతో చేసిన గరుడుడిని ఆరోహించి తాను విష్ణువునని నమ్మించి రాజకుమార్తె యొక్క ప్రాపును పొందుతాడు. ఆ నగరరాజు, దేవుడితో తనకు కలిగిన బాంధవ్యాన్ని అదను చేసుకొని, పొరుగు రాజులమీదకు యుద్ధానికి తరలి వెళ్తాడు. కాని అతడు నగరం దాటక ముందే శత్రురాజు అతనిని చుట్టబెడతాడు. విష్ణువు తన పేరు నిలబెట్టుకోడానికి భువికి దిగివచ్చి, నగరాన్ని కాపాడవలసి వస్తుంది.

ఈ కథను జైనులు రచించారని చెప్పడం కష్టం కాని, బ్రాహ్మణయతులకు బదులు 'క్షపణక' 'దిగంబర' 'నగ్నక' 'వ్యంతర' అను పదాలు, 'ధర్మదేష్ణా' అను పదం ప్రయోగింపబడ్డాయి. చాలవరకు కొత్త శ్లోకాలు చేర్చబడ్డాయి. మూలంలోని శ్లోకాలలో మూడవ వంతు మాత్రం దీనిలో చేర్చడం జరిగింది. తంత్రాఖ్యాయికను పోలిన ఒక మూలగ్రంథం నుండి ఈ సంగ్రహగ్రంథం వెలువడినట్లుంది. సంగ్రహగ్రంథంలో కూడా మూలంలో లేనట్టి 'నీలినక్క', 'సాలెవాడైన సోమిలకుడి కథ' ఉన్నాయి.

రెండవ జైన సంస్కరణం క్రీస్తుశకం 1199లో వచ్చింది. సోమకుడను మంత్రిని సంతుష్టుడిగా చేయడం కోసం పూర్ణభద్రుడను జైన సన్యాసి ఈ గ్రంథాన్ని రచించాడు. దీనిలో ఇరవై ఒక్క కొత్త కథలు చేర్చబడ్డాయి. ఈ కథలలో జంతువుల కృతజ్ఞతను, మానవుల కృతఘ్నతను తెలిపే ఖ్యాతి చెందిన కథ ఒకటుంది. మహాభారతం నుండి కపోతం, వ్యాధుడి కథ గ్రహింపబడింది. పూర్ణభద్రుడి రచన కొంతవరకు తంత్రాఖ్యాయిక పైన, కొంతవరకు సంగ్రహంగా రచింపబడిన గ్రంథంపైన, కొంతవరకు, తెలియని మరొక సంస్కరణపైన, ఆధారపడినట్లు కనిపిస్తుంది. రాజసభలలో జైనులకు స్థానం లభించింది. అపుడు వారు నీతి శాస్త్రాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం వచ్చింది. పూర్ణభద్రుడు ఉపయోగించిన కథావిషయం జైనుల సంఘాల నుండి గ్రహింపబడి ఉండవచ్చు. అవశ్యమైన వృత్తాంత కథలు ఏడవ శతాబ్దం నాటివి. వాటికి, ఈ పంచతంత్ర కథలకు సామ్యముంది. ఆ కథలు పంచతంత్రం యొక్క పురాతనమైన ప్రతినుండి గ్రహింపబడి ఉండవచ్చు. ప్రత్యేకంగా జైన సాంప్రదాయాలను సూచించే కథలు లేకపోయినా, పూర్ణభద్రుడు ఉపయోగించిన విషయం జైన సమాజం నుండి గ్రహింపబడి ఉండవచ్చు. భాష

ఘూర్జరప్రాకృత భాషాజుష్టమై భ్రష్టమయిపోయింది. సంగ్రహగ్రంథనామం పంచాఖ్యానమని ఉంది. ఈపేరు సూక్ష్మగ్రంథానికి కూడ వర్తిస్తుంది. ఈ రెండు జైన సంస్కరణల నుండి చాల కలుషితమైన రచనలు బయలుదేరాయి. మేఘవిజయుడు రచించిన పశ్చిమదేశానికి సంబంధించిన ప్రత్యేకమైన కథలు చాల దీనిలో ఉన్నాయి.

వాయువ్యదిశనుండి వచ్చిన పంచతంత్రం యొక్క సంస్కరింపబడిన ప్రతి బృహత్ కథామంజరి, కథాసరిత్సాగరాలలోని భాగాలకు ఆధారమై, ఆరచయితలకు అందుబాటులో ఉండి, వారి శ్లోక రచనకు మూలమై ఉండవచ్చును. ఈ మూలము గుణాఢ్యుడి బృహత్కథలోనిది కాదు. కాశ్మీరదేశంలో, బృహత్కథ అనంతరం చాలకాలం గడిచిన తరువాత చేయబడిన రచనలోని భాగమిది. దీనిలో అయిదు భాగాలు, ఇతర విషయాల చేత వేరు చేయబడ్డవి. ఉపోద్ఘాతం, మొదటి భాగంలోని మూడవకథ విడిచి వేయబడ్డవి. ఇంకేవి విడువబడ లేదు. క్షేమేంద్రుడు తంత్రాఖ్యాయిక యొక్క సంస్కరణం కూడా ఉపయోగించాడు. అయిదు భాగాలను క్రమంగా ఉంచాడు. విషయాన్ని సూక్ష్మీకరించడం చేత రచన యొక్క విలువ తగ్గిపోయింది. సోమ దేవుడి రచన స్పష్టంగా, ఓజఃపూర్ణమై ఉంది. అతడు కొన్ని కథలను ఏ కారణం చేతనో విడిచిపెట్టాడు.

దక్షిణదేశంలో లభించిన పంచతంత్రానికి కనీసం అయిదు సంస్కరణలేనా ఉన్నాయి. ఇవన్నీ దక్షిణాదిని వ్యాప్తిచెందాయి. చాలవరకు విషయాన్ని విడిచిపెట్టకుండా కొంతభాగంలో నాల్గింట మూడు వంతులు, శ్లోకభాగంలో మూడింట రెండు వంతులు గ్రహింపబడ్డాయి. ఎడ్గర్టన్ (Edgerton) మహాశయుడు అంచనావేశాడు. ఇది భారవి తరువాత కాలానికి చెందింది. గోపిక, ఆమెప్రియుల కథ మూలంలో లేదు. నేపాలదేశానికి చెందిన పంచతంత్రానికి, హితోపదేశానికి ఏ గ్రంథమయితే మూలమో, దానినుండి గ్రహింపబడి ఉండవచ్చు. ఆఖరిశ్లోకం కాళిదాసకృతం. కాబట్టి ఇది క్రీస్తుశకం 500 తరువాతదని అనుకోవచ్చు.

విస్తరింపబడిన మరొక దక్షిణదేశ సంస్కరణ లభించింది. దీనిలో తొంభై ఆరు కథలున్నాయి. దీనికి తమిళం నుండి ఆధారాలు కనిపిస్తాయి. మతాచార్యుడైన డుబాయి 1826లో రచించిన Le Pancha Tantra ou les eing ruses అన్న గ్రంథం దీనిని అనుసరించి వ్రాసినది.

నేపాలదేశపుప్రతి శ్లోకాలలో ఉంది. ఒక్కశ్లోకపాదం మాత్రం గద్యంలో ఉంది. హితోపదేశరచనకు పూర్వం వెలువడ్డ సంస్కరణం దీని కి మూలం ఒకటి, రెండు భాగాలు దీనిలో మార్చబడ్డాయి.

ఇవికాక చాల సంస్కరణలు సంస్కృతంలో లభించాయి. పూర్వకాలపు గుజరాతీభాషలోకి, అర్వాచీనమైన గుజరాతీ భాషలోకి అనువదింపబడింది. పాతమహారాష్ట్ర భాషలోనికి, కొత్త మహారాష్ట్ర భాషలోకి, ప్రజలభాషలోకి, తమిళంలోకి కొన్ని సంస్కరణలు అనువదింపబడ్డాయి.

పంచతంత్రంలోని కథలు స్వేచ్ఛగా శివదాసుడి వేతాళపంచవింశతికలోను, శుకసప్తతిలోను, ద్వాత్రింశత్ పుట్టాలికలోను వాడబడ్డాయి. పాశ్చాత్యదేశాలలో ఈ కథల ప్రయోగం ఇంకా హెచ్చుగా భాసించింది.

హితోపదేశం

పంచతంత్రజన్యములైన రచనలలో హితోపదేశం వంగదేశం నుండి వచ్చింది. గ్రంథకర్త నారాయణుడు, అతనిని పోషించిన నృపతి ధవళచంద్రుడు. లభించిన ప్రతులలో ఒకటి క్రీస్తుశకం 1373 నాటిది. కాబట్టి ఇతడు అంతకు పూర్వం వాడై ఉండవలెను. భట్టారకవారమునాడు పనిచేయరాదని ఇతడు ప్రస్తావించెను. ఈ ఆచారం క్రీస్తుశకం 900 తరువాత వాడుకలోకి వచ్చింది. (Fleet - Journal of Royal Asiatic Society - 1912 - Pages 1039-46) లేకపోతే ఇతడు మాఘుడు, కామందకుల తరువాత వాడని చెప్పవచ్చును. ఈ గ్రంథంలో గౌరీ పూజా క్రమంలో ఇతరుడి భార్యతో లైంగిక సంబంధం పెట్టుకున్న విషయం వ్రాయబడింది. ఇది వంగదేశంలో వ్యాప్తిలో ఉన్న ముఖ్యమైన తాంత్రికాచారం. సంస్కృతంలో నీతిబోధ చేయడమే రచయిత యొక్క ముఖ్యోద్దేశం. పంచతంత్రం, మరొక అనామక గ్రంథం ఈ రచనకు మూలమైనవి. కామందకీయ నీతి శాస్త్రంలోని చాలభాగాలను ఇతడు గ్రహించాడు. పేరులేని రెండవ పుస్తకం ఏదో కథల పుస్తకమయి ఉండవచ్చు. హితోపదేశములోని చాలకొత్త కథలున్నవి. పదిహేడు కొత్త కథలలోను ఏడు నీతికథలు. మూడు చిన్నకథలు, అయిదు జారుల కథలు, రెండు ఉపదేశాత్మకాలైన కథలు ఉన్నాయి. రచయిత పేరు నారాయణుడైనా, తననూ తన కుటుంబాన్ని శివుడి కోసం అర్పించడానికి సంసిద్ధుడైన స్వామిభక్తి పరాయణుడు వీరవరుడి కథ చెప్పడం చేత, గౌరీపూజ గురించి ప్రస్తావించడం చేత, శివాశీర్వాదం కాంక్షించి ప్రతిభాగాన్ని ముగించడం చేత హితోపదేశ రచయిత శైవుడని చెప్పకతప్పదు.

పంచతంత్రంలో వరుసగా ఉన్న మిత్ర భేద, మిత్రలాభాల క్రమం మార్చి, మిత్ర లాభంతో నారాయణుడు ప్రారంభించాడు. మూడు నాలుగు భాగాలను, తనకు తోచినట్లే రచించాడు. మూడవ భాగాన్ని రెండుగా విభజించాడు. మొదటిది విగ్రహం- రెండవది సంధి- నాలుగవ భాగంలోని మూలకథ కొత్తది, కల్పితమైనది. మూలగ్రంథం మూడవ

భాగంలో ఉన్న కొన్ని కథలు దీనిలో ఇమడ్చడం జరిగింది. అయిదవ భాగంలోని విషయాన్ని మూడు నాలుగు భాగాలలో పంచడం చేశాడు రచయిత. మూలంలో కల అయిదవ భాగం విడిచి పెట్టబడింది. మూలగ్రంథంలోని చాల కథలు వదలివేయబడ్డాయి. హితోపదేశంలో అయిదు వంతులలో రెండు వంతులు మేరకు గద్యభాగం, మూడు వంతులు శ్లోక భాగం దీనిలో లభిస్తాయి. కొత్త కథలకు ఆధారమేదో తెలియదు. ఒక ఋషి ఎలుకను ఒక దానిని పిల్లిగా, కుక్కగా, పులిగా క్రమంగా మార్చగా, చివరకా పులి తన ఉపకారినే చంపదలస్తుంది. ఇటువంటి ఉపాఖ్యానమే మహాభారతంలో ఉంది. దానిలోకుక్క గురించి తెలుపబడింది. బహుశా ఈ ఉపాఖ్యానమే హితోపదేశ కథకు మరొకరూపమని అనుకోవచ్చు. రెండవ భాగంలోని ఆరవకథలో, గ్రామాధికారి కొడుకుతో సరసం నెరపిన స్త్రీ ఒకతె, అటు భర్త నుండి ఇటు గ్రామాధికారి నుండి తప్పించుకున్న వైనం వ్రాయబడింది. దీనికి ఆధారమైన కథ శుకసప్తతిలో ఉంది. వేతాళ పంచవింశతికలో ఉన్న వీరవరుడి కథకూడా ఇటు వంటిదే.

సంస్కృతంలో బోధించడానికి అనువుగా నారాయణుడి శైలి సరళంగా ఉంది.

బృహత్కథ

నామమాత్రావశేషంగా నిలిచిన మహాగ్రంథం బృహత్కథ. ఆచంద్రతారార్కం నిలువవలసిన గుణాఢ్య పండితుడి రచన కాలగర్భంలో కలిసిపోయింది. రామాయణ మహాభారతాల తరువాత అంత ప్రాశస్త్యం గడించిన కథ బృహత్కథ. కొందరు విమర్శకులు గుణాఢ్యుడిని వ్యాసవాల్మీకులతో సరిపోలుస్తారు. గుణాఢ్యుడు వ్యాసుడి అపరావతారమని పండితుల అభిప్రాయం. కాళిదాసుడి మేఘసందేశకావ్యంలో ఉదయనకథాకోవిదులైన గ్రామవృద్ధుల ప్రసక్తి ఉంది. అది గుణాఢ్యుడి బృహత్కథకు సంబంధించినది. బాణుడు, సుబంధుడు, దండి మొదలైన మహాకవులు ఈ బృహత్కథను ప్రశంసించారు.

క్రీస్తుశకం ఆరవశతాబ్దానికి పూర్వం కోలారు జిల్లాలోని గుమ్మారెడ్డిపురంలో దుర్వినీతుడన్న రాజు వ్రాయించిన శాసనంలో బృహత్కథ ప్రసక్తి ఉంది. క్రీస్తుశకం తొమ్మిదవ శతాబ్దంలో కంబోడియాలో లిఖింపబడిన శాసనంలో బృహత్కథ గురించి ఉంది. కాబట్టి ఈ మహాగ్రంథం పన్నెండవ శతాబ్దం వరకు ప్రచారంలో ఉండి ఉండవచ్చు.

బృహత్కథ పైశాచీబాషలో వ్రాయబడింది. సోమదేవుడు కథాసరిత్సాగరాన్ని, క్షేమేంద్రుడు బృహత్కథా మంజరిని ఈ మూలగ్రంథం నుండి అనువదించారు. ఆ రెండూ కాశ్మీరం నుండే వచ్చాయి. నేపాలదేశంలో ప్రచారంలో ఉన్న బృహత్కథ నుండి బుధస్వామి రచించిన బృహత్కథా శ్లోకమంజరి గ్రహింపబడింది.

బృహత్కథలోని కథలు దివ్యాంశసంభూతాలని అంటారు. సప్త విద్యాధరుల చరిత్రను శివుడు పార్వతికి చెప్తాడు. శివుడి సేవకుడైన పుష్పదంతుడు రహస్యంగా తాను విన్న చక్రవర్తుల కథలను తన భార్యకు చెప్తాడు. ఆమె నుండి ఆమె అనుచరులు వింటారు. శివపార్వతులకు ఈ విషయం తెలుస్తుంది. పార్వతి పుష్పదంతుడిని శపిస్తుంది. అతని సహోదరుడైన మాల్యవంతుడినికూడా ఆమె శపిస్తుంది. కాని పుష్పదంతుడి భార్య యొక్క శోకం పట్ల ఆమె జాలిదలచి, శాపవిమోచన విధానం కూడా చెప్తుంది. పుష్పదంతుడు మానవ జన్మను ఎత్తవలెను. వింధ్య మందు కాణభూతి అన్న పిశాచాన్ని దర్శించి, అతడికి తన పూర్వ వృత్తాంత కథలను చెప్పవలెను. అప్పుడు అతడికి శాపవిముక్తి కలుగుతుంది. మాల్యవంతుడు కూడా కాణభూతి నుండి కథలను విని లోకంలో ప్రచారం చేసినట్లయితే అతడికి కూడా శాపవిముక్తి కలుగుతుంది. పుష్పదంతుడు వరరుచి- కాత్యాయనుడుగా జన్మించి, వ్యాకరణ పండితుడై, యోగానందుడి అమాత్యుడిగా ఉండేవాడు. జన్మావసానమందు వింధ్యకుపోయి నిజవృత్తాంతాన్ని సప్త మహాకథలుగా చెప్పి, పుష్పదంతుడు శాపవిముక్తుడు అవుతాడు. మాల్యవంతుడు ప్రతిష్ఠానపురంలో జన్మించి, గుణాఢ్యుడన్న పేరుతో శాతవాహన నృపతికి మంత్రిగా అవుతాడు. అతడు తన శిష్యులతో కాణభూతిని దర్శించి, పైశాచీభాషలో ఒక లక్ష శ్లోకాలు పరిమితిగల గ్రంథాన్ని నిజరక్తం సిరాగా వ్రాశాడు. ఆ గ్రంథాన్ని శిష్యులకిచ్చి శాతవాహన మహారాజుకు పంపిచాడు. సహృదయుడైన నృపాలుడు ఆ గ్రంథాన్ని చదివి, ఆనందించి, లోకంలో వ్యాప్తి చేయగలడని గుణాఢ్యుడు ఆశించాడు. కాని, ఆరాజు గ్రంథాన్ని చూడనే చూడడు. ఆమోదించడు. నిజం ఎప్పటికో తెలుస్తుంది. అప్పటికి ఆరుగురు చక్రవర్తుల కథలను గుణాఢ్యుడు అగ్నికి ఆహుతి చేస్తాడు. లోకానికి ఒక్క నరవాహన చరిత్ర మాత్రమే మిగిలింది.

నేపాలదేశపు బృహత్కథలో ఈ విషయం మరొక విధంగా ఉంది. గుణాఢ్యుడి రచన గురించి రాజుకి నిజం తెలిసిన వైనం మాత్రం భిన్నంగా ఉంది. శాతవాహన నృపతి ఉన్నట్లుండి కృశించిపోతాడు. అతనిని పరీక్షించిన వైద్యులందరూ నీరసమాంస భోజనమే రుగ్మతకు మూలమని అంగీకారానికి వస్తారు. ఇంకా విచారించగా వనంలోని మృగాలు, పక్షులు గుణాఢవో పండితుడు చదివి వినిపిస్తున్న కథలను వింటూ, వాటిని వ్రాసిన భూర్జపత్రాలను అతడు అగ్నిలో వ్రేల్చగా కన్నీరు కారుస్తూ, నిద్రాహారాలను మాని కృశించి పోయాయని తెలుస్తుంది. శాతవాహనుడు ఒక చక్రవర్తి వృత్తాంతమున్న గ్రంథాన్ని మాత్రం రక్షించుకోగలిగాడు.

బృహత్కథలోని కథలు భారతీయుల జాతీయతను, అభిప్రాయాలను, ఆచారాలను, విశ్వాసాలను ఉగ్గడిస్తాయి. హిందూ సమాజానికి ఇవి ప్రతిబింబాలు. నాగరిక ప్రపంచంలోని

దుర్వ్యసనాలను, దుశ్చేష్టితాలను ఇవి వివరిస్తాయి. చాలకథలు స్త్రీజాతి యొక్క దుర్మార్గత్వాన్ని, దుశ్శీలత్వాన్ని, కుటిలత్వాన్ని, ద్రోహబుద్ధిని బయటపెడతాయి. ఇవి స్త్రీల గౌరవానికి తగినటువంటివికావు. ఈ కథలు, వ్యంగ్యంగా, స్వేచ్ఛగా స్త్రీజాతిని మాత్రమే అవహేళన చేసి, పురుషుల అవగుణాలను దాచాయని అనుకోనక్కరలేదు. ఈ కథలు పురుషజాతిని విమర్శించకుండా విడిచిపెట్టలేదు.

కథాసరిత్సాగరం

'గుణాఢ్యుడి బృహత్కథను మూలంగా తీసుకొని సంస్కృతంలో వ్రాసిన మూడు రచనలలోను కథాసరిత్సాగరం ముఖ్యమైనది. కథలనే నదులకు ఇది సముద్రం. ఎక్కడెక్కడి నదులు సముద్రాన్ని చేరినట్లు, ఎక్కడెక్కడి కథలు ఈ గ్రంథంలో చేరాయి. దీని రచయిత సోమదేవభట్టు. ఇతడు కాశ్మీర దేశస్థుడు. క్రీస్తుశకం పదకొండవ శతాబ్దంలో ఇతడు, రాణి సూర్యవతి ఆజ్ఞను అనుసరించి కథాసరిత్సాగరాన్ని రచించాడు. పైశాచీభాషలో గుణాఢ్యుడు వ్రాసిన బృహత్కథకు ఇది సరియైన అనువాదమని, ఔచిత్యాన్ని పోషించి కథనానికి భంగం కలుగకుండా కావ్యరసాన్ని చూపించినట్లు, నానాకథా జాలాన్ని స్మరణలో ఉంచుకోడానికిగాని, పాండితీప్రకర్షను చూపించడానికి కాదని కవి చెప్పుకున్నాడు.

కథాసరిత్సాగరం రామాయణాన్ని పోలి ఉందని కొందరు భావిస్తారు. తమిళంలో ఉన్న బృహత్కథానువాదం, "పెరుంగదై". రామాయణం వలెనే దీనిలో ఆరుకొండలున్నాయి. నాయికాహరణం, దానికై యుద్ధం, నాయకుడు ప్రతినాయకుడిని వధించి అభ్యుదయం పొందడం మొదలగువాటి చేత ఇది రామాయణాన్ని పోలిందని అభిప్రాయపడతారు.

ఈ కథలో నడుమ నడుమ రాజనీతిని, లోకనీతిని బోధించే ఉపాఖ్యానాలు చాలా చేర్చబడ్డాయి. విడివిడిగా ఉన్న రత్నాలను ఒకే సూత్రంలో దండగా గుచ్చినట్లు, వేరువేరు కథలను, వాటికి ఎట్లో అవకాశం కల్పించి, ప్రధానకథాసూత్రానికి గుచ్చినట్లు దీనిలోని అవాంతర కథలు ఉన్నాయి. కొన్ని కథలు చాల దీర్ఘములూ ప్రత్యేకగ్రంథము కాదగినట్టివి. కొన్ని చాలచిన్నవి. కొన్ని ఒకపాటి నిడివి కలవి. భేతాళుడి ఇరవై అయిదు కథలు, ఇరవై అయిదు తరంగాలున్న ఒకలంబకము. విషమశీల లంబకము విక్రమార్కుడి సాహసకృత్యాలున్నది. పంచతంత్రాది కథలు, కాకోలుకీయము మొదలైనవి కొన్ని తరంగాలలో పర్యాప్తిని పొందాయి. దశకుమారచరిత్ర, మాలతీమాధవం, కాదంబరి, నాగానందం, ప్రియదర్శిక, రత్నావళి, ప్రతిజ్ఞాయౌగంధరాయణం, స్వప్నవాసవదత్తం, ముద్రారాక్షసం మొదలగు వాటికి దీనిలోని అవాంతర కథలు ఆధారాలు. జీమూతవాహన చరిత్ర మొదలైనవి కొన్ని పునరుక్తమయాయి.

ఊహాప్రపంచానికికూడా అందనట్టి సాహస యాత్రావినోదాల కథలివి. స్త్రీపురుషుల ప్రేమ, వారి శృంగార విలాసాదులు, మహావీరుల సాహసాలు, ఆకాశంపై విమానాల మీదను, రాక్షసభేతాళాదుల వీపులపై సంచరించడం, తాళ్లతో లాగు యంత్రాలను ప్రయోగించి దూరమున రాజగృహాలలో బొక్కసములను కొల్లగొట్టడం, ఓడలమీద మహాసముద్రాలపై ప్రయాణం చేస్తూ, ఓడ పగిలిపోగా నీటిలో మునిగి చేపలకడుపులలో పడి, ఎట్లో బయటపడి, కొండలనుఎక్కి, లోయలలోదిగి, నదులను ఈది ఘోరాపాయాలను తప్పించుకొని, కొండల వంటి పక్షుల రెక్కలలో దాగొని, వాటితో ఎగిరి, ద్వీపాంతరాలు చేరి, బంధువులకు దూరమై, పడరాని పాట్లుపడి తుదకు అభ్యుదయం పొందడం, ఆకస్మికమైన అపాయం, ఆకస్మికమైన అభ్యుదయం, అంతలో దారిద్ర్యం, అంతలో ధనలాభం, ఇన్ని కష్టాలలోను పాపానికి శిక్ష, ధర్మానికి విజయం ఇటువంటి విశేషాంశాలు ఎన్నో ఉన్నాయి. ఆ గ్రంథంలో మూఢుల కథలు, ధూర్తుల కథలు, మేధావుల కథలు, హాస్య చమత్కారాత్మకమైన కథలు, కులస్త్రీల కథలు, కుస్త్రీల కథలు, ఎన్నో కొన్ని వేల సంవత్సరాల కిందటి జనుల దైనం దినజీవితం, వారిమతం, సంగీత నాట్యనాటకాది వినోదాలు, వైద్యం, స్వర్ణకార యంత్రకార పిశాచ ప్రయోగాది కృత్యాలు, భూతప్రేత పిశాచ బ్రహ్మరాక్షస శాకినీ డాకిన్యాదుల భయంకర చర్యలు కళ్లకు కట్టినట్లు వర్ణింపబడ్డాయి. కంచి, ఉజ్జయిని, పాటలీపుత్రం, కార్కోటకం, తామ్రలిప్తి మొదలైన మహానగరాలు, అక్కడి విద్యార్థి జీవితం మొదలుకొని వేశ్యావాటికల శృంగార కోలాహలం వరకు ఎల్లవారి చర్యలు వివరింపబడ్డాయి. సర్వత్రలోకనీతి, రాజనీతి ఉపదేశింపబడ్డాయి. (వేదము వేంకటరాయశాస్త్రి - కథాసరిత్సాగరం (అనువాదం) మొదటి భాగం - ఉపోద్ఘాతం । నాలుగవముద్రణం - జనవరి - 1962.)

వేతాళపంచవింశతిక

పంచతంత్రంవలె విస్తార ప్రచారం కల గ్రంథం వేతాళపంచవింశతిక. కాశ్మీరదేశపు బృహత్కథలో ఇది పూర్తిగా ఉంది. దీని మూలప్రతి మనకు లభ్యం కాలేదు. భారతదేశం తాంత్రిక విద్యకు జన్మభూమి. ఆకారణంచేత దీనిలోని కథలు మతానికి సంబంధించినవి. కొన్ని కథలు హాస్య ప్రధానాలు, కొన్ని దుఃఖాంతాలు, చాల కథలలో అభిచారహోమాదుల గురించి చెప్పబడింది. బౌద్ధంలోకాని, జైనంలోగాని ఈగ్రంథం యొక్క మూల బీజం లభించదు.

కథాంతమందు ఉన్న శ్లోకాలు ఉపదేశాత్మకాలు కాని, ధర్మశాస్త్రానికి సంబంధించినవి గాని, నీతిశాస్త్ర సంబంధములైకాని, కామశాస్త్ర పరమైనవికాని అయి ఉన్నవి. శివదాసుడు సంస్కరించిన గ్రంథంలో శ్లోక సంఖ్య పెరిగి ఈ రచనకు చంపూ కావ్య గౌరవం లభించింది.

భారతీయ కథన సాహిత్య మందు, విశ్వసాహితి యందు వేతాళ పంచవింశతిక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది.

మదనసేనకథ విశ్వసాహితిలో బహుళప్రచారమున్న కథ. ఆమె, ప్రియుడి సమాగమం కోసం, భర్తయొక్క ఆజ్ఞను పొంది వెళ్లేటప్పుడు మధ్యేమార్గంలో చోరుడొకడు ఎదురవుతాడు. అతడు ఆమె కథ వింటాడు. ఆమెకు హాని తలపెట్టకుండా విడిచిపెడతాడు. భర్త అనుమతిని పొంది ప్రియురాలు వచ్చిన సంగతి తెలిసి, ఆ ప్రియుడు కూడా ఆమెను గౌరవించి భర్త దగ్గరికి పంపిస్తాడు. మదనసేన భర్త, చోరుడు, ఆమె ప్రియుడు ఈ ముగ్గురిలో ఎవరు గుణాధికులు?

ఈ సందర్భంలో ఆరవకథను కూడా పేర్కొనవచ్చు. రంగులు వేసేవారి కులంలో ముఖ్యుడొకడున్నాడు. అతడికూతురుని సామాన్యమైన జీవనస్థాయిలో ఉన్న యువకుడొకడు మోహించి, ఆమె తనకు భార్యగా లభించినట్లయితే భట్టారికాదేవతకు తన శిరస్సును అర్పిస్తానని మొక్కుకుంటాడు. దైవికంగా తాను కోరిన పడుచునే ఆయువకుడు వివాహమాడుతాడు. ఒకనాడు కొత్తపెళ్లి కూతురితోను, మరొకస్నేహితుడితోను కలిసి అత్తవారి ఊరుపోతూ దారిలో భట్టారికా ఆలయాన్ని చూస్తాడు. భార్యను స్నేహితుడిని బైటవిడిచి, రంగులవాడు గుడిలోకిపోయి దేవతకు తన శిరస్సును అర్పించుకుంటాడు. కొద్దికాలం గడచినంతనే అతని స్నేహితుడు ఆలయంలోకి ప్రవేశించి, మిత్రుడి పరిస్థితిని గమనించి, బైటికి పోతే లోకం తనను అనుమానిస్తుందని, తానుకూడా దేవతకు శిరస్సును అర్పించుకుంటాడు. భర్త, అతని మిత్రుడు ఎప్పటికీ రాకపోవడం చూసి, ఆనూత్న వధువు ఆలయంలోకి వెళ్లి, మిత్రుల మృతకళేబరాలను చూసి, తాను కూడా చనిపోవడానికి నిశ్చయిస్తుంది. దేవత ఆమె సాహసానికి ప్రీతి జెంది, ఆమెను వారించి, కళేబరాలకు శిరస్సులను చేర్చినట్లయితే వాళ్లిద్దరూ తిరిగి బతకగలరని వరమిస్తుంది. తొందరలో ఆమె ఒక కళేబరానికి ఇంకొకరి శిరస్సును చేర్చుకుంది. 'ఆమె ఎవరిని భర్తగా స్వీకరించాలి?' ఈ వేతాళప్రశ్నకు విక్రముడు ఈ విధంగా జవాబు చెప్తాడు.

'అన్ని ఔషధాలలో ఆహారం ఉత్తమం
పానీయాలన్నిటిలోను నీరే శ్రేష్ఠమైనది
స్నేహితులందరిలోను భార్యయే సన్నిహితురాలు
అంగాలన్నిటిలోను శిరస్సే ప్రధానం

గెటేమహాశయుడు పరియాఉపాఖ్యానము' (Paria Legend) వ్రాశాడు. ఈ కథ దానికి ఆధారం.

(Wintegnitz History of Indian Literature - VOL III - Part I Narrative Literature.)

ముఖ్య భారతీయ భాషలన్నిటిలోకి వేతాళపంచ వింశతిక అనువదింపబడింది. చాల మార్పులు చెంది, 'సిద్ధి-కూర్' అన్న పేరు గల గ్రంథంగా మంగోలియక్ భాషలో వెలువడింది.

సంస్కృత భాషలోకి 'సిద్ధి' అన్న పదం, మంగోలియక్, భాషలోని కూర్' అన్న పదం కలిసి 'సిద్ధి-కూర్' గా ఏర్పడింది. 'దివ్యశక్తులు కలిగిన మృతులు' అని దీనికి అర్థం. ఆ గ్రంథంలో పదమూడు కథలు మాత్రమే ఉన్నాయి. మూలకథ తప్ప మిగిలిన కథలు అంతగా భారతీయ కథలకు సంబంధించవు.

శుకసప్తతి

శుకసప్తతి లోకప్రియమైన కథాగ్రంథం. దీనికి అనన్య సామాన్యమైన ప్రచారముంది. 'చిలుక చెప్పిన డెబ్బై కథలు' ఇతర కథారచనల కన్న ఉత్తమమైనదికాదు. 'చాల విదేశభాషలలో ఈ గ్రంథం వెలువడింది. నేడు మనకు లభించే ప్రతి అర్వాచీన కాలంనాటిది. చివరకు నిలిచిన ప్రతులతో ఒకటి అలంకారయుక్తమైన భాషలో ఉంది. ఇంకొకటి సాధారణ శైలిలో ఉంది. అలంకారయుక్తమైన భాషలో వ్రాయబడిన ప్రతి, మూలానికి దగ్గిరదని విజ్ఞుల అభిప్రాయం. స్వేచ్ఛా చారిణులు, వారి ఉపాయాలు ఈ కథలకు ముఖ్య వస్తువులు. స్త్రీలకు చెందిన చాల కథలు అర్వాచీన పంచతంత్ర సంస్కరణలో కనిపిస్తాయి.

శుకసప్తతి కర్త ఎవరో, ఎపుడు వ్రాయబడిందో తెలియదు. తురుష్కభాష (తుర్కీభాష) లోకి అనువదింపబడిన 'తూతీనామా' విశ్వసాహితిలో ప్రముఖమైన స్థానాన్ని ఏర్పరచుకుంది. పారసీకానువాదం క్రీస్తుశకం పధ్నాలుగవ శతాబ్దంలో వెలువడింది. తూతినామా ద్వారా అనేకములైన భారతదేశకథలు పశ్చిమ ఆసియా, యూరోపు ఖండాలలో వ్యాపించాయి.

ఇతరకథాసంగ్రహాలు

'సింహాసనద్వాత్రింశతిక' ను విక్రమార్క చరిత్ర అనికూడా అంటారు. ఈ గ్రంథం యొక్క లిఖిత ప్రతులలో ప్రత్యేకమైన వైవిధ్యం కనిపిస్తుంది. ఇదే దీని జనప్రియత్వానికి తార్కాణ. దక్షిణభారత ప్రతి మూలగ్రంథానికి సమీపంగా ఉంది. ఉత్తరభారత ప్రతిలో నీతిభాగం పెంచబడింది. జైన సంస్కరణలో కథలు, నీతులు చాలవరకు పెరిగి, జైనమత సంప్రదాయాలు కనిపిస్తాయి. దీనిలోని ముప్పైరెండు కథలు అద్భుతరస ప్రధానాలు. వేతాళపంచ వింశతికలో లభించిన ఆలోచనా సౌరభ్యం వీటిలో కనిపించదు. ఇవి బాలురకు

తగినవి. ఈ కథలు భోజుడి కాలం నాటివని, క్రీస్తుశకం పదకొండవ శతాబ్దం తరువాత వచ్చాయని అంటారు. క్రీస్తుశకం 1574వ సంవత్సరంలో అక్బరు చక్రవర్తి ఆదేశానుసారం పారసీక భాషలోకి అనువదింపబడ్డాయి.

'విక్రమోదయం' అన్న కథా సంగ్రహం, 'పంచదండ ఛత్రప్రబంధం' అన్నవి కూడా విక్రమార్కుడి కథను చెప్తాయి. వీటిని జైనులు రచించారు. అనంతుడి 'వీరచరిత్ర' విక్రమార్క-శాలివాహనుల కథలున్న గ్రంథం. శివదాసుడు 'శాలివాహన కథ' ను రచించాడు.

మేరుతుంగుడి 'ప్రబంధచింతామణి,' రాజ శేఖరుడి 'ప్రబంధకోశం,' చారిత్రక ప్రధానాలైన కథలు ఉన్నవి.

జగన్నాథ మిశ్రుడి 'కథాప్రకాశం' శ్యామ సుందరుడి 'కలికావతారకథ' విక్రమశక సంబంధాలైన కథలను చెప్తాయి. కవికుంజరుడి 'రాజశేఖరచరిత్రం' లో నీతికథలు చాల ఉన్నాయి. విద్యాపతి రచించిన 'పురుష పరీక్ష', శ్రీవరుడి 'కథాకౌతుకం', నారాయణశాస్త్రి వ్రాసిన 'కథా లతామంజరి', లక్ష్మీనారాయణుడి 'మదనసుఖ చపేటిక' మొదలైన అనేక గ్రంథాలు మనకు లభించాయి.

కథాస్వరూపం

సాహిత్యంలో కథకు స్థానం లభించిన తరువాత ఆలంకారికులు దీనిని నిర్వచించారు. కథా భేదాలను విశదీకరించాడు.

భామహుడు తన కావ్యాలంకారం - మొదటి అధ్యాయంలో సాహిత్యాన్ని నాలుగు విధాల విభజించారు.

1. గద్యం లేక పద్యం.

2. సంస్కృతం, ప్రాకృతం లేక అపభ్రంశం

3. (అ) పురాణాలలో గల దేవతల యొక్క, లేక రాజులయొక్క చరిత్రలను వర్ణించే కావ్యం.

(ఆ) కల్పనా కథలతో నిర్మింపబడిన కావ్యం

(ఇ) కళలను చర్చించు కావ్యం (కళాశ్రయ కావ్యం)

(ఈ) శాస్త్ర వేదాంతలకు సంబంధించిన కావ్యం (శాస్త్రాశ్రయ కావ్యం).

4(క) సర్గబంధం లేక మహాకావ్యం.

(ఖ) అభినేయార్థం లేక రూపకం

(గ) ఆఖ్యాయిక

(ఘ) కథ

(చ) అనిబద్ధకావ్యం - లేక ముక్తకాలు

దండి తన కావ్యాదర్శంలో సాహిత్యవిభజన చేశాడు. గద్యం లేక పద్యం అన్న మొదటి భాగానికి గద్య పద్య మిశ్రమమైన చంపువును కూడా చేర్చాడు. అనిబద్ధకావ్యం లేక ముక్తకాలు అన్న భాగం మహాకావ్యజనితమని, ప్రత్యేకంగా పేర్కొన నక్కరలేదని అతడు పలికాడు.

ముక్తకం కులకం కోశః సంఘాత ఇతి తాదృశః
సర్గబంధాంశ రూపత్వాత్ అనుక్తః పద్యవిస్తరః   కావ్యాదర్శం 1-13.

దండి అభిప్రాయానుసారం ముక్తకం,కులకం, కోశం, సంఘాతం అన్న పద్యరచనలు (పద్యవిస్తరములు) సర్గబంధం నుండి జనించిన అల్పమైన ప్రక్రియలు. ముక్తకం ఎక్కడనో లభించే ఒకే ఒక పద్యం. ఒకే విషయంపైన చెప్పిన అయిదారు పద్యాలు కులకం. చాలమంది కవులు వ్రాసిన పద్యాల సంకలనం కోశం. సంఘాతం కూడా పద్యాల సంపుటమే. కాని చాలమంది కవులచేత భిన్నభిన్న విషయాల మీద చెప్పిన పద్యాల సంపుటం మాత్రం కాదు. ఒకే కవి ఒకే విషయం మీద వ్రాసిన పద్యాల సంపుటి సంఘాతం. ఇతడు గద్యరచనల గురించి భామహుడు చెప్పిన రెండు భేదాల గురించి, అనగా ఆఖ్యాయిక, కథల గురించి ప్రస్తావించడమే కాకుండా, వాటి గురించి సుదీర్ఘంగా చర్చించి, ఈ రెండేకాకుండా ఇతర విధములైన కథలు కూడా, పేరుకు మాత్రం వేరుగా ఉన్నా, వాటిలో భేదం లేదని నిరూపిస్తాడు.

మిశ్రకావ్యాలు రెండురకాలు. దృశ్యకావ్యమైన నాటకం మొదటిది. శ్రవ్యకావ్యమైన చంపువు రెండవది.

దండి ముఖ్యమైన కావ్య విభజన చేశాడు. ముక్తకం, కులకం, కోశం, సంఘాతకం అన్న పద్యకావ్యాల గురించి చెప్పి, కథ ఆఖ్యాయికలు కాక ఇతరములైన కథా భేదాలు ఆఖ్యానం నుండి పుట్టినవని అన్నాడు (శేషాశ్చ ఆఖ్యానజాతయః)

వామనుడు భామహునుడిని అనుసరించాడు. గద్యపద్య విభజన చేసి, అనిబద్ధ కావ్యాన్ని విడిగా ఉన్న పూలతోను, నిబద్ధ కావ్యాన్ని గుచ్చిన పూలదండతోను, సరిపోల్చాడు. నాటకం సర్వోత్కృష్టమైన సాహిత్యమని, కథ, ఆఖ్యాయిక, మహాకావ్యం మొదలైన సాహిత్య ప్రక్రియలు నాటకం నుండి వెలువడినవని అతడు అభిప్రాయపడ్డాడు.

రుద్రటుడు తన కావ్యాలంకారం చివరి అధ్యాయంలో కొత్త విషయాలు వ్రాశాడు. ఇతివృత్తాన్ని దృష్టిలో ఉంచుకొని కావ్యాలను మహాకావ్యాలు, లఘు కావ్యాలని విభజించాడు.

కావ్యం యొక్క అవకాశాన్ని పురస్కరించుకొని, దాని పరిమాణాన్ని బట్టి ఈ విభజన జరిగింది. మహాకావ్యంలో నాలుగు పురుషార్థాలు, అన్ని రసాలు ఉంటాయి. లఘు కావ్యంలో

జీవితంలోని ఒక చిన్న భాగం గురించి, ఏదో ఒక పురుషార్థం గురించి చెప్పబడి ఉంటుంది. ఒకటో, మరికొద్దిగనో రసాలు ఉంటాయి. తరువాత అతడు కథ, ఆఖ్యాయికల గురించి చెప్పాడు. బాణుడి కాదంబరిని హర్షచరితాన్ని దృష్టిలో ఉంచుకొని చెప్పిన విషయమిది. మహాకావ్యం గురించి చెప్పిన తరువాత, పదహారో అధ్యాయంలో మహాకథకు, ఖండకథకు కల భేదాన్ని వివరించాడు. మహాకథ విషయంలో, కవి భేదాన్ని వివరించాడు. మహాకథ విషయంలో, కవి ముందుగా దేవతాప్రార్థనను, గురుస్తుతిని చేసి, వంశవర్ణన కావించి, రచనకు కల కారణాలను తెలిపి కథను ప్రారంభిస్తాడు. మహాకావ్యంలో వలెనే రచన జరుగుతుంది. అయితే మహాకావ్యం పద్యబద్ధమైతే మహాకథ గద్యంలో నడుస్తుంది. ముఖ్య కథలో ఆముఖ కథ (Introductory Story) వస్తుంది. మహాకథను గద్యంలోనేకాక పద్యంలోను, సంస్కృతంలోనేకాక ప్రాకృతంలోను వ్రాయవచ్చునని రుద్రటుడు అభిప్రాయపడ్డాడు. దీనిని బట్టి కథారచనలో, భాషావిషయంలో, గద్యమా లేక పద్యమా అన్న నిర్ణయంలో అంతగా పట్టింపు కనిపించదు. నమిసాధువు రుద్రటుడి రచనకు వ్యాఖ్యానం వ్రాస్తూ, కథను ప్రాకృతంలో వ్రాసినప్పుడు పద్యరూపంలో ఉండాలని నిర్దేశించాడు. అంటే సంస్కృతంలో వ్రాసిన కథ విధిగా గద్యరూపంలో ఉండాలని అర్థమన్నమాట. ఆఖ్యాయికను గురించి చెప్పేటప్పుడు హర్షచరితమే రుద్రటుడి దృష్టిలో ఉంది. కవిప్రశంస పద్యాలలో ఉంటుందని, కథ ఎప్పుడూ గద్యంలోనే చెప్పబడుతుందని, అపవక్త్రశ్లోకాలు, అటువంటివే అయిన ఇతర శ్లోకాలు ఉంటాయని, విభజింపబడిన అధ్యాయాలను ఉచ్ఛ్వాసాలంటారని అతడు వ్రాశాడు. రుద్రటుడు ఖండకథ గురించి చెప్పిన విషయం గమనించవలసి ఉంటుంది. ఈ చిన్న కథలో సుఖియైన నాయకుడు దుఃఖానికి పాలవుతాడు. బ్రాహ్మణులు, బేహారులు, భృత్యులు మొదలైన పాత్రలు ఎన్నో ఉంటాయి. ముఖ్యరసం ప్రథమానురాగమో, ప్రవాసశృంగారమో, లేక కరుణయో - ఇవన్నీ విప్రలంభశృంగారానికి సంబంధించినవే. ఈ నియమాలన్నీ కవి కల్పించిన కథకే చెందుతాయని ఇతడు చెప్తాడు. ఈ విషయం ముఖ్యంగా గుర్తు ఉంచుకోవలసినది. నమిసాధు పదహారవ అధ్యాయంలో ముప్పైఆరవ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ, ముక్తకం, సందానికం మొదలగు వాటితో పరికథను కూడా పేర్కొన్నాడు.

ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకం మూడవ ఉద్యోతంలో కావ్యభేదాలను వివరిస్తూ పర్యాయబంధం, పరికథ, ఖండకథ, సకలకథల గురించి ప్రస్తావించాడు. మొదటిసారిగా ఆనందవర్ధనుడి రచనలో ఇవి పేర్కొనబడ్డవి. తరువాత సర్గబంధం, అభినేయార్థం (నాటకం) ఆఖ్యాయిక, కథల గురించి చెప్పాడు. అభినవగుప్తుడు తనలోచనంలో వీటి స్వరూప స్వభావాల గురించి వ్యాఖ్యానించాడు.

పరికథ, ఖండకథ, సకలకథ - ఈమూడూ కథాజాతుల కింద వస్తాయి. ఒక పురుషార్థం గురించి కాని, లేక అన్ని పురుషార్థాల గురించికాని వివరించే కథలు ఇవి.

పరికథ చాల ఉపాఖ్యానాలను కలిగి, ఒకే పురుషార్థం గురించి చెప్పడానికి ఉపకరిస్తుంది.

ఖండకథ తక్కువ విస్తీర్ణం కలది.

సకలకథ పరికథ కన్న హెచ్చు పరిధి కలది.

పరికథ సంస్కృతంలోనో ప్రాకృతంలోనో ఉంటుంది.

ఖండకథ చిన్నది. సకల కథ పెద్దది. రెండూ ప్రాకృతభాషలో పద్యాలలో వ్రాయబడుతాయి.

'ఖండకథా సకలకథయోః ప్రాకృత ప్రసిద్ధయోః

కులకాది నిబద్ధన భూయస్త్వాత్'

'రెండిటిని కలిపి 'ఖండకథా సకలకథయోః' అని చెప్పడంలో, అవి రెండూ ప్రాకృతభాషలో చెప్పబడేవని ఆనందవర్ధనుడి అభిప్రాయమని అభినవగుప్తుడు అన్నాడు.

'ద్వయోరపి ప్రాకృత నిర్దేశత్వాత్ ద్వందేన నిర్దేశః'

వీటిలో రసప్రసక్తి లేదు. కేవలం కథనం గురించే చెప్పబడింది.

భాషా విషయంలో పరికథ సంస్కృతంలోను, ఖండకథ సకల కథలు ప్రాకృతంలోను, ఆఖ్యాయిక, కథలు సంస్కృతంలోను ఉండాలి.

ఆఖ్యాయిక, కథల రచనా విషయంలో గద్యమా పద్యమా అన్న సందేహం పట్ల, ఆనందవర్ధనుడు ఈ రెండూ సాధారణంగా గద్యంలోనే రచింపబడతాయని అభిప్రాయం వెలిబుచ్చాడు.

'ఆఖ్యాయికా కథాయోస్తు గద్యనిబద్ధన బాహుల్యాత్'

శ్రవ్యకావ్యాలలో కథా ప్రాముఖ్యం కలవి పరికథ, ఖండకథ, సకలకథలని ఆనంద వర్ధనుడి అభిప్రాయం.

శ్రవ్యకావ్యాలు ఇరవై నాలుగని భోజుడన్నాడు

'అభినేయఃశ్రవ్యః - సోప్యాఖ్యాయికాది భేదాత్ చతుర్వింశతి ప్రకారోభవతి - ఆఖ్యాయికా, ఉపాఖ్యానమ్, నిదర్శనమ్, ప్రవహ్లికా, మణికుల్యా, కథా, పరికథా, ఖండకథా, ఉపకథా, బృహత్కథా, చంపూః, సర్వబంధః, కాండబంధః, సర్గబంధః, ఆశ్వాసబంధః,

సంధిబంధః, అరస్కంధబంధః, కావ్యశాస్త్రమ్, శాస్త్రకావ్యమ్, కోశః, సంఘాతః, సంహితా, సాహిత్యప్రకాశఇతి.

వీటిలో ఉపాఖ్యానమ్, నిదర్శనమ్, ప్రవహ్లికా, మణికుల్యా, ఉపకథా, బృహత్కథా, సర్వబంధః, కాండబంధః, ఆశ్వాసకబంధః, సంధిబంధః, సంహితా, సాహిత్యప్రకాశః అన్నవి ఆలంకారికులు అంతవరకు చెప్పనివి.

కథ గురించి చెప్పినప్పుడు ఆఖ్యాయిక గురించేకాక, ఇతరములైన ఆఖ్యానరూపాల గురించి కూడా చెప్పాడు. అన్ని రకాల భాషలలో వచ్చే అన్ని రకాలైన కథలను 'కథ' కిందే పరిగణించాడు. ఆనంద వర్ధనుడు చెప్పిన 'సకలకథను' విడిచిపెట్టి, 'ఉపకథ', 'బృహత్కథ'ను భోజుడు పేర్కొన్నాడు.

ఆఖ్యాయిక-కథ

భోజుడు ఆఖ్యాయిక గురించి చెప్తూ రెండు గ్రంథాలను ఉదాహరణలుగా చెప్పాడు. ఒకటి బాణుడి హర్షచరితము. ఇది లభ్యం - రెండవది మాధవిక - ఇది అలభ్యం - భామహుడి ఆఖ్యాయికా నిర్వచనమే భోజుడు కూడా అంగీకరించాడు. కాని అనుష్టుభ్ శ్లోకాలను ఆర్యశ్లోకాలుగా మార్చివేశాడు.

'ఖ్యా' - చెప్పు అనుధాతువు నుండి ఆఖ్యాయిక జనించింది. నిస్సందేహంగా కథన ప్రాముఖ్యత కలది ఆఖ్యాయిక. మొదటి నుంచీ రాజుల చరిత్రను గురించికాని, ఉత్తముల చరిత్రను గురించి కాని చెప్పేదని తెలుసు. ఈ అర్థం వైదిక కాలంనుండి ప్రచారంలో ఉంది. రామాయణాన్ని ఆఖ్యానమంటారు. రఘుకుల మందలి రాజుల చరిత్రను, ముఖ్యంగా అప్పటి వాడైన రాముడి చరిత్రను చెప్తుంది. కాబట్టి దీనిని ఈఖ్యానమన్నారు. ముఖ్యకథ బాలకాండలో అయిదవ సర్గతో మొదలవుతుంది.

ఇక్ష్వాకూణామిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనామ్
మహదుత్పన్నమాఖ్యానం రామాయణమితిశ్రుతమ్ 3వ శ్లోకం

చివరను కూడా ఈ విధంగా ఉంది.

ఏవమేతత్ పురావృత్తమాఖ్యానం భద్రమస్తువః
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం విష్ణోః ప్రవర్ధతామ్.

ఆఖ్యానం వేదాల యొక్క ముఖ్యమైన అనుసంధానభాగమని మహాభారతం చెప్తున్నది.

సాంగోపనిషదాన్ వేదాన్ చతురాఖ్యాన పంచమాన్.
యోధీతే చతురో వేదాన్ సర్వానాఖ్యాన పంచమాన్.
యోధీత్య చతురో వేదాన్ సాంగానాఖ్యాన పంచమాన్.
వేదాశ్చాఖ్యాన పంచమాః

బృహదారణ్యకోపనిషత్తు ఇతిహాసం గురించి పురాణం గురించి పేర్కొంది. ఛాందోగ్యోపనిషత్తు ఇతిహాసాన్ని అయిదవ వేదంగా పరిగణిస్తోంది.

వేదమంత్రాల వెనుకనున్న కథలను ఇతిహాసాలని, ఆఖ్యానాలని అంటారని నిరుక్తంలో ఉంది. ఈ కథల ద్వారా వ్యాఖ్యానించేవారిని ఐతిహాసికులని పిలుస్తారు. ఈ విషయం యాస్కుడు నిరుక్తంలో పేర్కొన్నాడు. వేదాలలో చెప్పే కథలను ఆఖ్యానాలని ముందు నుంచే గుర్తించారు. రాజసూయ, అశ్వమేధ యాగాలలో శునశ్శేపుడు, సుపర్ణుడు మొదలైన వారి కథలు చెప్పబడేవని, వాటిని చెప్పేవారిని అఖ్యానవిదులని అంటారని బ్రాహ్మణాలలో ఉంది. తైత్తరీయారణ్యకంలోను, అధర్వవేదంలోను ఇతిహాస పురాణాల ప్రసక్తి ఉంది.

వైదికయుగంలో ఆఖ్యాన సాహిత్యం ఉండి ఉండాలని ఓల్డెన్‌బెర్గ్ (Oldenberg) గెల్డెనర్ Geldener) సీగ్ (Seig) పండితులు అభిప్రాయపడుతున్నారు.

ఆఖ్యాయిక ఈ పురాతన ఆఖ్యానం నుండి వచ్చి ఉంటుంది. పురాణాలు పూర్వరాజుల గురించి, నాయకుల గురించి చెప్పే ఆఖ్యానాలు. ఇవన్నీ శ్లోకరూపంలో ఉన్నవి. కాని వీటినుంచి ఆవిర్భవించిన ఆఖ్యాయిక మాత్రం గద్యరూపంలో ఉంది. వార్తికాకారుడైన కాత్యాయనుడి కాలంనుండి ఆఖ్యానం, ఆఖ్యాయిక అన్నవి భిన్న రూపాలలో వెలువడినట్లు తెలుస్తుంది. భిన్నత్వం లేకపోతే వాటిని వేరు వేరుగా చెప్పడం జరగదు.

'లుబాఖ్యాయి కాభ్యో బహులమ్' అని ఒక వార్తికాకారుడు, 'ఆఖ్యాన - ఆఖ్యాయికా - ఇతిహాస పురాణేభ్యశ్చ' అని మరొకడు ఆఖ్యాయికను గురించి చెప్పారు. వాసవదత్త, సుమనోత్తర, భైమరథి - ఈ మూడు ఆఖ్యాయికల గురించి పతంజలి చెప్పాడు. ఆఖ్యానం గురించి ఉదాహరణలిచ్చేటప్పుడు యాయాతి మొదలైన పురాణ కథల గురించి చెప్పి, ఆఖ్యాయిక గురించి చెప్పేటప్పుడు వాసవ దత్తను, సుమనోత్తరను పేర్కొంటాడు. ఆఖ్యానం పురాణతాత్పర్యమని, ఆఖ్యాయిక కాల్పనిక రచన అని అవగతమవుతుంది.

'కావ్య నాటక ఆఖ్యాన ఆఖ్యాయికా ఆలేఖ్యాది క్రియానిపుణైః' అని బాణుడు కాదంబరిలో వ్రాశాడు. దీనిని బట్టి ఆఖ్యానం, ఆఖ్యాయిక - ఈ రెండు వేరని తెలుస్తుంది.

ఆఖ్యానం పురాణగతమని, శ్లోకరూపంలో రచింపబడుతుందని, ఇతిహాసమన్న పేరుతో పురాతన భారతదేశపు ప్రఖ్యాతులైన రాజుల వంశకథలను చెప్పుతుందని, ఆఖ్యాయిక అటు పిమ్మట కవులచేత గద్యరూపంలో రచింపబడిన సాహిత్య ప్రక్రియ అని, అర్వాచీన రాజుల వీరశృంగార చరిత్రలను వర్ణించేదని మనం ఒక నిర్ధారణకు రావచ్చు.

ఆఖ్యాయికకు కథకు కల భేదం ఎటువంటిది? చారిత్రకమైనదా, లేక సంప్రదాయబద్ధమా?

తొలిరోజులలో చారిత్రకమైన విషయాన్ని ముఖ్యమైన ఆధారంగా తీసుకొని వర్ణించిన కాల్పనికరచనను కథ అన్నారు. 'కథ' అన్న పదం రామాయణానికి కూడా వర్తిస్తుంది.

కురు రామకథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్.

అర్వాచీనసాహిత్యంలో 'కథ' చారిత్రక సత్యం అల్పంగా ఉన్న రచనకు చెందినదని తెలుస్తుంది.

ఆఖ్యాయ కోప లబ్ధార్థా.
ప్రబంధకల్పనా కథా.

భానుజీ వీటిని వ్యాఖ్యానించాడు.
ఏకం జ్ఞాతసత్యార్థభూతాయాః కథాయాః
ప్రబంధస్య కల్పనా రచనాస్తోక సత్యా - యథా కాదంబర్యాదిః

సత్యమైన అర్థం కలిగిన హర్షచరితము ఆఖ్యాయిక.
కొంచెం సత్యమున్న ప్రబంధం కాదంబరి.

సత్యానందుడు అమరకోశం మీద టీకాసర్వస్వం వ్రాశాడు. అందులో ఉదాహరణ ఒకటి ఇస్తూ, కోహలుడు ఆఖ్యాయికకు, కథకు కల భేదాన్ని వివరించాడని చెప్పాడు.

కోహలాచార్యః పునరేవాహ -
ప్రబంధ కల్పనాయాం ప్రాక్ సత్యాం సుజ్ఞాః కథాం విదుః
పరంపరాశ్రయో యస్యాం సా మతాఖ్యాయికా క్వచిత్

భామహుడు ఆఖ్యాయికను నిర్వచించాడు. అది గద్యంలో ఉంటుంది. విభజించిన అధ్యాయాలకు ఉచ్ఛ్వాసాలని పేరు. నాయకుడే కథ చెప్తాడు. వక్త్ర అపవక్త్ర ఛందస్సులలో శ్లోకాలుంటాయి. రాబోయే సంఘటనల గురించి ముందుగానే చెప్పబడుతుంది. కవి చెప్పిన కొన్ని కథలలో ప్రత్యేకత కనిపిస్తుంది.

కవేరభిప్రాయకృతైః కథానైః కైశ్చిదంకితా

ఈ వాక్యంలో అభిప్రాయం స్పష్టం కాలేదు. మనకు లభించిన ఆఖ్యాయిక హర్షచరితం. ఇది గద్యంలో వ్రాయబడింది. దీనిలోని ప్రకరణాలకు ఉచ్చ్వాసాలని పేరు. రాబోయే సంఘటనలు వక్ర, అపవక్ర ఛందస్సులలో ఉన్న శ్లోకాలలో చెప్పబడ్డాయి. కాని, నాయకుడే స్వీయకథను ఈ గద్య కావ్యంలో చెప్పడం లేదు. గ్రంథారంభంలో కవి తన చరిత్ర గురించి చెప్పుకుంటాడు. ఈ చెప్పినవాడు బాణుడు. నాయకుడు హర్షుడు. అతడేమీ చెప్పడు. కాని, భామహుడెరిగిన కొన్ని ఆఖ్యాయికలు స్వీయచరితాప్రధానాలు కావచ్చు. అటువంటివి నేడు లభ్యమవడం లేదు. ఒక్కొక్కసారి నాయకుడే తన కథను చెప్పవచ్చునని, ఇతర సమయాలలో అతని అనుచరుడు, హర్షచరితంలో బాణకవివలె, చెప్పడం జరుగుతుందని భోజుడు అభిప్రాయపడతాడు.

నాయక చరితం బ్రూతే నాయక ఏవాస్య వానుచరః

హర్షచరితంతో పాటు ఉదాహరింపబడిన మాధవిక అన్న మరొక ఆఖ్యాయిక బహుశా స్వీయచరిత్ర వలెనే సాగి ఉండవచ్చు. భోజుడు రెండు ఉదాహరణలు ఇచ్చాడు. వాటిని ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసమే పేర్కొన్నాడు.

కథ గద్యంలోనో లేక పద్యంలోనో ఉంటుందని, సంస్కృతంలోనో లేక ప్రాకృతంలోనో రచింపబడుతుందని నిర్వచించి, లీలావతీ, కాదంబరీ రచనలను ఉదాహరణలుగా పేర్కొన్నాడు భోజుడు. కాదంబరి సంస్కృతభాషలో గద్యంలో రచింపబడింది. లీలావతి ప్రాకృతభాషలో పద్యంలో రచింపబడింది. ఆ విధంగానే నాయకుడు స్వయంగా చెప్పిన ఆఖ్యాయికకు ఉదాహరణగా మాధవికను, నాయకుని అనుచరుడు చెప్పిన అఖ్యాయికకు ఉదాహరణగా హర్షచరితాన్ని భోజుడు పేర్కొన్నాడని భావించవచ్చు. మిగిలిన విషయాలలో భోజుని వర్ణన పూర్తిగా భామహుడి నుంచే గ్రహింపబడినట్లు కనిపిస్తుంది.

కన్యాపహార సంగర సమాగమాభ్యుదయ భూషితం యాస్యామ్,
నాయక చరితం బ్రూతే నాయక ఏవాస్య వానుచరః
వక్త్రాపరవక్త్రవతీ సోచ్చ్వాసా సంస్కృతేన గద్యేన,
సాఖ్యాయికేతి కథితా మాధవికా హర్షచరితాది
కాని భామహుడు చెప్పిన
కవేరభిప్రాయకృతైః కథానైః కైశ్చిదంకితా

అన్న వాక్యం మాత్రం భోజుడు విడిచిపెట్టాడు. దీని అర్థమేమిటో దండి వ్రాసిన విషయం వలన తెలుస్తుంది. ఆఖ్యాయిక గురించి వ్రాస్తూ, కథకు ఆఖ్యాయికకు నిజమైన భేదం లేదని దండి చెప్పాడు. నాయకుడే కథ చెప్పాలా, లేక అతని అనుచరులెవరైనా చెప్పవచ్చునా అన్న విషయంలో సందేహం వస్తే, ఎవరు చెప్పినా అభ్యంతరం లేదని అతను అన్వయించాడు. ఇది అంతముఖ్యమైనది కూడా కాదు. అధ్యాయాలను ఉచ్ఛ్వాసాలని పిలవాలా, లేకపోతే అధ్యాయాలను తిరిగి విభజింపవలసి ఉంటుందా, అన్న విషయంకూడా చాల అల్పమయినదే. కాదంబరీ కథను అధ్యాయాలుగా విభజింపలేదు. కాని, సమంజసంగా తోచే అధ్యాయాలుగా విభజించి కథను రచించడానికి కవికి ఎట్టి ఆటంకం లేదని దండి అంటాడు.

భేదశ్చ దృష్టోలమ్భాదిః ఉచ్ఛ్వాసో వాస్తు కింతతః

దండి - కావ్యాదర్శం -1, 27 పుట

లంభములు అన్న పేరు గల అధ్యాయాలున్న కథలు ఉన్నాయి. ఉచ్ఛ్వాసమని పిలువక లంభము అని పిలిచినా కవిని ఎవరూ ఆపలేరు. కన్యాహరణం, సంగరం మొదలైన విషయాలు ఎటువంటి సాహిత్యరచనకైనా చెందుతాయి. తన రచనకొక ప్రత్యేకతను ఆపాదింపదలచి (కవిభావకృతచిహ్నంగా) సాంకేతికంగా ఆఖ్యాయిక అన్న పదాన్ని కవి ఉపయోగించుకున్నాడని అతను అన్నాడు. హృదయంగమ వ్యాఖ్యలో టీకాలేని శ్లోకమొకటి ఉంది.

కవిభావకృతం చిహ్నమన్యత్రాపి నదుష్యతి

ముఖమిష్టార్థసంసిద్ధ్యైకింహి న స్యాన్మహాత్మనాం

'కవి భావకృతం చిహ్నం' అన్న పదాలను తరుణ వాచస్పతి వ్యాఖ్యానిస్తూ, 'శ్రీ' అన్నపదం మాఘుని శిశుపాలవధలో చివరిశ్లోకాలలోను, 'లక్ష్మి' అన్న పదం భారవి యొక్క కిరాతార్జునీయంలోను, 'అనురాగ' అన్నపదం ప్రవరసేనుని సేతు బంధంలోను, హస్తి మల్లుని రచనలో 'లమ్భ' అన్నపదం - ఇవి చిహ్నాలయి ఉండవచ్చునని అన్నాడు. వీటిలో హస్తి మల్లుని రచనను కథగానో, ఆఖ్యాయికగానో తీసుకొనవచ్చు. మిగిలినవన్నీ సంస్కృతంలోనో ప్రాకృతంలోనో ఉన్న మహాకావ్యాలు.

దండి వ్రాసిన పై శ్లోకంలో రెండవ పాదం, ప్రత్యేకంగా వక్కాణిస్తున్నది, 'మహాత్ములైన కవులు తమ భావాలను ప్రకటించడానికి అనుసరించని పద్ధతులు ఏమున్నాయి?' శ్లోకం

మొదటి పాదంలో వచ్చిన 'చిహ్న' అన్న పదానికి 'శ్రీ' మొదలగు పదాలకు సంబంధించిన అర్థం మాఘంలోను, ఇతర కవి రచనలలోను ఉన్నట్లుగా భావించడానికి వీలుపడదు. అది ఆఖ్యాయికను నిర్వచించు విషయమని గ్రహించవలసి ఉంటుంది. 'చిహ్న' అన్న పదాన్ని 'లక్షణం' లేక 'ధర్మం' అన్న అర్థంలో, వక్త్ర, అపవక్త్ర ఛందస్సుల విషయంలో, ఉచ్ఛ్వాస విభాగాల విషయంలో, దండి ప్రయోగించాడు. 'చిహ్న మాఖ్యాయికా యాశ్చేత్' - కాబట్టి 'కవిభావకృతమ్' అన్నది శ్లోకంలో ముఖ్యవిషయంగా (కర్తగా) ఉండి, ఆ విషయంలో కవికి రచనపై గల అభిప్రాయాన్ని సూచిస్తున్నాది. దండి వ్రాసిన ఈ శ్లోకాన్ని భామహుడు వ్రాసిన

కవే రభిప్రాయకృతైః కథానైః కశ్చిదంకితా

అన్న శ్లోకంతో సరిపోలిస్తే, మరొక విధంగా అర్థమవుతుంది. భామహుడు అంతర్గత కథల గురించి (sub stories), కథానముల గురించి ప్రస్తావించాడు. వీటి యందు కవి యొక్క అభిప్రాయం వ్యక్తమవుతుంది. భామహుడు, దండి చెప్పిన ఈ విషయం గురించి బాణుని హర్షచరితం మనకు సహాయపడదు.

సాహిత్యదర్పణం కవియొక్క వంశానుకీర్తనం వలనకూడా గుర్తింపవచ్చునని చెప్తుంది.

ఆఖ్యాయికా కథావత్ కవేర్వంశాను కీర్తనమ్

బహుశా సాహిత్యదర్పణకారుని ఎదుట హర్షచరితమే ఉండి ఉంటుంది. ఎవరూ ఈ విషయం గురించి ప్రత్యేకంగా చెప్పలేదు. భామహుడు, దండి, అభినవగుప్తుడు, భోజుడు... ఎవరూ ఈ విషయం ప్రస్తావించలేదు. హేమచంద్రుడు బాణుడి హర్షచరితంలో ప్రారంభమందున్న కవి యొక్క స్వీయకథను గర్హించాడు.

అంగస్య అప్రధానస్య అతి విస్తరేణ వర్ణనం యథా.. తథా హర్షచరితే 'జయతి జ్వలద్' ఇత్యాదినా హర్షోత్కర్షవద్విజయ బీజే బాణాన్వయ వర్ణనం, తత్రాపి చ అనన్వితప్రాయ ఏవ సారస్వతోత్పత్తి పర్యన్తో మహాన్ గ్రంథసందర్భః.

ఇది ఆఖ్యాయికకు అవసరమైన లక్షణమో, కాదో కాని, హేమచంద్రుడికి, ఈ విధంగా దీనిని నిర్దేశించడానికి కాని, విమర్శించడానికి కాని అధికారం లేదు.

భోజుడు కథను ఈవిధంగా నిర్వచించాడు.
యా అనియమితగతి, భాషా దివ్యా దివ్యోభయేతి వృత్తవతీ
కాదంబరీవ లీలావతీవ వా సా కథా కథితా.

భామహుడి అభిప్రాయానుసారం వక్త్ర, అపవక్త్ర శ్లోకాలు లేనిది, ఉచ్ఛ్వాసాలు లేనిది,

సంస్కృతంలోనో లేక అపభ్రంశభాషలోనో వ్రాయబడినది, అయిన ఆఖ్యాయికే కథ అవుతుంది. కథలో నాయకుడుకాక మరొకరు కథ చెప్తారని అతను అంటాడు. ఆఖ్యాయికవలె కథ కూడా గద్యంలోనే రచింపబడుతుందని అతను స్పష్టంగా చెప్పలేదు. సంస్కృతభాషలో కాకుండా పైశాచీ భాషలో వ్రాయబడిన బృహత్కథను దృష్టిలో ఉంచుకొని, కథ అపభ్రంశభాషలో రచింపబడవచ్చునని భామహుడు చెప్పి ఉండవచ్చు. దండి మాత్రం ఆఖ్యాయిక, కథ అన్నవి గద్య కావ్య భేదాలని మొదటే చెప్పాడు.

అపాదః పదసన్తానః గద్యమాఖ్యాయికా కథా ఇతి తస్య ప్రభేదే ద్వే

కథ ఏ భాషలోనైనా ఉండవచ్చునని దండి స్పష్టంగా చెప్తాడు. భూతభాష, లేక పైశాచీ భాషలో వ్రాయబడిన బృహత్కథను కథ యొక్క ఉదాహరణగా పేర్కొంటాడు. బృహత్కథ గద్యంలోనే రచింపబడింది. కథ కేవలం సంస్కృతంలోనే రచింపబడాలని ఎక్కడాలేదు. అది ఏ భాషలోనైనా రచింపబడవచ్చు. ఆవిధంగానే కథ గద్యంలోనే కాక పద్యంలో కూడా వ్రాయవచ్చు. కేవలం గద్యంలోనే రచించాలని నిర్ధారణ జరగలేదు. ఇది అనిత్యభాషలో, అనిత్యగతిలో రచింపబడవచ్చు. గతి అంటే పద్యమైనా కావచ్చు, గద్యమైనా కావచ్చు, గద్యపద్యమిశ్రమైనా కావచ్చు. భోజుడు కథకు రెండు ఉదాహరణలు ఇచ్చాడు. ఒకటికాదంబరి, రెండవది లీలావతి - కాదంబరి గద్యకథ, లీలావతి పద్యకథ. హేమచంద్రుడు కావ్యానుశాసనం చివర భోజుడు చెప్పినదే అంగీకరిస్తాడు.

ధీరశాన్తనాయకా (హేమ చంద్రుడు చేర్చినది)
గద్యేన పద్యేన వా సర్వభాషాకథా...
సా చ కాచిత్ గద్యమయి యథాకాదమ్బరీ, కాచిత్
పద్యమయీ యథా లీలావతీ.

ఆఖ్యాయిక విషయంలో భామహుని, భోజుని హేమచంద్రుడు అనుసరిస్తాడు. కాని, ఆఖ్యాయిక యందు నాయకుడు ధీరోదాత్తుడని, కథయందు ధీరశాంతుడని చెప్తాడు. ఆఖ్యాయిక యందు నాయకుడు తనకథను తనే చెప్తాడు కాని, కథయందు మరొకరు చెప్తారు. అభిజాతుడెవడైనా స్వగుణకీర్తన చేస్తాడా?

స్వగుణావిష్కృతిం కుర్యాదభిజాతః కథం జనః

అంటాడు భామహుడు. దండి దీనిని సమర్థిస్తాడు. తనకు లేని గుణాల గురించి చెప్తే ఆత్మశ్లాఘమవుతుంది. వాస్తవమైన సద్గుణాల వర్ణన చేత నాయకునికి ఆదోషం తగులదు. హేమచంద్రుడు ఈ రెండింటియందు గల నాయకులను ధీరోదాత్తుడని, ధీరశాంతుడని విశ్లేషించాడు.

ఆనందవర్ధనుడి 'ఆఖ్యాయికా కథా' అన్న విషయంపై అభినవగుప్తుడు చెప్తూ, ఈ రెండూ గద్యంలోనే రచింపబడడం చేత జతగూర్చవచ్చునని అన్నాడు.

ఉభయోరపి గద్యబన్ధ స్వరూపతయాద్వన్ద్వేన నిర్దేశః.

భోజుడి అభిప్రాయం దీనికి భిన్నమైనది. లీలావతిని గురించి చెప్తూ, కథ పద్యంలో కూడ రచింపబడవచ్చునని అంటాడు. భోజుని అనుసరించిన శారదాతనయుడు ఆఖ్యాయిక ఎప్పుడూ గద్యంలోనే రచింపబడవలెనని నిర్ధారిస్తాడు.

ఉపాఖ్యానం

ఇది చిన్న ఆఖ్యానం. పెద్దకథ మధ్యలో వస్తుంది. ఏదేనా ఒక అభిప్రాయాన్ని ఉదాహరించి ఎవరినైనా ప్రబోధిస్తుంది. నలుడు, సావిత్రీ సత్యవంతులు, షోడశరాజులు - మహాభారతంలో వచ్చే వీరి ఉపాఖ్యానాలు ఉదాహరణలు.

నలసావిత్రీషోడశ రాజోపాఖ్యానవత్ ప్రబన్ధాన్తః
అన్యప్రబోధనార్థ యదుపాఖ్యాతి తదుపాఖ్యానమ్.

ఆఖ్యానం

ఆఖ్యాయికకు భిన్నంగా ఆఖ్యానమొకటి ఉన్నట్లు భోజుడు అంగీకరించాడు. నాటకీయతను పొందిన ఉపాఖ్యానమే ఆఖ్యానమని భోజుడు నిర్వచించాడు. సదస్సులో ఒకడుకూర్చుండి, పాడుతూ, చదువుతూ, వివరిస్తూ గీతాలను అభినయిస్తాడు. చదివినవాడు గ్రాంథికుడు. గోవిందాఖ్యానము ఉదాహరణము.

ఆఖ్యానక సంజ్ఞాంతం లభతే యద్యభినయన్ పఠన్ గాయన్
గ్రాన్థిక ఏకః కథయతి గోవిన్దవత్ హితే సదసి

ఈ విషయం కావ్యానుశాసనంలోను, దాని యొక్క వ్యాఖ్యలలోను తిరిగి వివరింపబడింది. కృష్ణుడి లీలల కథ గోవిందాఖ్యానం. భోజుడు గద్య పద్య మిశ్రమాలైన మారాఖ్యానం, సాంబాఖ్యానం, గోవిందాఖ్యానాలను పేర్కొంటాడు. ఆఖ్యానం పురాణతాత్పర్యమని నిర్ధారణ అవుతుంది. కాని భోజుడు మరొక లక్షణమైన నాటకీయతను కూడా దీనికి అంటగట్టాడు.

ఈ సాహిత్యప్రక్రియ దృశ్యకావ్యవిభాగాలకు చెందుతుంది. దీనికి సంగీతం, నాట్యం అనుసంధానించబడ్డాయి. భారతీయరంగస్థలికి చెందిన విభాగమిది. గ్రాంథికుడు కేవలం

కథకుడేకాదు, అతడు సంగీతజ్ఞుడు, నటుడు కూడా. అతడు ఏకపాత్రాభినయం చేసేనటుడి వంటివాడు. ఈ ఆఖ్యానాలు ఉపాఖ్యానాల కన్న భిన్నమైనవి. ఉపాఖ్యానాలు పురాణాలలో లభిస్తాయి. వాటిని కేవలం చదవడమో పాడడమో చేస్తారు. కాని, మార, సాంబ, గోవిందాఖ్యానాలు గద్యపద్యమిశ్రమాలై, గ్రాంథికులచే చదవబడి, పాడబడడమే కాకుండా అభినయింపబడుతవి.

నిదర్శనం

ఇది కూడ కథే, కాని ఉపదేశాత్మకమైనది. ఇది నీతికథ. పంచతంత్రం దీనికి ఉదాహరణ. ఒక్కొక్కసారి జంతువుల చేష్టలను ఆధారంగా చేసుకొని, మంచిని చెడును బోధించడానికి పంచతంత్రం వలె నిదర్శనములు సహాయపడుతాయని భోజుడు నిర్దేశించాడు. నిదర్శనాలన్నీ జంతుకథలు కానక్కరలేదు. ఉత్తమములైన పురుషపాత్రలను సృష్టించి వాటి ద్వారా మంచి గురించి చెడు గురించి బోధించడం జరుగుతుంది. ధూర్తవిట సంవాదాన్ని, దామోదరుని కుట్టినీమతాన్ని భోజుడు ఉదాహరణలుగా పేర్కొన్నాడు. భోజుడు మయూర మార్జారములు కథలుగల రెండు నిదర్శనాల గురించి చెప్పాడు. ఇవి నేటి వరకు మన మెరుగనివి. గద్యపద్య మిశ్రమములైన రచనల గురించి చెప్పినప్పుడు పంచతంత్రం, మయూరమార్జారశుకాలను ఉదాహరణలుగా ఇచ్చాడు. శుకమంటే శుకసప్తతి. ఈ నిదర్శన సాహిత్యం ఆఖ్యానాలు (Tales) నీతికథలు మొదలగు వాటి నుంచి జనించినది. ఇదంతా జనసాహిత్యం. మహాభారతంలో ఇటువంటి నీతి కథలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ఉపదేశప్రధానాలైన జంతుకథలు కూడా ఉన్నాయి. పంచతంత్రకథలు తొలుత మహాభారతంలోని నీతికథల నుండి జన్మించి ఉండవచ్చు.

నిదర్శనం గురించి భోజుడు ఈ విధంగా చెప్పాడు.
నిశ్చీయితే తిరశ్చామతి రశ్చాం వా యత్ర చేష్టాభిః
కార్యమకార్యంవా తన్నిదర్శనం పంచతంత్రాది.
ధూర్తవిట కుట్టనీమత మయూర మార్జారికాది యల్లోకే
కార్యాకార్య నిరూపణ పరమిహ నిదర్శనం తదాపి
కౌటిల్యుడి అర్థశాస్త్రం మీద 'యోగ్ఘమీ' వ్రాసిన 'టప్పణంక' లో ఇలా ఉంది.
అసంభూత కథా వాక్యముక్త ప్రత్యుత్తరాన్వితమ్
నిదర్శనార్థమన్యేషాముదాహరణ ముచ్చతే.
యథా తన్త్ర పఞ్చకాది.

మన్థల్లీ

> క్షుద్రకథా మన్థల్లీ యేహ మహారాష్ట్ర భాషయా భవతి
> గోరోచనేవ 'కార్యా సానంగవతీవ వా కవిభిః
> యస్యాముపహాసఃస్యాత్ పురోహితామాత్యతాపసాదీనామ్
> ప్రారబ్ధా నిర్వహే సాపి మన్థల్లికా భవతి.

కావ్యానుశాసనంలో మతల్లిక అని ఉంది. ఈ రెండు శ్లోకాలు మన్థల్లికను నిర్వచిస్తున్నాయి. కాని, భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి. మొదటి అభిప్రాయాన్ని అనుసరించి మహారాష్ట్రీ ప్రాకృతంలో వ్రాయబడిన క్షుద్రకథ (చిన్నకథ) మన్థల్లీ అని పిలువబడుతుంది. గోరోచన, అనంగావతి - ఈ రెండు కథలు ఉదాహరణలు. ఈరెండూ నేడు మనకు లభించడం లేదు.

రెండవ అభిప్రాయం ప్రకారం పురోహితుడు, అమాత్యుడు, తాపసులు తమ కార్యనిర్వహణలో విఫలులైనప్పుడు వారిని పరిహసించే హాస్య రచన మన్థల్లిక అవుతుంది. పురోహితుడు మొదలగువారు ఏమి పనులు చేస్తారో, వేటిని చేయలేకపోతే అపహసింపబడతారో ఈ శ్లోకం వివరించలేదు. ఉదాహరణ కూడా ఇవ్వలేదు.

శృంగారప్రకాశికలో ముందు చెప్పినట్లు మన్థల్లీ గద్యంలోనే రచింపబడుతుందని తెలుస్తుంది.

తదేతత్ (గద్యం) త్రివిధమపి ఆఖ్యాయికాసు, కథాసు మధువల్లికాదిషు (మన్థల్లికాదిషు) దృశ్యతే.

మణికుల్య

> మణికుల్యాయాం జలమివ న లక్ష్యతే యత్ర పూర్వతో వస్తు
> పశ్చాత్ ప్రకాశతే సా మణి కుల్యా మత్స్యహసితాది-

మొదటిలో తెలియని రహస్యం మణికుల్యలో చివరకు వివరింపబడుతుంది. మత్స్యహసితమును భోజుడు ఉదాహరణగా చెప్తాడు. ఈ పేరు గల కథ మనవరకు రాలేదు. కాని కథాసరిత్సాగరం, మొదటి లంభకం, ఐదవతరంగం, 16 నుండి 28 వరకు గల శ్లోకాలలో చిన్న ఉపకథ ఒకటి కనిపిస్తుంది. విపణిలో చచ్చిన చేపనవ్వుతుంది. మత్స్యహసితమది. ఇటువంటి చచ్చిన చేపకథను వివరించే పెద్దకథ ఒకటి శుకసప్తతిలో ఉంది. ఈ రెండూ మణికుల్య గురించి భోజుడు చెప్పిన విషయానికి సంబంధించి ఉన్నాయి.

పరికథ

పరికథను గురించి ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు పేర్కొన్నారు. చతుర్విధ పురుషార్థాలను ఉద్దేశించి ప్రకారవైచిత్ర్యంతో చెప్పిన కథల సముదాయమే పరికథ అని అభినవగుప్తుడు వివరించాడు.

భోజుడు ఈవిధంగా చెప్పాడు
పర్యాయేణ బహూనాం యత్ర ప్రతియోగినాం కథా(:) కుశలైః
శ్రూయన్తే శూద్రకవత్ జిగీషుభిః పరికథా సాతు.
అభినవగుప్తుడి నిర్వచనం ఈవిధంగా ఉంది.

ఏకంచ ధర్మాది పురుషార్థ ముద్దిశ్య ప్రకారవైచిత్రేణ అనంతవర్ణనప్రకారా పరికథా.

భోజుడు తెలిపిన ఉదాహరణ శూద్రకుడి కథ. హేమచంద్రుడు మాత్రం అభినగుప్త భోజులు చెప్పిన లక్షణాలను సమీకరించి నిర్వచించాడు. 'పర్యాయ' అన్నపదం 'పరి' అన్నపదం యొక్క వివరణ. ఈ కథాభేదంలో ఆపదం భిన్నమైన అర్థాలలో భోజుడి చేత, అభినవగుప్తుడి చేత ప్రయోగింపబడింది. ఒక్క విషయంలో మాత్రం ఇద్దరిదీ ఏకాభిప్రాయమే - పరికథ అన్నది కథలసముదాయం.

బౌద్ధసాహిత్యంలో 'పరికథ' లభిస్తుంది. 'శీలపరికథా' 'సంభారపరికథా', 'కలియుగ పరికథా' మొదలైనవి ఉన్నాయి. కాని ఇవి కథల తోరణాలు మాత్రం కావు. 'పరి' అన్న ఉపసర్గ ఈ అర్థం ఇవ్వదు. ఉపసర్గలను ముఖ్యమైన పదాలకు చేర్చడం బౌద్ధుల సంస్కృతంలో పరిపాటి అయింది. 'అభిధర్మ' 'పరినిర్వాణ' మొదలైన పదాలు ఇందుకు ఉదాహరణలు.

కథాకుశలురు కథనకళలో ఒకరినొకరు మించు కోరికతో ఒకరి తరువాత ఒకరు కథలు చెప్తారని భోజుడు చెప్పాడు. పురుషార్థాలలో ఒకదానిపై విషయం ఇవ్వగా, పలురకాలైన కథలను, భిన్నరీతులలో, ఒకరి తరువాత ఒకరు చెప్పినట్లయితే పరికథ అవుతుందని అభినవగుప్తుడు అన్నాడు. పరికథ ఏ భాషలో రచించాలో భోజుడు చెప్పలేదు. అభినవగుప్తుడు తనలోచనంలో పరికథ ఏ భాషలోనైనా రచింపబడవచ్చునని అంటాడు.

పూర్వేషాంతు ముక్తకాదీనాం భాషాయా మనియమః

కాని భోజుడి టీకాకారుడైన రత్నేశ్వరుడు భోజుడు చెప్పిన 'జాతి' అన్న అలంకారం గురించి వివరిస్తూ 'పరికథ', 'ఖండకథ ప్రాకృతభాషలో రచింపబడునని చెప్పాడు. చిలుకను రాయబారిగా చేసి చెప్పిన 'శూద్రకథ' నుండి ప్రాకృత భాగమొకటి భోజుడు ఉదాహరణగా

చెప్తాడు. దీనిని బట్టి పరికథ ప్రాకృతభాషలో రచింపబడుతుందని నిశ్చయమవుతుంది.

ఖండకథ

ఒకపెద్ద రచన నుండి చిన్న వృత్తాంతము (episode) ఒకటి తీసుకుని వ్రాసినది ఖండకథ. ఇందుమతి దీనికి ఉదాహరణ. బహుశా భోజుడు ఉదాహరించిన ఇందుమతి ఎవరో కవి వ్రాసిన చిన్నకథ కావచ్చు. రఘువంశంలో అజుడి గురించి, ఇందుమతి గురించి ఉంది. విషయం ఇదే కావచ్చు.

గ్రంథాంతర ప్రసిద్ధం యస్యామితి వృత్తముచ్యతే విభుధై:
మధ్యాదుపాన్తతోవా సా ఖణ్ణకథా యథేన్దుమతీ

ఇది ప్రాకృత భాషలో రచింపబడుతుందని ఆనందవర్ధనుడు చెప్పాడు. - శృంగార కంఠాభరణ వ్యాఖ్య లో ఈ విషయం చెప్పాడు.

ఆనందవర్ధనుడి అభిప్రాయానుసారం ఇది సకలకథవలె శ్లోకాలలో ఉంటుంది. సకలకథ గురించి భోజుడు ప్రస్తావించలేదు.

ఖణ్డకథా సకలకథయో: ప్రాకృత ప్రసిద్ధయో:
కులకాది నిబన్ధన భూయస్త్వాత్ దీర్ఘసమాసాయామపి నవిరోధ:

కులకమని చెప్పడంలో శ్లోకరూపంలో రచింపబడిందని చెప్పడమన్నమాట.

ఉపకథ

యత్రాశ్రిత్య కథాన్తరమతి ప్రసిద్ధం నిబధ్యతే కవిభి:
చరితం విచిత్రమన్యత్ సోపకథా చిత్రలేఖాది.

ముఖ్యకథ మధ్య వచ్చే అవాంతరకథను ఉపకథ అంటారు. ఇది ప్రసిద్ధమైనది- ఉపకథకు ఉపాఖ్యానానికి ఈవిధంగా సామ్యం కనిపిస్తుంది. భోజుడు ఉదాహరణకు 'చిత్రలేఖ' గురించి చెప్తాడు. 'చిత్రలేఖ' ప్రత్యేకమైన రచనో లేక మరో రచనలోని అధ్యాయమో, భాగమో తెలియదు. బహుశా మరొకరచనలోని భాగమయి ఉండవచ్చు.

బృహత్కథ

దండి, భామహుడు బృహత్కథను కథగా (కథ -ఆఖ్యాయికలలోని కథగా) పరిగణించారు. బృహత్కథ యొక్క ప్రాముఖ్యతను, ప్రత్యేకతను విశేషంగా గుర్తించిన

భోజుడు ఇదొక ప్రక్రియాభేదంగా పేర్కొంటాడు. బృహత్కథకు లంభములు అన్న అధ్యాయాలున్నాయి. అద్భుతార్థమైన మహావిషయముంది. ఈ గ్రంథం పైశాచీభాషలో రచింపబడింది. ఈ వర్ణన గుణాఢ్యుని బృహత్కథకే చెందుతుంది.

'అద్భుతార్థాం బృహత్కథామ్' - దండి కావ్యప్రకాశం - I, 38 పుట. అన్న దండి వాక్యాన్ని అనుసరించి భోజుడు చెప్పాడు. పరిచ్ఛేద విభజనం, వాటికి లంభములు అన్న పేరు. బృహత్కథకే చెందుతాయని భోజుడి అభిప్రాయం. అధ్యాయాలకు పేరు పెట్టడం చాల స్వల్ప విషయమని అతడన్నాడు.

భేదశ్చ దృష్టో లమ్భాదిః ఉచ్ఛ్వాసో వాస్తు కిం తతః

అధ్యాయం యొక్క పేరు లంభము కావచ్చునని, ఆపేరు బృహత్కథలో ఉండే అధ్యాయాలకే చెందనక్కరలేదని, సాధారణంగా ఏకథలో వచ్చిన అధ్యాయాలకేనా చెందవచ్చునని దండి అన్నాడు. కాబట్టి బృహత్కథ కాకుండా లంభములు కల ఇతర కథలు కూడా ఉన్నవని అనుకోవలసి వస్తుంది. వాడీ జంఘౌలుడు దండిపై వ్రాస్తూ మందారవతీ లంభము, రతి లంభము, అన్న రెండు లంభాలు కల కొత్త కథ గురించి ప్రస్తావించాడు.

అగ్ని పురాణం

ఆనందవర్ధనుడు భోజుడు, చెప్పిన వాటిని దృష్టిలో ఉంచుకొని, అగ్నిపురాణంలో శ్రవ్యకావ్య భేదాల గురించి వ్రాసి ఉంది.

గద్యం చరణరహితపద సమూహం. భేదాలు మూడు. అవి

1. చూర్ణకం 2. ఉత్కలిక 3. వృత్తసంధి.

అపాదో పదసంతానో గద్యం తదపి గద్యతే
చూర్ణికోత్కలికావృత్తసంధిభేదాత్ త్రిరూపకమ్.

అల్పాల్ప సమాసాలతోకూడినది, కర్కశమైన పదాలు కలది అయిన గద్యం చూర్ణకం.

దీర్ఘములైన సమాసాలు కల గద్యం ఉత్కలిక

ఏ గద్యంలో శబ్దావళి నాతి కోమలము, నాతి కర్కశముకాదో, దేనిలో ప్రౌఢసమాసాలు ప్రయోగింపబడ్డవో, క్షీణించుతున్న వృత్తచ్ఛాయలు దేనిలో కనుపడునో ఆగద్యం వృత్తసంధి.

అల్పాల్ప విగ్రహం నాతి మృదు సందర్భనిర్భరమ్

చూర్ణకం నామతో దీర్ఘసమాసోత్కలికా భవేత్

భవేన్మధ్యమసందర్భ నాతి కుత్సిత విగ్రహమ్
వృత్తచ్ఛాయా హరం వృత్త సంధి నైతత్కిలోత్కటమ్.

అగ్నిపురాణం - 337 అధ్యాయం - 10,11 శ్లోకాలు

గద్యకావ్యభేదాలు

1. ఆఖ్యాయిక 2. కథ 3. ఖండకథ 4. పరికథ
5. కథానిక ఈ అయిదు గద్యకావ్య భేదాలు.

ఆఖ్యాయికే కథా ఖణ్డకథా పరికథా తథా
కథానికేతి మన్యంతే గద్యకావ్యం చ పంచథా

అగ్నిపురాణం - కావ్యశాస్త్రీయ భాగం 12వ శ్లోకం

ఆఖ్యాయిక

ఏ గద్యకావ్యమందు గ్రంథకర్తయొక్క వంశప్రశస్తి విస్తరంగా చెప్పబడుతుందో, కన్యాహరణం, సంగ్రామం, విప్రలంభం వలన జనించిన విపత్తులు ఉన్నదో, దేని యందు రీతి, వృత్తి, ప్రవృత్తి అనునవి చమత్కృత రూపాలలో ఉపయోగింపబడ్డాయో. దేని కథా భాగాలను ఉచ్ఛ్వాసాలని పిలుస్తారో, దేనియందు చూర్ణకమను గద్యం ప్రయోగింపబడుతుందో, దేనియందు కథా నాయకుడు స్వముఖంగా కథను చెప్పడం కాని, లేక మరి యొక పాత్ర చెప్పడం కాని జరుగుతుందో, దానిని ఆఖ్యాయిక అన్న పేరు కల గద్య కావ్యంగా పరిగణిస్తున్నారు.

కృతవంశప్రశంసా స్యాదత్ర గద్యేన విస్తరాత్
కన్యాహరణ సంగ్రామ విప్రలమ్భ విపత్తయః
భవంతి యత్ర దీప్తాశ్చ రీతివృత్తి ప్రవృత్తయః
ఉచ్ఛ్వాసైక పరిచ్ఛేదో యత్ర యా చూర్ణకోత్తరా
వక్త్రం వాపరవక్త్రం వా యత్ర సాఖ్యాయికా స్మృతా 1/13-15

కథ

కథయందు గ్రంథకారుడు శ్లోకాలలో తన వంశము యొక్క ప్రశంసను చేస్తాడు - ఆ విధంగానే ముఖ్యకథ యొక్క అవతరణకోసం అవాంతరకథను సృష్టిస్తాడు. ఆ కథ

యందు అధ్యాయాల విభజన పరిచ్ఛేదమన్న పేరుతో చేయబడదు. దానిని లంభముగా పిలుస్తారు.

శ్లోకః స్వవంశం సంక్షేపాత్ కవిర్యత్ర ప్రశంసతి ముఖ్యార్థస్యావతారాయ భవేద్యత్ర కథాంతరమ్ పరిచ్ఛేదో నయత్ర స్యాద్భవేద్వా లంభకైః కదాచిత్ సా కథానామ

అగ్నిపురాణ కావ్యశాస్త్రీయభాగం -1/15, 16, 17 శ్లోకాలు

ఖణ్డకథ

గద్యకావ్యాలలో ఒకటి -కవి కథాకావ్యంలో చతుష్పదీప్రయోగం చేస్తాడో దానిని ఖండకథ అంటారు.

సాకథా నామ తద్గర్భే నిబంధీయాత్ చతుష్పదీమ్ భవేత్ఖండకథా.

అగ్ని పురాణం - కావ్య శాస్త్రీయ భాగం - 1/18

పరికథా

గద్యకావ్యభేదం - దీని నాయకుడు రాజు యొక్క మంత్రిగాని, వ్యాపారికాని, బ్రాహ్మణుడు కాని అవుతాడు. రసాలలో కరుణ మాత్రమే ఉపయోగింపబడుతుంది. నాలుగు రకాల విప్రలంభశృంగారం ఉపయోగింపబడుతుంది. దీని యందు ఘటన సంపూర్ణమవుతుంది. కాని, కథ అన్న గద్య కావ్యంలో, ఘటన సగం దూరంలోనే విడిచిపెట్టబడుతుంది.

యాసా కథా పరికథా తయోః
అమాత్యం సార్థకం వాపి ద్విజం వా నాయకం విదుః
స్యాత్తయోః కరుణం విద్ధి విప్రలంభశ్చతుర్విధః
సమ్భావ్యతే తయోర్నాద్యా సాకథా మనుధావతి.

అగ్ని పురాణం - కావ్యశాస్త్రీయభాగం - 1/18, 19

కథ, ఆఖ్యాయికల మిశ్రితరూపమే పరికథ
కథాఖ్యాయిక యోర్మిశ్రభావాత్ పరికథా స్మృతా

అగ్ని పురాణం - కావ్యశాస్త్రీయ భాగం

కథానిక

గద్యకావ్య భాగమైన కథానిక యొక్క కేంద్రీభూతమైన విషయం ఉదాత్తం కాకపోయినా

సునియోజితమైన విషయం ఉంటుంది. దీనిలో కరుణ, భయానక అద్భుతరసాలు పరిపక్వాన్ని పొందుతాయి. కథానిక యొక్క ప్రారంభమందు భయానకరసం, మధ్యమందు కరుణరసం అంతమందు అద్భుతరసం వినియోగింపబడాలి.

భయానకం సుఖపరం గర్భేచ కరుణోరసః
అద్భుతాన్తే సుక్లుప్తార్థో నోదాత్తా సా కథానికా

అగ్నిపురాణం - కావ్య శాస్త్రీయభాగం 1/2

ఈ కథానిక అన్న గద్యకావ్య భేదం నేటి షార్ట్‌స్టోరీకి సమానమైనదని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు. పురాతన కథానికా లక్షణాలలో కొన్ని, నేటి షార్ట్‌స్టో లక్షణాలకు సరిపోయినా, దురదృష్టవశాత్తు మనకు సంస్కృతంలో ఉదాహరణలేవి లభించడం లేదు.

ఈ కథాభేదాలలోనే 'కథానకము' అన్న సాహిత్య ప్రక్రియ మనకు లభిస్తుంది. అది షార్ట్‌స్టోరీకి మాత్రం ఉదాహరణకాదు - చిన్న కథ అన్న అర్థం మాత్రం ఇస్తుంది.

కథానకాలు జైనగ్రంథాల వ్యాఖ్యానాలలో లభిస్తాయి. వీటిని స్వతంత్రంగా కూడ రచించారు. కావ్యాలుగా వ్రాశారు.

కాలాచార్య కథానకం, కుమారచరిత కథానకం, పాపబుద్ధి - ధర్మబుద్ధి కథానకం మొదలైనవి ఈ కోవకు చెందుతాయి.

ప్రాచీన భారతీయ కథా వాఙ్మయం కథలకు పుట్టినిల్లు. కేవలం కథనానికి ప్రాముఖ్యం ఇవ్వడం కాకుండా సాహిత్యపు విలువలను ఈ వాఙ్మయం పోషించింది. వినోదానికి విజ్ఞానానికి ఇది గని. విష్ణుశర్మ వంటి మహాపండితులు రాజ్యతంత్రాన్ని కథలలో చెప్పారు. గుణాఢ్యుడి బృహత్కథకు మించినది లేదు.

ఇది సంగ్రహంగా ప్రాచీన భారతీయ కథా
వాఙ్మయం యొక్క స్వరూప స్వభావాలు.

- శుభం -

ఆధార గ్రంథాలు

1. winternitz - History of sanskrit literature - Part. III
2. Bhoja's Srinagara Prakasa. - V.Raghawan.